ఆగస్టు
2026

244

సంపుటి : 22  సంచిక : 3

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

మహా విప్లవకారుడు, మానవీయ నేత  ఫైడెల్ కాస్ట్రో
గ్రామీణ భారతంలో వర్గాల సామాజిక- ఆర్థిక లక్షణాలు
జెన్ జీ : వర్గ పోరాటం
అయోధ్య రాముని దోచుకున్న ఆర్ఎస్ఎస్ పరివారం
క్రీ.శ.12-15 శతాబ్దాల ఆర్థిక పరిస్థితులు-2
బొద్దింకల ప్రజాస్వామ్యం:  నిరాయుధమైనది ఇంకా  ప్రమాదకరమైనది
105 ఏళ్ల చైనా కమ్యూనిస్టు పార్టీ: విప్లవం, సోషలిస్టు నిర్మాణంలో శతాబ్దపు అనుభవం
వాతావరణమార్పులు:  మురికివాడలు
బాలలే లక్ష్యంగా ఇజ్రాయిల్ జనహననం


శతజయంతి నివాళి

# మహా విప్లవకారుడు, మానవీయ నేత ఫైడెల్ కాస్ట్రో

ఎస్ వెంకట్రావు

**20వ** శతాబ్దం ప్రసవించిన మహా విప్లవ కారుల్లో ఒకడు, మహత్తర కమ్యూనిస్టు యోధుడు ఫైడల్ కాస్ట్రో. సహచరుడు చే గువేరా, సోదరుడు రావుల్ కాస్ట్రో తదితరులతో కలిసి క్యూబాను అమెరికా సామ్రాజ్యవాద పదఘట్టనలనుండి విముక్తి చేయడమే కాకుండా అక్కడ సోషలిజం నిర్మాణంలోనూ, సామ్రాజ్య వాదులనుండి దాన్ని రక్షించుకోవడంలోనూ క్యూబా ప్రజలకు స్ఫూర్తి దాయకమైన నాయకత్వం అందించాడు. భూగోళ రాజకీయా ల్లోనూ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ వచ్చిన ఉత్పాతాలను అదిగమించి క్యూబా ప్రజలను సోషలిస్టు పథంలో నడిపించిన గొప్ప ప్రజానాయకుడు ఆయన. ప్రపంచ వ్యాపితంగా అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తినివ్వడమే కాదు ప్రత్యక్షంగా కూడా సహకారం అందించిన అంతర్జాతీయ కమ్యూ నిస్టు నేత. మార్క్సిజం–లెనినిజం పట్ల అచంచల విశ్వాసం గల కాస్ట్రో జీవితాంతం ఆ సిద్ధాంతా నికి కట్టుబడి పనిచేశారు. ఫైడల్ కాస్ట్రో పూర్తి పేరు 'ఫైడల్ అలెజాండ్రో కాస్ట్రో రూజ్'. ఆయన 1926 ఆగస్టు 13న జన్మించి, 2016 నవంబర్ 25న తన 90వ ఏట మరణించారు. ఈ నెల 13వ తేదీన ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిస్టులూ, అభ్యుదయ వాదులూ కాస్ట్రో శతజయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు.

కాస్ట్రో, 1959లో క్యూబాలో విప్లవం విజయం సాధించింది మొదలు 1976 వరకు ప్రధానమంత్రిగా, 1976 నుండి 2008 వరకు అధ్యక్షుడిగా, 1965 నుండి 2011 వరకు క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ ప్రథమ కార్యదర్శిగా పనిచేశారు. ఈ కాలంలో ఆయన ప్రపంచానికి సోషలిస్టు స్ఫూర్తిని చాటడం, క్యూబాను సోష లిస్టు పథంలో నడపడం మాత్రమే కాదు, లాటిన్ అమెరికా ప్రజలకు ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక పంథా అందించడంలో గొప్ప కృషి చేశారు.



13-8-1926 25-11-2016

**ఆగస్టు 13న కాస్ట్రో శతజయంతి**

### చిన్నతనం నుండే తిరుగుబాటు తత్వం

కాస్ట్రో తండ్రి ఏంజెల్ కాస్ట్రో వై ఆర్గిజ్, వాయువ్య స్పెయిన్‌లోని గలీసియా నుండి క్యూబాకు వలస వచ్చారు. తల్లి లీనా రూజ్ గొంజాలెజ్. శాంటియాగో డి క్యూబాలో పాఠశాల విద్య నభ్యసించిన కాస్ట్రో 1945లో హవానా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యార్థిగా చేరాడు. అక్కడ ఆయన విద్యార్థి ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ స్టూడెంట్స్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం, కరేబియన్ దేశాల్లో అమెరికా జోక్యాన్ని వ్యతిరేకించడం ప్రారంభించాడు. అదే సమయంలో నాటి క్యూబా అధ్యక్షుడు రామోన్ గ్రావ్ సాన్ మార్టిన్ ప్రభుత్వంలోని అవినీతి, హింసకు వ్యతిరేకంగా జరిగిన పోరా టాల్లో చురుకుగా పాల్గొన్నాడు. ఈ విషయంపై 1946 నవంబర్‌లో ఆయన చేసిన ప్రసంగం అనేక వార్తాపత్రికల మొదటి పేజీలో ప్రచురితమైంది.

1947లో కాస్ట్రో, ఎడ్వర్డో చిబాస్ స్థాపిం చిన పార్టీ ఆఫ్ ది క్యూబన్ పీపుల్ (పార్టిడో ఆర్థోడాక్సో)లో చేరాడు. 1948 సాధారణ ఎన్నికలలో చిబాస్ మూడవ స్థానంలో నిలిచాడు. విద్యార్థులపై ప్రభుత్వ దాడులు పెరగడంతో కాస్ట్రో వాటికి నిరసగా జరిగిన ఉద్యమాల్లో మరింత చురుగ్గా పాల్గొన్నాడు.

ఈలోగా 1947 జూన్‌లో, డొమినికన్ రిపబ్లిక్‌లో రాఫెల్ ట్రుజిల్లో నియంతృత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద తిరుగుబాటు లేచింది. ఆ తిరుగుబాటులో కాస్ట్రో చేరాడు. అమెరికా అండదండలతో తిరుగుబాటు అణచివేయబడింది. కాస్ట్రో అరెస్టు నుండి తప్పించుకున్నాడు. హవానాకు తిరిగి వచ్చిన కాస్ట్రో, ప్రభుత్వ అంగరక్షకుల చేతిలో ఒక ఉన్నత పాఠశాల విద్యార్థి హత్యకు నిరసనగా జరిగిన విద్యార్థుల ఆందోళనలలో ప్రముఖ పాత్ర పోషించాడు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 1948లో కార్యకర్తలకు, పోలీసులకు మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలలో కాస్ట్రో తీవ్రంగా గాయపడ్డాడు.

ఏప్రిల్ 1948లో కాస్ట్రో ఇంటర్ అమెరికన్ స్టూడెంట్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేం దుకు కొలంబియాలోని బొగోటాకు వెళ్లాడు. అక్కడ వామపక్ష నాయకుడు జార్జ్ ఎలియెసర్ గైటాన్‌తో కాస్ట్రో కలుసుకోవడానికి కొద్ది గంటల ముందే ఆయనను సైన్యం హత్య చేసింది. దాంతో అధికార కన్సర్వేటివ్‌లకు, వామపక్ష లిబరల్స్‌కు మధ్య అల్లర్లు, ఘర్షణలు జరిగాయి. కాస్ట్రో లిబరల్స్ పక్షాన పోరాటంలో పాల్గొన్నాడు.

కొలంబియా నుండి క్యూబాకు తిరిగి వచ్చిన తర్వాత, బస్సు ఛార్జీల పెంపుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో ప్రముఖంగా పాల్గొన్నాడు. ఈ ఉద్యమంతో కాస్ట్రో క్యూబాలో ఒక ప్రముఖ వ్యక్తిగా మారారు. ఈ కాలంలోనే కాస్ట్రో మరింత వామపక్ష భావజాలం వైపు మొగ్గుచూపాడు. క్యూబా సమస్యలకు కారణం, అవినీతి, రాజకీయ నాయకుల వైఫల్యాలు కావు, పెట్టుబడిదారీ వ్యవస్థే ప్రధాన కారణం అని గ్రహించాడు. క్యూబాలో ఉన్నది ప్రజాస్వామ్యం కాదనీ, అది వాస్తవానికి "బూర్జువా వర్గ నియంతృత్వం" అని గ్రహించాడు. కార్మికవర్గ విప్లవం ద్వారా మాత్రమే అర్థవంతమైన రాజకీయ మార్పును తీసుకురాగలమనే మార్క్సిస్ట్ దృక్పథాన్ని స్వీకరించాడు. క్యూబా రాజధాని హవానాలోని అత్యంత పేద ప్రాంతాలను సందర్శిస్తూ, ఆయన విద్యార్థుల జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. 1950 సెప్టెంబర్‌లో ఆయన డాక్టర్ ఆఫ్ లా పట్టా పొందాడు.

విశ్వవిద్యాలయ విద్యను పూర్తి చేసిన

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...

1. మహా విప్లవకారుడు, మానవీయ నేత ఫైడెల్ కాస్ట్రో
ఎస్ వెంకట్రావు..........2
2. గ్రామీణ భారతంలో వర్గాల సామాజిక- ఆర్థిక లక్షణాలు
వికె రామచంద్రన్.......4
3. జెన్ జీ : వర్గ పోరాటం
విజయ ప్రసాద్.......9
4. అయోధ్య రాముని దోచుకున్న ఆర్ఎస్ఎస్ పరివారం
నళిన్ వర్మ.....13
5. క్రీ.శ.12-15 శతాబ్దాల ఆర్థిక పరిస్థితులు-2
ఎంవి ఎస్ శర్మ.......17
6. బొద్దింకల ప్రజాస్వామ్యం: నిరాయుధమైనది ఇంకా ప్రమాదకరమైనది
అరుంధతీ రాయ్........19
7. 105 ఏళ్ల చైనా కమ్యూనిస్టు పార్టీ: విప్లవం, సోషలిస్టు నిర్మాణంలో శతాబ్దపు అనుభవం
విజయ ప్రసాద్, శిరన్ ఇల్లనపెరుమ......23
8. వాతావరణమార్పులు: మురికివాడలు
లారా స్వీన్నీ........26
9. బాలలే లక్ష్యంగా ఇజ్రాయిల్ జనహననం
ఎ కోటిరెడ్డి ......30

సంపాదకుడు :
ఎస్.వెంకట్రావు

సంపాదక వర్గం :
బి.వి.రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్.వీరయ్య
తెలకపల్లి రవి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org

# బొద్దింకలు తిరగబడ్డాయ్

అవును బొద్దింకలే అవి. ఢిల్లీలో అత్యున్నత పీఠాలను ఆక్రమించిన అధికార శక్తులు వాళ్లను బొద్దింకల్లానే పరిగణించారు కనుక అవి బొద్దింకలే. తల్లిదండ్రులు జీవితాంతం కష్టపడినదంతా దారపోసి ఉన్నత చదువులు చదివిస్తే ఉద్యోగాల్లేక, ఉపాధి దొరకక రోడ్లమీద సందుల్లో గొందుల్లో ఎక్కడబడితే అక్కడ తిరుగుతున్న వాళ్లందరికీ మన అత్యున్నత న్యాయస్థానాధిపతి "బొద్దింకలు" అని నామకరణం చేసినప్పటి నుండి ఆ పేరుతో అవి మీడియాలో చక్కర్లు కొడుతున్నప్పటికీ నిజానికి ఈ బొద్దింకలు ఈ నాటివి కావు. పెట్టుబడిదారీ సమాజం ఏర్పడినప్పటి నుండీ ఆ సమాజంతోపాటే పెరుగుతూ వస్తున్నాయి. బొద్దింకల బ్రతుకుల నుండి విముక్తి కోసం నానా మార్గాల్లో ప్రయాణించి చివరికి అన్ని మార్గాలూ మూసుకుపోవడంతో తిరుగుబాటు మార్గం పట్టిన బొద్దింకలవి. అందువల్ల గతంలో లాగా కులాలు, మతాలు, ప్రాంతాలు వగైరా ఏ మార్గం దొరికితే ఆ మార్గం పట్టి చివరికి తిరుగుబాటే మార్గం అని ప్రకటించిన ఈ బొద్దింకలు చాలా "ప్రమాదకరమైనవి". అవి ఎంత ప్రమాదకరమైనవో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అధికార శక్తులు చూసాయి. లాఠీలకు, తూటాలకు, వాటర్ క్యానన్లకు ఎదురునిలిచి వీరోచితంగా పోరాడిన ఈ నిరుద్యోగ యువ బొద్దింకలు చివరికి ఈ దేశ విద్యావ్యవస్థలో నెలకొన్న అస్తవ్యవస్థ పరిస్థితులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి చేత రాజీనామా కూడా చేయించాయి.

నరేంద్ర మోడీ ప్రభుత్వమూ, దాన్ని వెనకనుండి నడుపుతున్న ఆర్ఎస్ఎస్ పరివారమూ ఈ దేశంలోని అన్ని వ్యవస్థల్లోకీ ఎక్కిస్తున్న హిందూత్వ విద్వేష విషానికి విరుగుడు లేదనీ, కాషాయ పరివారపు ఎదురుదాడిని అడ్డుకోవడం అసంభవమనీ భావిస్తున్న వాళ్లకు వారి ఆలోచన తప్పని మరోమారు నిరూపించింది బొందికల జనతా పార్టీ పేరుతో ముందుకొచ్చిన భారతీయ యువతరం. మరోమారు అని ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే ఇంతకు ముందే భారతీయ రైతాంగం ఢిల్లీలో ఏడాది పాటు వీరోచిత పోరాటం చేసి మోడీ ప్రభుత్వ మెడలు వంచి మూడు రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కు తిప్పి కొట్టగలిగింది. అందువల్ల నాటి రైతు పోరాటం గానీ, నేటి యువత పోరాటం గానీ చెపుతున్న దొకటే: ఆర్ఎస్ఎస్-బిజెపి నాయకత్వంలోని నయా-ఉదారవాద, హిందూత్వ కాక్‌టైల్ విధానాల కాలకూట విషపు ప్రమాదం గురించి ప్రజలు తెలుసుకుంటున్నారు. తిరగబడుతున్నారు.


ప్రపంచ వ్యాపితంగా నయా-ఉదారవాద విధానాలు ఘోరంగా విఫలం కావడం వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో పడింది. దేశాల మధ్య, ప్రజల మధ్య తీవ్రమైన ఆర్థిక అసమానతలు పెరిగిపోతుండడం, నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం కోరలు చాస్తుండడం, దీని ఫలితంగా ఏర్పడుతున్న వాణిజ్య యుద్ధాలు, దురాక్రమణ యుద్ధాలు, సామూహిక జనహననాలు.. ఇవన్నీ ప్రజల్లో అసంతృప్తిని కట్టలు తెంచుతున్నాయి. అమెరికాలో, యూరప్‌లో మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచమంతటా ప్రజా ఉద్యమాల రూపంలో ఇవి వ్యక్తమవుతున్నాయి. మన చుట్టుపక్కల శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జెన్ జి తిరుగుబాట్లకు ఈ అసంతృప్తే కారణం.

భారత దేశంలో కూడా ఇటీవలి కాలంలో ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావడానికీ, నేడు కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో యువత తిరుగుబాటుకూ ఈ అసంతృప్తే కారణం. దీన్ని భారత దేశపు జెన్ జి తిరుగుబాటుగా అభివర్ణిస్తున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహిస్తూ ఇంటర్ నెట్‌లో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఏర్పడిన వ్యంగ్య ఉద్యమం కాస్తా కొద్ది రోజుల్లోనే లక్షలాది మంది యువతను ఆకర్షించి ఒక ప్రజా ఉద్యమంగా పరిణమించిందంటే పైకి అది విద్యావ్యవస్థ ప్రక్షాళన కోసం, విద్యా మంత్రి రాజీనామా కోసం ఏర్పడిన ఉద్యమంగా కనిపించినా దాని వెనుక ఎన్నాళ్ల నుండో యువతలో గూడుకట్టుకుని ఉన్న ఆవేదన, అసంతృప్తి ప్రధాన కారణం. జంతర్ మంతర్ ఉద్యమం స్పాంటేనియస్‌గా ముందుకొచ్చినప్పటికీ, ఎస్ఎఫ్ఐ వంటి సంఘటిత విద్యార్థి ఉద్యమం దాని వెనకనుండి నడపడం వల్లనే అది స్థిరంగా ప్రకటిత లక్ష్యం సాధించే వరకు నడిచిందన్న విషయాన్ని కూడా గుర్తించాలి.

అందువల్ల జంతర్ మంతర్ ఉద్యమం అనేక విధాలా ఆహ్వానించదగ్గది. అయితే, దాని పరిమితులను కూడా గమనంలో పెట్టుకోవాలి. ఈ ఉద్యమం పెట్టుబడిదారీ సంక్షోభ లక్షణాల్లో ఒక దానికి వ్యతిరేకంగా జరిగింది. నిస్సందేహంగా విజయం సాధించింది. కానీ ప్రత్యామ్నాయాల కోసం పోరాడ్డం ద్వారా మాత్రమే నయా-ఉదారవాద విధానాలనూ, దానికి కాపలా కాస్తున్న మతోన్మాదాన్నీ తుదకంటా తిప్పికొట్టగలం. దేశంలో వివిధ సమస్యలపై, వివిధ వర్గాలు జరుపుతున్న పోరాటాలన్నిటినీ ఒక మహాపోరాటంగా మార్చేందుకు ఐక్య కృషి జరగాల్సిన తరుణం ఆసన్నమయింది.

ఈ మాసం ముఖ్యాంశం

# గ్రామీణ భారతంలో వర్గాల సామాజిక-ఆర్థిక లక్షణాలు



రచయిత ప్రముఖ విద్యావేత్త, ఎఐకెఎస్‌తో దీర్ఘకాలిక అనుబంధం ఉన్న డెవలప్‌మెంటల్ ఎకనామిస్ట్

**వికె రామచంద్రన్**

భారతదేశం లోని గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఏ ఆర్థిక సమస్యలకన్నా మించిన విస్తృతమైనవి. గ్రామీణ భారతంలో దాదాపుగా వందకోట్లమంది జనాభా నివసిస్తున్నారు. ఏ కుటుంబం అన్నా తన ఆదాయంలో మూడవ వంతు తిండి గడవడం కోసం ఖర్చు చేస్తుందంటే ఆ కుటుంబం పేదరికాన్ని అనుభవిస్తుంది అనేది సాధారణ సూత్రం. ఈ లెక్క ప్రకారం మన గ్రామీణ ప్రాంత జనాభాలో 80శాతం మంది పేదరికంలో మగ్గిపోతున్నారని నిర్ధారణ అవుతుంది.

వ్యవసాయ తరగతుల జనాభా అధ్యయన బృందం నివేదిక 2015 విడుదల అయిన నేపథ్యంలో గ్రామీణ భారతంలోని వర్గాల సామాజిక-ఆర్థిక లక్షణాలలో వచ్చిన మార్పులను అంచనా కట్టేందుకు అవకాశం వచ్చింది. భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వేతన కూలీల స్థితిగతులను వివరించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

ఆ నివేదిక పూర్తి పాఠాన్ని ఇక్కడ పున:ప్రస్థావించడం నా ఉద్దేశ్యం కాదుగానీ అవసరమైన మేర అందులో భాగాల ఉటంకింపు ఉంటుంది. అధ్యయన బృందం నివేదిక వెలువడిన తరువాత దాని ఆధారంగా జరిపిన సర్వేలు, అధ్యయనాల సమాచారాన్ని కూడా అక్కడక్కడా నేను ఉదహరించదలిచాను. ప్రధానంగా ఎంచుకున్న ఉదాహరణలు బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులోని కావేరి డెల్టా లోతట్టు ప్రాంతాలకు చెందినవి. అలాగే గత దశాబ్ద కాలంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తిలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా ఈ వ్యాసం తడుముతుంది. రామ్ కుమార్ వ్యాసం(వచ్చే సంచికలో వెలువడుతుంది)లో ఈ అంశంపై మరింత లోతైన విశ్లేషణ లభిస్తుంది. గత దశాబ్ద కాలంలో భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో సంభవించిన వేగవంతమైన, సంక్షిప్తమైన మార్పులను పసిగట్టడంలో వ్యవసాయ పరిశోధనలు వెనుకబడకూడదు. ఇప్పుడు వ్యవసాయ వర్గాల సామాజిక-ఆర్థిక లక్షణాలలో వచ్చిన ప్రధాన మార్పులను మనం పరిశీలిద్దాం.

### భూస్వాములు-పెట్టుబడిదారీ రైతాంగం

సహజంగానే భూస్వాములు పెద్దఎత్తున సారవంతమైన వ్యవసాయ భూములను కలిగి ఉంటారు. ఈ భూస్వామ్య కుటుంబాలు ప్రస్థుతానికి పెట్టుబడిదారీ స్వభావాన్ని సంతరించుకున్నాయి. స్వతహాగా వాళ్ళు వ్యవసాయ పనులు చేపట్టరు. కూలీలను పెట్టి సాగు చేయించుకోవడమో, కౌలుకి ఇవ్వడమో లేక లీజుకి ఇవ్వడమో చేస్తుంటారు. వారసత్వంగా సంక్రమించిన ఈ భూమియే వాళ్ళకి ఆర్థిక బలాన్ని, హోదాను కల్పిస్తుంది. ఊళ్ళో ఉన్న భూముల మీద ఉన్న గుత్తాధికారం ద్వారా వాళ్ళు అధికారం చెలాయిస్తుంటారు.

గ్రామీణ ప్రాంతంలో ఇవాళ కొత్తగా ధనిక పెట్టుబడిదారీ రైతాంగం ఆవిర్భవించింది. భూస్వాముల మాదిరి కాకుండా గతంలో తమ భూముల్లో వ్యవసాయం చేసిన ధనిక, మధ్యతరగతి రైతాంగం నుండి కొత్తగా ఈ వర్గం ఆవిర్భవించింది. స్వాతంత్ర్యానంతర కాలంలో ప్రభుత్వం అనుసరించిన వ్యవసాయ విధానాలు తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పుల (ముఖ్యంగా హరిత విప్లవ కాలంలో) మూలంగా వ్యవసాయం, వాణిజ్యం, వడ్డీ వ్యాపారం, ఉద్యోగాల ద్వారా పోగుపడిన పెట్టుబడిని తిరిగి భూమి మీదే పెట్టుబడిగా పెట్టారు. ఆ విధంగా, వారసత్వంగా కన్నా ఉత్పత్తి పెరుగుదల, పెట్టుబడి పోగువేతల ద్వారా గ్రామీణ ప్రాంతంలో నయా-ధనిక రైతాంగంగా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకున్నది. ఈ పెట్టుబడిదారీ రైతాంగం ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, ఇతర మధ్యస్థ కూలీలకు చెందినవారు అవడం గమనార్హం. సామాజికంగా, ఆర్థికంగా పెద్దఎత్తున పలుకుబడి సముపార్జించుకుని ఆధిపత్య కూలీలుగా స్థిరపడ్డారు. వీళ్ళ స్వాధీనంలో ఉన్న భూములుగానీ, వాళ్ళ ఆదాయాలుగానీ, ఉత్పత్తి సాధనాల మీద వాళ్ళకు ఉన్న నియంత్రణ మూలంగా గానీ వీళ్ళు భూస్వాములతో సమ ఉజ్జీలుగా ఎదిగారు. చారిత్రక ఆవిర్భావంలో ఉన్న తేడాపాడాలు, ప్రాంతీయ విభేదాలను పక్కనపెట్టి భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతాంగం కలిసి ఒకే ఆధిపత్య వర్గంగా రూపుదిద్దుకుంది. గ్రామీణ భారతదేశంలో ఏకశిలా సదృశ్య ఆధిపత్య శక్తిగా మారింది.

ఈ రెండు వర్గాలు బంధువుల పేరిట, బినామీల పేరిట కలిగి ఉన్న భూములు కాకుండా స్వయంగా నలభై నుండి వందలాది ఎకరాల వ్యవసాయ భూములు కలిగి ఉన్నారని మా అధ్యయనంలో తేలింది. ఒక్క సమస్తిపూర్ గ్రామంలోనే (బీహార్) ఒకే ఒక కుటుంబం చేతిలో దాదాపు 400 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లాలో కొన్ని కుటుంబాల చేతుల్లో పంట భూములు, రొయ్యల/చేపల చెరువులు

కలిసి వందలాది ఎకరాలు ఉన్నవి. వీళ్ళు ఏటా మరింత పంట భూమిని, రొయ్యల/చేపల చెరువులని కొనుగోలు చేస్తూ ఇప్పుడు ఒడిషాలో కూడా భూములు హస్తగతం చేసుకునే స్థాయికి ఎదిగారు.

తాజాగా నిర్వహించిన గ్రామీణ ప్రాంత అధ్యయనాల్లో 5శాతం కుటుంబాలు ఆ ఊళ్ళో కనీసంగా 30 నుండి 60శాతం వ్యవసాయ భూములు కలిగి ఉన్నారని వెల్లడయ్యింది. అసమానతలు ఎంత పెద్దఎత్తున నెలకొని ఉన్నాయనే దానికి ఇదొక తార్కాణం. 2023లో నిర్వహించిన ఒక సర్వేలో పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో 5శాతం కుటుంబాలు 31శాతం వ్యవసాయ భూములు కలిగి ఉన్నాయని లెక్కతేలింది. 2018లో నిర్వహించిన మరొక సర్వేలో సమస్తిపూర్‌లో కేవలం 1 శాతం కుటుంబాల చేతుల్లో 32 శాతం వ్యవసాయ భూమి ఉన్నట్లు వెల్లడయ్యింది. 2019లో తమిళనాడులోని దిగువ కావేరీ డెల్టా ప్రాంతంలో నిర్వహించిన అధ్యయనంలో, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో నిర్వహించిన 'పైలట్ స్టడీస్'లో గానీ ఇవే ధోరణలు ప్రతి ఫలించాయి.

ఇంత భారీ ఎత్తున భూకమతాలు ఉన్న కుటుంబాలు దాపున ఉన్న నగరాలలోనో, రాష్ట్ర రాజధానులలోనో నివాసం ఉంటూ, వాళ్ళ కుటుంబానికి చెందిన ముసలిముతక ఊళ్ళోనే ఉండి ఆ భూముల్ని సంభాళించుకుంటూ వస్తున్నారు. తమిళనాడులోని నాగపట్నం జిల్లాలో ఒక భూస్వామి కుటుంబం 45 ఎకరాల స్వంత భూమితో పాటు మరో 73 ఎకరాలు భూమిని చేస్తున్నట్లు వివరించాడు. కానీ ఊళ్ళో జనం ఆయనకి స్వంతంగా 70 ఎకరాల భూమి ఉంది, అదనంగా మరో 120 ఎకరాల భూమి సాగు కూడా అతనే చూస్తున్నాడని వివరించారు. ఆ భూమి అంతా విదేశాల్లో నివసిస్తున్న ఆయన బంధువులదని తెలియవచ్చింది. అధికారిక లెక్కల ప్రకారమే ఆ ఊళ్ళో అతని కులానికే చెందిన వారి చేతుల్లో 61 శాతం వ్యవసాయ భూమి ఉన్నట్లు తెలియవచ్చింది. మూడింట రెండు వంతుల భూమి ప్రవాస భారతీయుల హక్కు భుక్తంలో ఉన్నాయి.

ఈ భూముల విలువ ఏటికేడాదికి పెరుగుతూ రావడంతో ఈ భూస్వాముల ఆస్తుల విలువా, సంపదా పెరుగుతూ వచ్చాయి. వ్యవసాయ భూముల మీదే కాకుండా ట్రాక్టర్లు, కొత్త యంత్రాలు, మోటార్లు తదితర ఉత్పత్తి సాధనాల మీద కూడా ఈ వర్గాల పట్టే ఉంది. భూమి మీద ఉన్న నియంత్రణ కన్నా ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం మరింత హెచ్చుగా ఉన్నది. అలాగే వ్యవసాయ ఉత్పత్తి ఆధారిత ఆస్తులే కాక బంగారం, డబ్బు, రియల్ ఎస్టేట్, ప్రైవేటు రవాణా, వ్యవసాయ గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్‌లు ఇలా ఇతరత్రా అనేక రూపాల్లో సంపద కేంద్రీకరణ నెలకొని ఉన్నది. సాధారణ భూస్వాముల కన్నా ఈ బడా పెట్టుబడిదారీ రైతాంగం గుణాత్మకంగా భిన్నమైన తరగతిగా పరిగణించాలి.

> **“ తాజాగా నిర్వహించిన గ్రామీణ ప్రాంత అధ్యయనాల్లో 5శాతం కుటుంబాలు ఆ ఊళ్ళో కనీసంగా 30 నుండి 60శాతం వ్యవసాయ భూములు కలిగి ఉన్నారని వెల్లడయ్యింది. అసమానతలు ఎంత పెద్దఎత్తున నెలకొని ఉన్నాయనే దానికి ఇదొక తార్కాణం. 2023లో నిర్వహించిన ఒక సర్వేలో పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో 5శాతం కుటుంబాలు 31శాతం వ్యవసాయ భూములు కలిగి ఉన్నాయని లెక్కతేలింది. ”**

భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతాంగ కుటుంబాల వ్యవసాయాధారిత ఆర్థిక సామ్రాజ్యం స్థాయి ఏమిటో అంచనా కట్టడానికి వివిధ రూపాల్లో వారి దగ్గర పోగుబడిన పెట్టుబడితో పాటు భూమి, యంత్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. గ్రామీణ సర్వేలలో సహజంగానే వీరికి ఉన్న పలుకుబడిరీత్యా సర్వే సిబ్బంది వీరు చెప్పినట్లు వీరి ఆదాయాలు తక్కువ చేసి చూపిస్తారు. కూరగాయల సాగులోగానీ చేపల, రొయ్యల, చెరువుల సాగులోగానీ ఎకరాకు ఎంత లేదన్నా హీనపక్షంగా 10-12 లక్షల ఆదాయం ఉంటుంది. ఈ లెక్కన 30 ఎకరాల భూస్వామి ఆదాయం ఏడాదికి కనీసంగా 3 కోట్లు రూపాయలు ఉంటుంది. ఇదీ ఒక భూస్వామి కుటుంబ ఆదాయం.

ఇవాళ వ్యవసాయాధారిత ప్రాంతాల్లో కౌలుదార్ల సాగు పెద్ద ఎత్తున విస్తరించడం మనకు స్పష్టంగా గోచరిస్తుంది. కౌలుకి ఇవ్వడం ద్వారా భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతాంగం తమ భూముల మీద, కౌలు మీద నియంత్రణ కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు వ్యవసాయం గిట్టుబాటు అవుతుంది అనుకుంటే ఈ వర్గం చిన్న రైతుల భూములను తామే లీజుకి తీసుకుని సాగుబడి చేయిస్తున్నారు. భీమవరంలో ఇలానే ఒక భూస్వామి చిన్నాచితకా చేపల, రొయ్యల చెరువులను గుత్తకి కౌలు తీసుకుని సాగు చేయిస్తున్నాడు. అదే పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతానికి వచ్చేసరికి ఇక్కడ వరి, చెరకు ప్రధాన పంటలుగా ఉన్నాయి కాబట్టి ఇక్కడ పంటసాగుకు కూలీల అవసరం ఎక్కువ. అందుకే ఇక్కడ భూస్వామ్యవర్గాలు ప్రత్యక్షంగా వ్యవసాయంలోకి దిగకుండా చిన్నాచితకా రైతులకు, రైతు కూలీలకు తమ భూములు కౌలుకు ఇస్తున్నారు. తద్వారా భూమి మీదా, కౌలుదార్లు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికుల మీద తమ పట్టు కొనసాగిస్తున్నారు.

భూస్వాములు గ్రామీణ భారతంలో ఆర్థిక ఆధిపత్యమేకాక కులం, లింగం తదితర ప్రతీఘాత సామాజిక ఆధిపత్యాలను, వివక్షను పెంచి పోషించే శక్తులుగా నిలదొక్కుకున్నారు. అందుకే ఒక సందర్భంలో ఇ.యం.యస్ నంబూద్రిపాద్ 'భూస్వామ్యం అనేది ఆర్థిక అంశం మాత్రమే కాదు, అది సామాజికమైనది, రాజకీయపరమైనది కూడా' అని వివరించారు.

భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతాంగం సామాజిక, ఆర్థిక లక్షణాలకు సంబంధించి పూర్తి వివరణ అధ్యయన నివేదికలో పొందుపరచబడి ఉన్నది. కాబట్టి ఆ వివరాలన్నీ నేను ఇక్కడ పూర్తిగా ప్రస్తావించడం లేదు. అయితే ఆ నివేదికలో వివరణాత్మక విశ్లేషణలు అన్నీ విలువైనవి, ప్రాసంగికత కలిగి ఉన్నవి. తప్పనిసరిగా మనం అధ్యయనం చెయ్యాల్సినవి. ముఖ్యమైన సారాంశం ఏమిటంటే – అధ్యయన నివేదికలో పేర్కొన్నట్లు భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతాంగం వర్గ బలం ఏ రీత్యా చూసినా క్షీణించలేదు అనేది మొదటి అంశం. ఇక రెండవ అంశం, ఈ వర్గం అదాయాలు, సంపదలు ప్రత్యక్ష వ్యవసాయోత్పత్తియేతర మార్గాల నుండి గణనీయంగా ఆర్జిస్తా ఉన్నాయి.

రాజ్యాధికారం చేపట్టిన పాలక వర్గాలతో ఈ వర్గం మిలాఖతు అవడాన్ని మనం స్పష్టంగా గుర్తించాలి. ఈ మిలాఖతు రీత్యానే పాలక వర్గాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కీలకమైన, సంక్లిష్టమైన వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించడానికి ముందు వెనుకలాడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ

> **“మన దేశ రైతాంగాన్ని ధనిక, మధ్య తరగతి, పేద రైతాంగం అని మూడు తరగతు లుగా వర్గీకరించవచ్చు. ఉత్పత్తి సాధనాల మీద ఉండే యాజమాన్య హక్కుల రీత్యా కుటుంబశ్రమరీత్యా, కూలీల వినియోగంరీత్యా, కుటుంబ ఆదాయాలరీత్యా మూడు తరగతుల రైతాంగం మధ్య భిన్నమైన తేడాలు ఉన్నాయి.”**

అభివృద్ధికి తగిన విధాన నిర్ణయాలు చేపట్టి భూస్వాముల, బడా పెట్టుబడిదారీ రైతాంగం కన్నెర్రకు గురి కావడానికి పాలకశక్తులు సిద్ధంగా లేవు. ఈ పరిస్థితులను ఉపయోగపెట్టుకుని గ్రామీణ ప్రాంత కష్టజీవులు వ్యవసాయానికి అసవరమైన ఇన్‌పుట్ సబ్సిడీలు, మెరుగైన గిట్టుబాటు ధరలు, మెరుగైన మార్కెట్ల అందుబాటు, చౌక వడ్డీరేట్లకు పరపతి సౌకర్యం కల్పించడం, పంటల బీమా వంటి తక్షణ సహాయకారిగా ఉండే డిమాండ్ల కోసం పోరాడి సాధించుకోవచ్చు.

### రైతాంగ కుటుంబాలు

రైతాంగ కుటుంబాలు అంటే వ్యవసాయ భూములను శారీరక శ్రమ ద్వారా కానీ యంత్రాల ద్వారాగానీ సాగు చెయ్యడంలో ప్రత్యక్షంగా పాల్గొనే వారందరినీ పరిగణనలోకి తీసుకోవాలి. ఒకే సామాజిక తరగతిగా రైతాంగం ఎన్ని ఒడిదుడుకులు ఎదురయినా తట్టుకుని నిబ్బరంగా నిలబడింది. రైతాంగ కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులుగా చారిత్రక దశలకు అనుగుణంగా మార్పు చెందుతూ వచ్చాయి. ఆధునిక రైతాంగం లక్షణం ఏంటంటే వాళ్ళు పెట్టుబడి, మార్కెట్‌ల అధిపత్యజాలంలో, పెట్టుబడిదారీ-భూస్వామ్య రాజ్యం అనుసరించే విధానాల మూలంగా నలిగిపోతు ఉన్నారు.

కుటుంబ వ్యవసాయంలో కుటుంబ సభ్యులు పని చేసే రోజులు తగ్గిపోవడంతో రైతాంగ కుటుంబాలు కూడా సాగు పనుల కోసం కూలీల మీద ఆధారపడాల్సి రావడం, రైతాంగ కుటుంబాల్లో ఎంతమంది వేతన కార్మికులుగా పని చేస్తున్నారు, కుటుంబ ఆదాయంలో వ్యవసాయం మీద వచ్చేది ఎంత, ఇతర ఆదాయం ఎంత, గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తిలో రైతాంగ కుటుంబాల ఉత్పత్తి శాతం ఎంత.. ఈ అంశాలలో చోటుచేసుకున్న మార్పులు ఏమిటి అనేది మనం ముఖ్యంగా పరిశీలిద్దాం.

గ్రామంలో ఉన్న భూమి స్వభావం, సారం, పంటల సాగువంటి అంశాల ఆధారంగా ఆయా గ్రామాల్లోని వ్యవసాయ కుటుంబాల్లో ఎంతమంది సభ్యులు, ఎంత శ్రమను వెచ్చిస్తారు అనేది ఆధారపడి ఉంటుంది. అలాగే ఆయా కుటుంబాల ఆర్థిక-సామాజిక స్థితిగతులు కూడా తమవంతు పాత్ర పోషిస్తాయి. ఈ కాలంలో వ్యవసాయం మీద కుటుంబం వెచ్చించే శ్రమ తగ్గుముఖం పట్టింది. పంటలమార్పు, భూమి వినియోగం, వ్యవసాయ పద్ధతులలో ముఖ్యంగా యాంత్రీకరణ పెరిగిన నేపథ్యం వంటి కారణాలరీత్యా ఈ మార్పులు చోటు చేసుకున్నాయి.

వ్యవసాయం మీద కుటుంబంలోని ఆడా మగా వెచ్చించే శ్రమ దినాలు క్రమంగా తగ్గుముఖం పడుతూ వచ్చాయి. ఇందుకు ప్రతిగా సన్నకారు, చిన్నకారు రైతాంగం కన్నా ఎక్కువగా వ్యవసాయ కార్మికులను కూలికి తెచ్చుకోవడం పెరిగింది.

వ్యవసాయం కోసం వెచ్చించే కుటుంబ శ్రమలో జెండర్ పరంగా కూడా తేడా ఉండడం గమనార్హమైన అంశం. వ్యవసాయం మీద కుటుంబంలోని మగవాళ్ళు పనిచేసే రోజులతో పోలిస్తే ఆడవాళ్ళు పనిచేసే రోజులు గణనీయంగా తగ్గిపోయాయి. గతంలోనూ ఇవే ధోరణులు ఉండేవి. దేశంలోని అనేక ప్రాంతాలలో ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో ధనిక రైతు కుటుంబాలలోని మహిళలు వ్యవసాయ పనులలో పాల్గొనడం పూర్తిగా మానేశారు. అయితే పశుపోషణ పూర్తి బాధ్యత ఆడవాళ్ళ మీదే కొనసాగుతుంది.

రైతాంగ కుటుంబాల ఆదాయంలో వ్యవసాయ ఆధారిత ఆదాయం 50 శాతంకన్నా తక్కువగా ఉంది. అక్కడక్కడా కొన్ని మినహాయింపులతో ఇది క్రమంగా తగ్గుముఖం పడుతూ వచ్చింది. మినహాయింపు ఏంటంటే కౌలు చేస్తున్న పరిస్థితి ఉంటే, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని గ్రామాల్లో అపరాలు, చెరకు పండించడానికి పేద రైతులు తమ భూములను లీజుకు ఇస్తున్నారు.

రైతాంగ కుటుంబాలు ఆయా గ్రామ మొత్తం వ్యవసాయ ఉత్పత్తికి 50 శాతానికి పైగా ఉత్పత్తిని తోడు చేస్తున్నారు. మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో రైతాంగ కుటుంబాలు తోడు చేస్తున్న ఉత్పత్తి శాతం పెరుగుతూ రావడం వ్యవసాయ ఉత్పత్తిలో పెరుగుతూ వస్తున్న రైతాంగ ప్రాధాన్యతకు నిదర్శనం. ఇది చాలా గొప్ప విషయం. వ్యవసాయ రంగంలో విచ్చిన్నపరంగా అనేక మార్పులు వచ్చినప్పటికీ రైతాంగం అదృశ్యమైతే లేదు. వ్యవసాయక సంబంధాల్లో రైతాంగం ఇప్పటికీ కీలకపాత్ర పోషిస్తున్నది అని దాన్ని బట్టి స్పష్టమవుతున్నది.

మన దేశ రైతాంగాన్ని ధనిక, మధ్య తరగతి, పేద రైతాంగం అని మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. ఉత్పత్తి సాధనాల మీద ఉండే యాజమాన్య హక్కుల రీత్యా కుటుంబశ్రమరీత్యా, కూలీల వినియోగంరీత్యా, కుటుంబ ఆదాయాలరీత్యా మూడు తరగతుల రైతాంగం మధ్య భిన్నమైన తేడాలు ఉన్నాయి.

పైన పేర్కొన్నట్లు ధనిక రైతులు, పేద రైతులు, మధ్య తరగతి రైతుల ఆదాయాల పొందికలో కూడా తేడాలు ఉన్నాయి. ఆయా తరగతి రైతుల వ్యసాయేతర ఆదాయాలు వారివారి విద్యార్హతలు, నైపుణ్యాలు ఆధునిక లేబర్ మార్కెట్ వినియోగానికి అయ్యే ఖర్చులు వంటి అంశాల మీద ఆధారపడి ఉంటాయి. ధనిక రైతాంగానికి ఆస్థుల మీద రాబడి, వ్యాపారాలు, ఉద్యోగాలు మూలంగా వ్యవసాయేతర ఆదాయాలు సమకూరితే పేద రైతులకు పశుపోషణ, వ్యవసాయ కూలి, అసంఘటిత రంగ పనుల ద్వారా గిట్టుబాటయ్యే వేతనం తదితర మార్గాల ద్వారా వ్యవసాయేతర ఆదాయాలు సమకూరుతాయి. పేద, మధ్య తరగతి రైతులు వేతన శ్రమ మీద ఆధారపడడం ఈ మధ్య కాలంలో పెరిగింది.

వేతన కార్మికులు, శ్రామికులు, గ్రామీణ భారతదేశంలో భూమిలేని కార్మికుల కుటుంబాలు చారిత్రకంగా భుక్తి గడవడం కోసం తమ శ్రమను అమ్ముకునే తరగతిగా ఉంటూ వచ్చాయి. అసలు సొంత భూమి అంటూ లేకపోవడం, ఉన్న భూమి కోల్పోవడం, వ్యవసాయానికి అవసరమైన ప్రాథమిక ఉత్పత్తి సాధనాలు ఏమీలేకపోవడం మూలంగా వీరు తమ శ్రమను అమ్ముకోవాల్సి వస్తుంది.

దేశంలోని గ్రామసీమలు అన్నింటా వ్యవసాయ భూముల యాజమాన్య పంపిణీలో తీవ్ర అసమానతలు ఉన్నాయి. ఉత్పత్తి శక్తుల

అభివృద్ధికి అనుగుణంగా భూమిలేని నిరుపేదల సంఖ్యా పెరుగుతూ వస్తుంది. అసలు సాగు భూమి అంటూ లేనివారి సంఖ్య చారిత్రక పరిస్థితుల దృష్ట్యా క్రమంగా పెరుగుతూ వచ్చింది. దీనికి కారణాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉన్నాయి.

> **"గ్రామీణ ప్రాంత శ్రామికులు పనికోసం కేవలం స్థానిక లేబర్ మార్కెట్‌ల మీదే ఆధార పడి ఉండడం లేదు. వేతన పని వెతుక్కుంటూ దేశంలోని మారుమూల పట్టణాలు, పల్లెలకు వలస పోతున్నారు. అయితే ఇలా వలసలు పోవడం ఒక్కో పల్లెలో ఒక్కోరీతిగా ఉన్నది. పనిలో వారివారి నైపుణ్యాలనుబట్టి అందుకు తగ్గ పని ఎక్కడ దొరికితే అక్కడికి వలస వెళుతున్నారు. లేనివాళ్ళు ఉన్న ఊళ్ళోనే పనులు వెతుక్కుంటున్నారు."**

వేతన కార్మికులు అంటే కేవలం వ్యవసాయ పనులు చేసేవాళ్ళే అని విడదీసి చూడడం ఇవాళా రేపూ క్లిష్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వేతన కార్మికులు వ్యవసాయ, వ్యవసాయేతర కూలి పనులకు వెళుతుంటారు. ఈ తరగతి కార్మికులు తమ శ్రమ మొత్తాన్ని కూలిపనులకు వెచ్చించి తద్వారా కుటుంబ ఆదాయాన్ని గడించుకుంటున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో ఈ మధ్యకాలంలో వ్యవసాయ కూలి పనిదినాలు, మొత్తం పనిదినాల్లో వ్యవసాయ పనిదినాలు తగ్గుముఖం పట్టాయి.

2006-07 నుండి 2014-15 మధ్య కాలంలో వ్యవసాయ పనులు చేసే ఆడా-మగ కార్మికుల రోజువారీ వేతనాల్లో క్రమంగా పెరుగుదల చోటుచేసుకున్నది. ముఖ్యంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసిన 2009-10 సంవత్సరాల తరువాత ఈ పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్నది. ఈ దశ కొద్దికాలం పాటే కొనసాగింది.

2014-15,2022-22 సంవత్సరాల మధ్యకాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర కూలిరేట్లు ప్రతిష్టంభించిపోయాయి. కొండకచో తగ్గుముఖం పట్టాయి. 2019-20, 2021-22 సంవత్సరాలలో కోవిడ్ ఉత్పాతం మూలంగా గ్రామీణ ప్రాంత పనులన్నింటా కూలి రేట్లు తగ్గాయి. ఈ మధ్యకాలంలో తిరిగి స్వల్పంగా పెరిగాయి.

ఒకటి రెండు మినహాయింపులు తప్పితే వ్యవసాయ రంగంలో కూలిరేట్లు దేశవ్యాప్తంగానే చాలా తక్కువగా ఉండడం గమనార్హం. 2025 జూన్ నెలలో లేబర్ బ్యూరో వెలువరించిన గణాంకాలను బట్టి చూస్తే వ్యవసాయ కూలిరేట్లు సగటున మగవారికి రోజుకి 418 రూపాయలుగాను, ఆడవారికి 334 రూపాయలుగానూ ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. అదే కేరళ రాష్ట్రంలో మగవారికి 880 రూపా యలు, ఆడవారికి 630 రూపాయలు కూలి లభిస్తుంది.

గ్రామీణ ప్రాంత శ్రామికులు పనికోసం కేవలం స్థానిక లేబర్ మార్కెట్‌ల మీదే ఆధార పడి ఉండడం లేదు. వేతన పని వెతుక్కుంటూ దేశంలోని మారుమూల పట్టణాలు, పల్లెలకు వలస పోతున్నారు. అయితే ఇలా వలసలు పోవడం ఒక్కో పల్లెలో ఒక్కోరీతిగా ఉన్నది. పనిలో వారివారి నైపుణ్యాలనుబట్టి అందుకు తగ్గ పని ఎక్కడ దొరికితే అక్కడికి వలస వెళుతున్నారు. లేనివాళ్ళు ఉన్న ఊళ్ళోనే పనులు వెతుక్కుంటున్నారు. గ్రామీణ ప్రాంత కార్మికులు చేపట్టే పనులు, అందుకుగానూ ముట్టే ప్రతిఫలం, చెల్లింపుల విధానం - వీటన్నింటిలో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అలాగే వేతన పనుల మార్కెట్ విస్తృతం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని అత్యధిక కుటుంబాలు పనుల్లో జొరబడుతున్నారు. కొన్ని దశాబ్దాల క్రితమే ఈ ధోరణి మొదలయినా కాలక్రమేణా ఇది మరింత విస్తరించింది. ఉత్తరప్రదేశ్‌లోని రెండు గ్రామాలను పరిగణనలోకి తీసుకుంటే గ్రామంలోని వేతన కార్మికులు అందరూ పనిచేసిన దినాలతో పోలిస్తే వేతన శ్రామికుల కుటుంబాల్లోని సభ్యులు పని చేసిన దినాలు 2023 నాటికి 55 నుండి 67శాతం దాకా ఉన్నాయి. ఇతర కుటుంబాల నుండి పనుల్లోకి వచ్చినవారి శాతం 33 నుండి 45 శాతంగా ఉన్నది.

లేబర్ మార్కెట్‌లు విస్తృతం కావడం వర్గ పోరాటాల పెంపుదలకు, పల్లెలలో శ్రామిక వర్గీకరణ పెంపొందించేందుకు దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో వేతన కార్మికులు, పేదలు, మధ్య తరగతి రైతులు కలిసి దాదాపు 70శాతానికిపైగా ఉంటారు. అంటే గ్రామాల్లో వీరే మెజార్టీగా ఉంటారు. వీళ్ళు కాకుండా భూస్వామ్యేతర, ధనిక రైతేతర తరగతుల జనాభాలో కూడా శరీర కష్టం చేసే కార్మికులు ఉంటారు.

సాధారణ వ్యవసాయ రంగంలో ఈరకమైన శ్రామిక వర్గ రైతాంగరాశి అటు పెట్టుబడిదారీ పూర్వ కాలానికి, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు నడుమ ఒక చారిత్రక కొనసాగింపుకు ప్రాతినిధ్యం వహిస్తారని లెనిన్ గుర్తించాడు. 'కుంటో, గుంటో పొలం ఉన్న రైతులు దాని మీద ఆధారపడి జీవనం గడపడం దుర్లభం. రైతాంగంలో మెజార్టీ ఇలా అరాకొరా భూములు ఉన్నవాళ్ళే. వీరికి వ్యవసాయం అనేది ఉపవృత్తి మాత్రమే. వీళ్ళు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే నిరుద్యోగ రిజర్వ్ సైన్యంలో భాగంగానే ఉంటారు. మార్క్స్ పరిభాషలో చెప్పాలంటే వీళ్ళు 'మాటున ఉండే నిరుద్యోగ రిజర్వ్ సైన్యం' అన్నమాట. కాబట్టి నిరుద్యోగ రిజర్వ్ సైన్యం అంటే ఏ పనీపాటా దొరకనివాళ్ళు. ఉన్న ఉద్యోగాలు కోల్పోయిన వాళ్ళు అని మాత్రమే అర్థం కాదు. కొద్దిపాటి భూములు ఉన్నా అవి తమ కుటుంబ అవసరాలు తీర్చలేని చిన్న, సన్నకారు రైతులు కూడా ఈ నిరుద్యోగ రిజర్వ్ సైన్యంలో భాగం అవుతారు' అంటాడు లెనిన్.

మన దేశంలో 1991 నుండి ప్రపంచీకరణ, ఉదారవాద విధానాలు కొనసాగుతూ వస్తున్నాయి. తద్వారా గ్రామీణ భారతంలో కూడా రాజకీయ జోక్యం, సామ్రాజ్యవాద జోక్యం-రెండూ తమవంతు పాత్ర పోషించాయి. రాజ్యం అనుసరించిన విధానాలు గ్రామీణ

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> **" గ్రామీణ ప్రాంత పేదల్లో వ్యవసాయ భూమి లేనితనం పెరుగుతా వస్తుంది. శ్రామిక మార్కెట్‌ల విస్తరణ మూలంగా గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల్లో కూలి పనులకు వెళ్ళే ధోరణి విస్తరించడం ద్వారా శ్రామికతత్వ లక్షణాలు అలవడు తున్నాయి. అదే సందర్భంలో ఆదాయపరంగా, కుటుంబ పరంగా పేదలు సాగు చేస్తున్న భూముల విస్తీర్ణం దేశంలోని కొన్ని ప్రాంతాలలో పెరుగుతూ వచ్చింది. "**

భారతంలో గుణాత్మకంగా కొత్త రూపాలను సంతరించుకున్నాయి. భారతదేశంలో అమలవు తున్న అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానాలు గ్రామీణ పేదలు, కష్టజీవులు, చిన్న, సన్నకారు రైతులను నిరుద్యోగ రిజర్వ్ సైన్యంగా మలిచాయి.

గ్రామీణ ప్రాంత పేదల్లో వ్యవసాయ భూమి లేనితనం పెరుగుతా వస్తుంది. శ్రామిక మార్కెట్‌ల విస్తరణ మూలంగా గ్రామీణ ప్రాంత పేద కుటుంబాల్లో కూలి పనులకు వెళ్ళే ధోరణి విస్తరించడం ద్వారా శ్రామికతత్వ లక్షణాలు అలవడుతున్నాయి. అదే సందర్భంలో ఆదాయపరంగా, కుటుంబపరంగా పేదలు సాగు చేస్తున్న భూముల విస్తీర్ణం దేశంలోని కొన్ని ప్రాంతాలలో పెరుగుతూ వచ్చింది. కౌలుకి తీసుకోవడమో, లీజుకు తీసుకోవడమో, భూములు పంచాలని చేసిన పోరాటాల ఫలితంగానో మొత్తానికి ఈ మూడు రూపాల్లో పేదలు సాగుచేసే భూముల విస్తీర్ణం పెరిగింది.

ఇలా పేదలు సాగుచేసే భూముల విస్తీర్ణం పెరిగిందంటే దానిమూలంగా శ్రామికీకరణ తగ్గుముఖం పట్టిందని అర్థంకాదు. అలాగే గ్రామాల్లో ఉన్న తీవ్ర అసమానతలు తగ్గుతూ వస్తున్నాయనీ కాదు. బీహార్‌లోని పశ్చిమ చంపారణ్ జిల్లాలోని గ్రామీణ పేదల్లో ముఖ్యంగా వేతన కార్మికులు, పేద రైతులు జీవనోపాధి కోసం చుట్టుపక్కల ఉన్న గ్రామాల సహా పనికోసం వెతుక్కోవడం, భూములు కౌలుకి తీసుకుని వ్యవసాయం చెయ్యడం లేదంటే వలసపోయి అసంఘటిత రంగంలో కార్మికులుగా కుదురుకోవడం ఎక్కువగా ఉందని మృత్యుంజయ పాండే నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది.

అయితే వీటి మూలంగా ఆయా కుటుంబాలు ఏవీ-ఒక వర్గంగా-పేదరికం నుండి, ఆర్థిక అభద్రత నుండి బయటపడలేక పోయాయని కూడా స్పష్టం చేసాడు. దాదాపు దేశవ్యాప్తంగా పల్లె ప్రాంతాలలో, ముఖ్యంగా వలసలు ఎక్కువగా ఉన్న పల్లె ప్రాంతాలలో, ఇదే ధోరణి నెలకొని ఉన్నది.

### వ్యవసాయేతర పనులవైపు మొగ్గు

అటు భూస్వాములు, బడా పెట్టుబడిదారీ రైతాంగం వర్గం, ఇటు వేతన కార్మికవర్గం రెండింటా ఆదాయాలు, జీవనోపాధి ప్రధానంగా వ్యవసాయం మీదనే ఆధారపడి ఉన్నప్పటికీ వ్యవసాయ పనుల కోసం వెచ్చించే సమయం, ఆ పనుల ద్వారా వచ్చే సగటు ఆదాయాలు ఏటికేడాదికి తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. వర్గ సమాజంలో పైమెట్టున ఉన్న భూస్వాములు బడా పెట్టుబడిదారీ రైతాంగం ఉత్పత్తి విధానాల మీద పంటల మార్పిడి మీద, వ్యవసాయేతర ఆదాయాలు పెంచుకోవడం మీదా ఆధిపత్యంతో పాటు వర్గ సమాజంలో సామాజిక అణచివేతకు ఉపకరించే అన్ని వ్యవస్థల మీద కూడా ఆధిపత్యం చలాయిస్తుంది. అలాగే వేతన కార్మికుల ఆదాయాల్లో వ్యవసాయేతర పనుల ద్వారా లభించే ఆదాయా శాతం పెరుగుతూ వస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం శాతం అధికంగా ఉండడంతోపాటు తక్కువ వేతనాల సమస్యను ఎదుర్కొంటున్నారు. పట్టణాలకు వలస వెళ్ళిన కార్మికులు గ్రామాల్లో దక్కే వేతనాలకన్నా కాస్త ఎక్కువ వేతనాలు పొందుతున్నా వాస్తవానికి ఇవి పట్టణ ప్రాంత వేతనాలతో పోలిస్తే తక్కువగా ఉంటున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వలస కార్మికుల స్థితిగతుల మీద మరింత లోతైన అధ్యయనం కావించాల్సిన అవసరం ఉన్నది.

మొత్తం మీద గ్రామీణ ప్రాంత స్థూల ఉత్పత్తిలో రైతాంగం చేపట్టిన వ్యవసాయం, పశు పోషణల ఆధారంగా వచ్చే ఆదాయం సింహ భాగాన్ని ఆక్రమిస్తుంది. కానీ పేద, మధ్యతరగతి రైతాంగం చేపట్టిన వ్యవసాయం తలకు మించిన భారంగా తయారయ్యింది. పెట్టుబడుల వ్యయం పెరుగుతూ పంటల దిగుబడి మీద వచ్చే ఆదాయం తక్కువగా ఉండడంతో మెజారిటీ రైతాంగం నష్టాలు తలకెత్తుకోవాల్సి వస్తుంది. చిన్న కమతాల వ్యవసాయం మూలంగా రైతులు నష్టపో తున్నారు అనే వాదన ఎంత మాత్రం సరికాదు. అసలు కారణం పంటల దిగుబడికి తగిన ధర లభించకపోవడమే. కాగా పోగా సన్నకారు, చిన్నకారు రైతాంగం చేపడుతున్న వ్యవసాయం భుక్తి గడవడం కోసమే తప్ప లాభాలు గడించడానికి కాదు.

అలాగే రైతాంగంలో శ్రామికీకరణ ధోరణులు పెరుగుతూ వస్తున్నాయి. స్వంత భూమికానీ, సాగు చేస్తున్న భూమిపైగానీ హక్కులు కోల్పోవడం మూలంగా శ్రామికీకరణ పెరుగుతూ వస్తుంది. ఏటా వేతన శ్రమ ద్వారా గడించే ఆదాయం శాతం పెరుగుతూ రావడం రైతాంగంలో పెరుగుతున్న శ్రామికీకరణకు ప్రబల సాక్ష్యం. శ్రామిక మార్కెట్లు పెరుగుతున్న అవసరాలు రైతాంగాన్ని ముఖ్యంగా పేద, మధ్యతరగతి రైతాంగాన్ని తన గుప్పిట్లోకి తీసుకుంటున్నాయి.

గ్రామీణ భారతంలో పెరుగుతూ వస్తున్న వ్యవసాయేతర శ్రమ ధోరణుల గురించి అతిగా చెప్పుకోవడం అనికాదుగానీ, తప్పనిసరిగా ఈ ధోరణల గురించి మరింత లోతైన అధ్యయనం అవసరం. వ్యవసాయేతర ఆదాయాలు, జీవనోపాధులు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉన్నాయి. అలాగే స్త్రీ-పురుషుల విషయంలో కూడా తేడాలు ఉన్నాయి. కులాల వారీగా, వయసులవారీగా కూడా అంతరాలు ఉన్నాయి. కాబట్టి ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.


### భవిష్యత్ కర్తవ్యాలు

వ్యవసాయ వర్గ సంబంధాల్లో చోటుచేసుకుంటున్న మార్పుల మీద 2009లో జరిగిన చర్చలో కామ్రేడ్ సీతారాం ఏచూరి జోక్యం చేసుకుంటూ ఇలా వివరించారు-

**"పాలకవర్గ పొత్తు నుండి భూస్వామ్య వర్గాన్ని భారత బూర్జువా వర్గం పూర్తిగా పక్కకు నెట్టెయ్యలేదన్న అంశం మన గమనంలో ఉండాలి. ఆ మేరకు వ్యవసాయ రంగం సామ్రాజ్యవాదాన్ని నికరంగా వ్యతిరేకించడంలో ఏకమాత్రత కలిగిలేదు. కాబట్టి జనతా ప్రజాతంత్ర విప్లవ సాధన లక్ష్యాలకు అనుగుణంగా భూస్వామ్యేతర తరగతుల మధ్య ఐక్యత నిర్మించడం తక్షణ అవసరం. వ్యవసాయ**

**(మిగతా 15వ పేజీలో)**

# జెన్ జీ : వర్గ పోరాటం



రచయిత ప్రముఖ చరిత్రకారుడు, జర్నలిస్టు, 40కి పైగా పుస్తకాలు రాశారు. లెఫ్ట్ వర్డ్ (న్యూ ఢిల్లీ) ప్రచురణాలయం ఎడిటర్

విజయ ప్రసాద్

జులై 20న, వేలాది మంది యువకులు జంతర్ మంతర్ నుండి పార్లమెంటు వైపు మార్చ్ చేయడానికి ప్రయత్నించారు. వరుస పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీలు, రద్దయిన పరీక్షలు, విద్యార్థుల జీవితాలపై పెరుగుతున్న ఒత్తిడి మొదలైన వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు చేతులో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ పోలీసులు వారిని బారికేడ్లు, లాఠీలు, టియర్ గ్యాస్‌తో ఎదుర్కొన్నారు. కొంతమంది నిరసనకారులను అదుపులోకి తీసుకోగా, మరికొందరు చిన్న చిన్న గుంపులుగా ఏర్పడి పార్లమెంట్ వైపు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. ఈ ఉద్యమం ఒక ముఖ్యమైన ఘట్టాన్ని దాటింది. సోషల్ మీడియాలో వ్యంగ్యంగా ప్రారంభమైన ఉద్యమం, ప్రభుత్వ అధికారంతో నేరుగా తలపడేలా వీధుల్లోకి వచ్చింది.

ఈ నిరసనకారులు తమను తాము "కాక్రోచ్ జనతా పార్టీ" (సిజెపి) అని పిలుచుకుంటున్నారు. ఒక న్యాయమూర్తి ఉద్యమకారులను, నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్నజీవులతో' పోలుస్తూ చేసిన అవమానకరమైన వ్యాఖ్య తర్వాత ఈ పేరు వచ్చింది. ఆ అవమానానికి లొంగిపోవడానికి బదులుగా, యువత ఆ వ్యాఖ్యనే తమ సమిష్టి నిరసనకు చిహ్నంగా మార్చుకున్నారు. భారతదేశాన్ని ఏలేవారు ఇక్కడి నిరుద్యోగ యువతను బొద్దింకలుగా చూస్తే, ఆ బొద్దింకలే గుమిగూడుతాయి.

ఈ పేరు భారతీయ జనతా పార్టీని ఎద్దేవా చేయడమే కాకుండా, ఒక తరం ఎదుర్కొంటున్న అనుభవాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ తరం నిరంతరం "మీరు క్రమశిక్షణ లేని వారు, కృతజ్ఞత లేనివారు, ఉద్యోగానికి అనర్హులు" అని, తమకు ఉద్యోగాలు ఇవ్వాల్సిన ఆర్థిక వ్యవస్థ విఫలమైనప్పటికీ, ఆ వైఫల్యానికి తమనే వ్యక్తిగతంగా బాధ్యులను చేస్తున్నారని భావిస్తోంది. కాకపోతే ఈ కనికరం లేని పెట్టుబడిదారీ వ్యవస్థ, వారిని వాడి పారేసే వస్తువులుగా మాత్రమే చూస్తోంది.

జూన్ 6న ఢిల్లీలో జరిగిన మొదటి ప్రధాన నిరసన నుండి, ఈ ఉద్యమం పూణే, ముంబై, బెంగళూరు, లక్నో, నాగ్‌పూర్ వంటి నగరాలకు విస్తరించింది. నిరసనకారులు జంతర్ మంతర్ వద్ద ఒక క్యాంప్‌ను ఏర్పాటు చేయగా, వాతావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ వారి డిమాండ్లకు మద్దతుగా నిరాహార దీక్ష చేపట్టారు; ఆ తర్వాత ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించారు.

వారి తక్షణ డిమాండ్లు చాలా గంభీరమైనవి. ప్రవేశ, నియామక పరీక్షల పారదర్శకత, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం, అవినీతిమయమైన పరీక్షా విధానంలో సంస్కరణలు, విద్యాశాఖ మంత్రి రాజీనామా..ఇవి వారి డిమాండ్లు. అయితే ఈ డిమాండ్ల వెనుక చాలా పెద్ద సామాజిక సంక్షోభం ఉంది. ఎందుకంటే ఒక పరీక్షా పేపర్ అనేది కేవలం ప్రశ్నలు ఉన్న కాగితం మాత్రమే కాదు, లక్షలాది శ్రామిక వర్గ కుటుంబాలకు, అది సంవత్సరాల తరబడి చేసిన పొదుపు, త్యాగం, చదువు, ఆశలకు ప్రతీక. ఆ పేపర్ లీక్ అయినప్పుడు లేదా పరీక్ష రద్దయినప్పుడు, ఒక నిరుపేద కుటుంబం ఆశల ప్రణాళిక ముక్కలవుతుంది.

మీడియా ఈ "కాక్రోచ్" ఉద్యమాన్ని భారతదేశపు మొదటి "జెన్ జీ నిరసన"గా వర్ణించడానికి ఉత్సాహం చూపించింది. ఈ వర్ణనలో కొంత నిజం ఉంది. దీని భాష సోషల్ మీడియాలో పుట్టింది. అందుకే ఇది మీమ్స్, వ్యంగ్యం, పారడీలు, షార్ట్ వీడియోలు, స్వయం ప్రహసన హాస్యాన్ని నైపుణ్యంతో ఉపయోగిస్తుంది. ఇందులో పాల్గొంటున్న చాలామందికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తప్ప వేరే ప్రభుత్వం తెలియదు. టీవీ వార్తలు దాదాపుగా అధికారానికి లొంగిపోయి, నిరసనలు నేరపూరితం చేయబడి, ఇంటర్నెట్ అనేది పర్యవేక్షణ సాధనంగా మారడమే కాకుండా ఆగ్రహాన్ని వేగంగా వ్యాప్తి చేసే కొన్ని స్థలాలలో ఒకటిగా మారిన పరిస్థితులలో వీరి రాజకీయ భాష రూపుదిద్దుకుంది.

కానీ "జెన్ జీ" అనే పదం నిజమైన పరిస్థితిని పూర్తిగా వివరించదు. ఇది సామాజికశాస్త్రం లాగా ముసుగు వేసుకున్న ఒక మార్కెటింగ్ వర్గీకరణ మాత్రమే. ఒక వ్యవసాయ కూలీ కుమార్తెను, ఒక శతకోటీశ్వరుడి కుమారుడిని కేవలం వారు ఒకే కాలంలో పుట్టారనే కారణంతో ఇది ఒకే వర్గంలోకి చేరుస్తుంది. ఒకే తరానికి చెందినవారు పరీక్షలు రాయరు, ఉద్యోగాలు వెతకరు, ఫుడ్ డెలివరీ చేయరు లేదా కోచింగ్ ఫీజుల కోసం అప్పులు చేయరు, కానీ సామాజిక వర్గాలు ఇవన్నీ చేస్తాయి. అసలైన ప్రశ్న ఏమిటంటే ఈ యువకులు ఎప్పుడు పుట్టారనేది కాదు, వారు ఎటువంటి ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా పొందారు, ఆ వ్యవస్థ వారి కోసం ఏ స్థానాన్ని కేటాయించింది అనేదే.

ఈ యువ నిరసనకారులు తమకు శ్రద్ధ వహించే వ్యవధి తక్కువగా ఉందని లేదా అధికారమంటే ప్రత్యేక సాంస్కృతిక వ్యతిరేకత ఉందని తిరుగుబాటు చేయడం లేదు. పెట్టుబడిదారీ విధానం వారిని గౌరవప్రదమైన ఆర్థిక జీవితంలోకి చేర్చుకోలేకపోతున్నందున వారు తిరుగుబాటు చేస్తున్నారు. చదువుకోమని, డిగ్రీలు పొందమని, కొత్త నైపుణ్యాలు నేర్చుకోమని, పోటీ పడమని వారికి చెప్పారు. ఈ కష్టమైన ప్రయాణం చివరలో, వాగ్దానం చేసిన ఉద్యోగం అసలు లేనే లేదని చాలామంది తెలుసుకుంటున్నారు. మరికొందరికి కేవలం తాత్కాలిక కాంట్రాక్టులు, జీతం లేని ఇంటర్న్‌షిప్‌లు, ప్లాట్‌ఫారమ్ వర్క్ లేదా వారి అర్హతలకు సంబంధం లేని తక్కువ వేతన ఉద్యోగాలు

> “ అధికారిక గణాంకాలు కూడా సమస్య తీవ్రతను వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన 2025 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్కులలో నిరుద్యోగం 9.9%గా ఉంది, పట్టణ యువతలో ఇది 13.6%కి పెరిగింది. అలాగే 15 నుండి 29 ఏళ్ల మధ్య ఉన్న భారతీయులలో నాలుగో వంతు మంది ఉద్యోగంలో గానీ, విద్యలో గానీ లేదా శిక్షణలో గానీ లేరని గుర్తించింది. ”

మాత్రమే లభిస్తున్నాయి.

అధికారిక గణాంకాలు కూడా సమస్య తీవ్రతను వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన 2025 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్కులలో నిరుద్యోగం 9.9%గా ఉంది, పట్టణ యువతలో ఇది 13.6%కి పెరిగింది. అలాగే 15 నుండి 29 ఏళ్ల మధ్య ఉన్న భారతీయులలో నాలుగో వంతు మంది ఉద్యోగంలో గానీ, విద్యలో గానీ లేదా శిక్షణలో గానీ లేరని గుర్తించింది.

ఈ ప్రధాన గణాంకాలు తీవ్రమైన అల్ప–ఉపాధి (అండర్ ఎంప్లాయిమెంట్), ప్రతిఫలం లేని కుటుంబ శ్రమ , ఏదో ఒక పనిని ఉపాధిగా ఒప్పుకోవాల్సిన నిరాశను దాచిపెడుతున్నాయి. భారతీయ కార్మికులలో కేవలం 23.6% మంది మాత్రమే క్రమబద్ధమైన వేతనం లేదా జీతం పొందే ఉద్యోగాలలో ఉన్నారు. 56.2% మంది స్వయం ఉపాధి పొందుతున్నట్లు వర్గీకరించబడ్డారు. ఇందులో సంపన్న ప్రొఫెషనల్స్ నుండి వీధి వ్యాపారులు, కుటుంబ పొలాల్లో ఉచితంగా పనిచేసే కార్మికుల వరకు అందరూ ఉన్నారు.

ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ రూపొందించిన ‘ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్’ మరింత స్పష్టమైన చిత్రాన్ని ఇస్తుంది. 2022లో, చదువుకున్న యువ గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం 29.1%గా ఉంది. ఇది చదవడం, రాయడం రాని యువకుల నిరుద్యోగిత రేటు కంటే తొమ్మిది రెట్లు ఎక్కువ. శ్రామిక శక్తిలో దాదాపు 82% మంది అసంఘటిత రంగంలో ఉండగా, దాదాపు 90% మంది అనధికారికంగా ఉపాధి పొందుతున్నారు.

సాధారణ కార్మికుల వాస్తవ వేతనాలు స్థిరంగా ఉన్నాయి లేదా దిగజారాయి అని ఈ నివేదిక వెల్లడిస్తుంది. ప్లాట్‌ఫారమ్ ఉపాధి (గిగ్ వర్క్) అనేది ఎలాంటి సామాజిక భద్రత లేకుండా, డిజిటల్ పర్యవేక్షణలో జరిగే అనధికారిక శ్రమగా విస్తరించింది. మొదటి ఉద్యోగం కోసం సగటు వేచి ఉండే సమయం ఒక సంవత్సరం కంటే ఎక్కువ అని చాలామంది సాంకేతిక అర్హత కలిగిన యువకులు తమ శిక్షణకు సంబంధం లేని పనులు చేస్తున్నారని నివేదిక పేర్కొంది.

ఈ నిరసనల వెనుక ఉన్న చేదు నిజం ఇది. విద్య అనేది యువ భారతీయుల ఆకాంక్షలను, సామర్థ్యాలను పెంచింది, కానీ ఆర్థిక వ్యవస్థ వారికి తగినన్ని మెరుగైన ఉద్యోగాలను కల్పించలేకపోయింది. వారు ఎంత ఎక్కువ చదివితే అంతగా సమాజం ఏమి వాగ్దానం చేసింది , ఏమి ఇస్తుంది, దాని మధ్య వ్యత్యాసం ఎంత ఉన్నది అని స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నారు. వారి డిగ్రీ వారి అసమర్థతకు నిదర్శనం కాదు, ఆర్థిక మూలధనం, ప్రైవేటీకరణ, కొద్దిమంది కార్పొరేట్ సంపన్న వర్గాల సంపద చుట్టూ నిర్మితమైన ఆర్థిక నమూనా వైఫల్యానికి ఇది నిదర్శనం.

ఈ సంక్షోభం మోదీ ప్రభుత్వంతో ప్రారంభం కాలేదు, కానీ పన్నెండేళ్ల భారతీయ జనతా పార్టీ పాలన దీనిని మరింత తీవ్రతరం చేసింది. పెద్ద నోట్ల రద్దు (డిమానిటైజేషన్), హడావిడిగా అమలు చేసిన జిఎస్‌టి చిన్న

# విద్యా రంగంలో పేరుకుపోయిన సమస్యలెన్నో!

ఇది దశాబ్దాల తర్వాత విద్య, విద్యా సంస్కరణలపై మొదలైన చర్చ. ఒక మంత్రి రాజీనామాతోనే ఈ చర్చ ఆగిపోతే అది పెద్ద విపత్తు అవుతుంది. కుటుంబాలు తమ పిల్లల చదువు కోసం తమ రాబడిలో 20% ఖర్చు చేస్తున్నాయి. కానీ ప్రభుత్వంలోకి వచ్చాక, అదే నాయకులు విద్య కోసం కనీసం 4% నిధులను కూడా కేటాయించలేకపోతున్నారు. పిల్లవాడు మనవాడైనప్పుడు విద్య ప్రాధాన్యతగా మారుతుంది. అదే వేరొకరి బిడ్డ అయినప్పుడు దాన్ని వ్యర్థమైన ఖర్చుగా చూస్తారు.

గడిచిన దశాబ్దకాలంలో మనం ఎంతలా దిగజారిపోయామో ఒకసారి చూడండి

**బడ్జెట్ కేటాయింపుల్లో క్షీణత:** 2004–05, 2013–14 మధ్య, భారతదేశ విద్యా బడ్జెట్ 13,098 కోట్ల నుండి 71,059 కోట్లకు పెరిగింది (21% వృద్ధి రేటు). దీనికి భిన్నంగా, 2014–15, 2023–24 మధ్య కాలంలో ఇది 68,874 కోట్ల నుండి 1,23,357 కోట్లకు మాత్రమే పెరిగింది. వృద్ధి రేటు 7%కి పడిపోయింది. పాఠశాల విద్యా వృద్ధి రేటు 22% నుండి దారుణంగా 5%కి క్షీణించగా, ఉన్నత విద్యా వృద్ధి 19% నుండి 10% కి పడిపోయింది.

**రెవెన్యూ వ్యయంలో తగ్గిన వాటా:** 2004–14, 2014–24 మధ్య కాలంలో మొత్తం రెవెన్యూ వ్యయం (వడ్డీలు, గ్రాంట్లు మినహాయించి) 57.95 లక్షల కోట్ల నుండి 155.57 లక్షల కోట్లకు పెరిగింది. అయితే, విద్యా రంగంపై చేసిన వ్యయం 4.05 లక్షల కోట్ల నుండి కేవలం 8.38 లక్షల కోట్లకు మాత్రమే పెరిగింది. దీనివల్ల రెవెన్యూ వ్యయంలో విద్య వాటా 6.98% నుండి 5.39%కి తగ్గిపోయింది.

**ప్రభుత్వ కళాశాలల పట్ల ఉపేక్ష:** 2014 నుండి 2024 మధ్య, ప్రభుత్వ కళాశాలల సంఖ్య 7,885 నుండి 7,994కి పెరిగింది. అంటే కేవలం 1% వృద్ధి మాత్రమే. కానీ ఇదే కాలంలో ప్రైవేట్ కళాశాలల సంఖ్య 21,750 నుండి 32,513కి (49% వృద్ధి) పెరిగింది. ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలను

వ్యాపారాలను దెబ్బతీశాయి. ఇవి చారిత్రాత్మకంగా పెద్ద సంఖ్యలో కార్మికులకు ఉపాధి కల్పించేవి.

ప్రభుత్వ రంగ నియామకాలు పెద్దగా జరగడం లేదు. బహుశా తగ్గుముఖం పడుతున్నాయేమో కూడా. లక్షలాది ఖాళీలు భర్తీ కాకుండా ఉండిపోయాయి. భద్రత కలిగిన ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు వచ్చాయి. ప్రతి సంవత్సరం లేబర్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్న కోట్లాది మందికి ఉపాధి కల్పించడానికి అవసరమైన స్థాయిలో ఉత్పాదక రంగం పెరగలేదు. అదే సమయంలో, ప్రభుత్వ విద్య బలహీనపడింది. కోచింగ్ పరిశ్రమ విస్తరించి, యువత ఆందోళనను ఒక లాభదాయకమైన వ్యాపారంగా మార్చుకుంది. ప్రభుత్వం జీడీపీ వృద్ధి, జాతీయ రహదారులు, డిజిటల్ చెల్లింపులు, యూనికార్న్ కంపెనీలు , భారతీయ శతకోటీశ్వరుల సంపదను వేడుకగా జరుపుకుంటుంది, కానీ ఈ గణాంకాలేవీ నిరుద్యోగ యువత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేవు.

**“ కాబట్టి పేపర్ లీక్‌లను కేవలం పరిపాల నా అవినీతిగా మాత్రమే చూడకూడదు. అవి ఒక పెద్ద వర్గ అన్యాయానికి సాంద్ర రూపాలు. భద్రత కలిగిన ఉద్యోగాలు ఉద్దేశపూర్వకంగా తక్కువగా మారడం వల్ల కొద్దిపాటి పోస్టుల కోసం లక్షలాది మంది పోటీ పడుతున్నారు. ప్రతి అభ్యర్థి ఫీజులు చెల్లించాలి, దూర ప్రయాణాలు చేయాలి, స్టడీ మెటీరియల్ కొనాలి, కొన్నిసార్లు కోచింగ్ సెంటర్లలో ఏళ్లు గడపాలి. అక్రమాలు జరిగినప్పుడు అభ్యర్థి కష్టం, సమయం రెండూ వృథా అవుతాయి. ”**



జంతర్ మంతర్ వద్ద యువజనుల ఆందోళన

కాబట్టి పేపర్ లీక్‌లను కేవలం పరిపాల నా అవినీతిగా మాత్రమే చూడకూడదు. అవి ఒక పెద్ద వర్గ అన్యాయానికి సాంద్ర రూపాలు. భద్రత కలిగిన ఉద్యోగాలు ఉద్దేశపూర్వకంగా తక్కువగా మారడం వల్ల కొద్దిపాటి పోస్టుల కోసం లక్షలాది మంది పోటీ పడుతున్నారు. ప్రతి అభ్యర్థి ఫీజులు చెల్లించాలి, దూర ప్రయాణాలు చేయాలి, స్టడీ మెటీరియల్ కొనాలి, కొన్నిసార్లు కోచింగ్ సెంటర్లలో ఏళ్లు గడపాలి. ఒక పరీక్షలో అక్రమాలు జరిగినప్పుడు, ప్రభుత్వం సాంకేతిక లోపాలు, విచారణ కమిటీల గురించి మాట్లాడు తుంది. కానీ అభ్యర్థి కష్టం, సమయం రెండూ వృథా అవుతాయి. వయోపరిమితి దగ్గరపడు తుంది. కుటుంబ అప్పులు పెరుగుతాయి. మరో సంవత్సరం వ్యర్థమవుతుంది.

ఈ నిరసనలను ఒక ఓపిక లేని తరపు భావోద్వేగ ప్రకటనగా పలుచన చేసేందుకు

(24% వృద్ధి) కూడా కలిపితే, మొత్తం వృద్ధి రేటు 35% గా ఉంది. విచారకరమైన విషయమేమిటంటే, ప్రభుత్వ కళాశాలల పెరుగుదల అనేది ప్రణాళికాబద్ధంగా కాకుండా యాదృచ్ఛికంగా జరిగింది.

**ఎన్‌రోల్‌మెంట్‌లో వ్యత్యాసాలు:** అదేవిధంగా, విద్యార్థుల చేరికల పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. ప్రభుత్వ సంస్థల్లో చేరే విద్యార్థుల సంఖ్య 21% (134 లక్షల నుండి 163 లక్షలు) పెరగ్గా, ప్రైవేట్ సంస్థల్లో చేరేవారి సంఖ్య 42% (182 లక్షల నుండి 357 లక్షలు) పెరిగింది.

**మూతపడుతున్న పాఠశాలలు:** మనం రోజుకు సగటున 25 పాఠశాలలను మూసివేస్తున్నాం. 2014 నుండి 2023 మధ్య భారతదేశ జనాభా 12 కోట్లకు పైగా (9.3%) పెరిగింది. కానీ, దాదాపు అదే కాలంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 89,441 (8%) తగ్గిపోయింది.

**కోచింగ్ మాఫియా, ప్రవేశ పరీక్షల భారం:** పాఠశాల విద్యను నిర్వీర్యం చేసి, దాని స్థానంలో రకరకాల ప్రవేశ పరీక్షలను రుద్దారు. ఉదాహరణకు, ఢిల్లీలోని విద్యార్థులపై రుద్దిన అతి దండగమారి పరీక్ష CUET. ఢిల్లీలో టాపర్‌గా నిలిచిన విద్యార్థి కూడా CUET రాయకపోతే అక్కడి కళాశాలల్లో సీటు పొందలేరు. పైగా, ప్రతి ప్రవేశ పరీక్ష సమత్వానికి వ్యతిరేకమైనది, ఎందుకంటే కోచింగ్ ఫీజులు భరించగలిగిన వారు లేదా కోచింగ్ సదుపాయం ఉన్నవారు మాత్రమే ఇందులో విజయం సాధిస్తారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలకు మరణశాసనం రాసినట్లయింది.

ఫీజుల బాదుడు: 2014 నుండి 2026 మధ్య కాలంలో IIT ట్యూషన్ ఫీజులు 122% పెరిగాయి. ఐఐఎం అహ్మదాబాద్‌లో రెండేళ్ల కోర్సు ఫీజు దాదాపు 66% పెరిగింది. NID, NLU కూడా ఫీజులు రెండు నుండి మూడు రెట్లు భారీగా పెరిగాయి.

**పరిశోధనలకు నిధుల కోత:** విదేశాల్లో పనిచేస్తున్న భారతీయ సంతతి శాస్త్రవేత్తలను తిరిగి దేశానికి రావాలని ప్రభుత్వం ఆహ్వానిస్తుంటే, మన స్వంత పరిశోధనా ఫెలోషిప్‌లను మాత్రం రద్దు చేస్తున్నారు. KVPY స్థానంలో తీసుకొచ్చిన INSPIRE స్కాలర్‌షిప్‌లకు కూడా ప్రస్తుత సంవత్సర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు.

**ధనికులకే వైద్య విద్య:** ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు సగటు భారతీయుడికి అందుబాటులో లేకుండా పోయాయి.

> **"వామపక్షాల ముందున్న బాధ్యత ఈ ఆగ్రహాన్ని రొమాంటిసైజ్ చేయడం లేదా సంఘీభావంగా నిలబడి ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. వారితో సంభాషణలోకి దిగ డం, వారి బాధల వెనుక ఉన్న వ్యవ స్థాగత నిర్మాణాన్ని గుర్తించడంలో సహాయపడటం, వారి తక్షణ డిమాండ్లను కోట్లాది సురక్షిత, సామాజికంగా ఉపయోగకరమైన ఉద్యోగాలను సృష్టించగల ఒక ప్రణాళికతో జోడించడం."**

ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అది హేళన చేయడం, అణచివేత, చర్చల వాగ్దానాలు, ఉద్యమాన్ని విభజించే ప్రయత్నాల మధ్య మారుతూ ఉంటుంది. యువకులకు అనుభవం లేదని, విదేశీ శక్తులు వారిని దారి మళ్లిస్తున్నాయని లేదా వారి నిరసన దేశ ప్రతిష్టను దెబ్బతీస్తుందని చెప్తారు. కానీ యువతకు ఉపయుక్తమైన పనిని కల్పించమని డిమాండ్ చేయడంలో దేశద్రోహమేమీ లేదు. యువతను వినియోగదారులుగా, డేటా పాయింట్లుగా, డెలివరీ వర్కర్లుగా, ఎన్నికల సందర్భంగా బల ప్రదర్శనకు అవసరమైన మూకగా మాత్రమే పరిగణిస్తూ హక్కులు ఉన్న కార్మికులుగా, ప్రశ్నించే పౌరులుగా, భవిష్యత్తుకు అర్హులైన మానవులుగా గుర్తించబడని ఈ వ్యవస్థే భారతదేశానికి హాని తలపెడుతుంది.

'కాక్రోచ్' ఉద్యమం శక్తి ముఖ్యమైనదే, కానీ కేవలం సద్యోజనితం (స్పాంటేనిటీ) డిజిటల్ ప్రచారాలు మాత్రమే పాతుకుపోయిన అధికారాన్ని జయించలేవు. దాని శాశ్వత బలం అనేది పరీక్షల సంస్కరణలను ఉపాధి, ప్రభుత్వ విద్య, కార్మిక హక్కులు, ఆర్థిక పునర్విభజన కోసం చేసే పోరాటంతో ముడిపెడుతుందా లేదా అనే దానిపై ఆధారపడి ఉంటుంది. జంతర్ మంతర్ వద్ద ఉన్న విద్యార్థుల భవిష్యత్తు కాంట్రాక్ట్ టీచర్లు, స్కీమ్ వర్కర్లు, డెలివరీ బాయ్స్, ఫ్యాక్టరీ అప్రెంటిస్‌లు, నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు, గ్రామీణ కూలీలతో ముడిపడి ఉంది. వ్యవస్థీకృత రాజకీయాన్ని, ట్రేడ్ యూనియన్లను, పాత విద్యార్థి సంఘాలను వేరే తరానికి చెందిన పాత ఆనవాళ్లుగా చిత్రీకరించే ప్రయత్నాలను ఈ ఉద్యమం నిరోధించాలి. వ్యవస్థీకృత శ్రామిక వర్గం గడించిన అనుభవం యువత తిరుగుబాటుకు భారం కాదు. అది ఆ తిరుగుబాటుకు ఓర్పును, సరైన దిశను ఇచ్చే వనరులలో ఒకటి.

"బొద్దింక" అనే పేరులో అనుకోకుండా ఒక చారిత్రక నిజం దాగి ఉంది. బొద్దింకలు బతుకుతాయి ఎందుకంటే వాటిని అంతం చేయడం కష్టం. కానీ వీధుల్లో ఉన్న యువకులు ఒక క్షీణ వ్యవస్థ సందుల్లో గొందుల్లో బతకాలని మాత్రమే కోరుకోవడం లేదు. వారు గౌరవప్రదంగా జీవించాలని, పని చేయాలని, తాము నేర్చుకున్నదాన్ని సమాజానికి ఉపయోగపెట్టాలని, సమాజానికి తోడ్పడాలని కోరుకుంటున్నారు. వారి ఆగ్రహం ఉపరితలంలో ఒక తరానికి సంబంధించినదిగా కనిపిస్తున్నప్పటికీ, దాని ఆంతర్యంలో అది ఒక తీవ్రమైన వర్గ పోరాటం.

వామపక్షాల ముందున్న బాధ్యత ఈ ఆగ్రహాన్ని రొమాంటిసైజ్ చేయడం లేదా సంఘీభావంగా నిలబడి ఉపన్యాసాలు ఇవ్వడం కాదు. వారితో సంభాషణలోకి దిగ డం, వారి బాధల వెనుక ఉన్న వ్యవ స్థాగత నిర్మాణాన్ని గుర్తించడంలో సహాయపడటం, వారి తక్షణ డిమాండ్లను కోట్లాది సురక్షిత, సామాజికంగా ఉపయోగకరమైన ఉద్యోగాలను సృష్టించగల ఒక ప్రణాళికతో జోడించడం.

పార్లమెంటు వెలుపల నిరసనకారులు లేవనెత్తిన ప్రశ్నలకు టియర్ గ్యాస్ సమాధానం ఇవ్వలేదు. భారతదేశ పాలకులు వారిని బారికేడ్ల వెనక్కి నెట్టి, కీటకాలనీ, పరాన్నజీవులనీ, అల్లరిమూకలనీ వారి మీద ముద్ర వేయొచ్చు. కానీ తమ యువతకు స్థానం కల్పించడానికి నిరాకరించే సమాజం, ఆ యువతే చివరికి సమాజాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించుకున్నారని గ్రహిస్తుంది.

*

---

NEET అనేది ఓపెన్ కేటగిరీలోని కేవలం 30,000 ప్రభుత్వ మెడికల్ సీట్ల కోసం జరుగుతున్న పోటీ మాత్రమే. మిగిలిన 70,000 ప్రైవేట్ సీట్లు 1.25 కోట్ల ఫీజు చెల్లించగలిగే 1% ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉన్న 'ధనికుల రిజర్వేషన్'గా మారాయి. అన్ని ప్రైవేట్ కళాశాలల ఫీజులు ప్రభుత్వ సంస్థల కంటే 5 నుండి 10 రెట్లు ఎక్కువగా ఉన్నాయి.

**ప్రైవేట్‌కే ప్రాధాన్యం:** ప్రస్తుత సంవత్సరానికి ప్రభుత్వం గొప్పగా 9,911 అదనపు సీట్లను ప్రకటించినప్పటికీ, అందులో కేవలం 2,400 సీట్లు మాత్రమే ప్రభుత్వ సంస్థల్లో ఉన్నాయి. మిగిలిన 78% సీట్లు ప్రైవేట్ రంగంలోనే ఉన్నాయి. ఇవి సామాన్యుడికి అందుబాటులో లేవు.

ఆర్థిక సర్వే 2025-26 నివేదికను ప్రకారం...

ఎ. కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో (31-01-2025 నాటికి) 56.2% ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఏ. 75% ఉన్నత విద్యా సంస్థల్లో పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా విద్యార్థులను సిద్ధం చేసే బోధన (Industry Readiness) లేదు.

ఐ. దాదాపు 2 కోట్ల మంది యువత (14-18 సంవత్సరాల వయస్సు గలవారు) బడికి దూరంగా ఉన్నారు.

లక్ష్యాలకు దూరంగా స్థూల చేరికల నిష్పత్తి (GER): మనం చెప్పుకోవడానికి GER లక్ష్యాలను పెద్దగా ప్రచారం చేసుకుంటున్నాం, కానీ సెకండరీ స్థాయిలో (9 నుండి 12 తరగతులు) GER 68.5%కి పడిపోయింది (జాతీయ విద్యా విధానం - NEP 2030 నాటికి నిర్దేశించుకున్న 100% లక్ష్యానికి ఇది చాలా దూరం). ఉపాధిని, ఉన్నత విద్యార్హతను నిర్ణయించే ఈ కీలకమైన దశలో దాదాపు మూడో వంతు మంది పిల్లలు విద్యారంగానికి దూరంగా ఉన్నారు.

దశాబ్దాల తర్వాత ఈ చర్చ మొదలైంది. ఒక మంత్రి రాజీనామాతోనే ఇది ముగిసిపోకూడదని, మనం అంతకంటే పెద్ద విద్యా సంస్కరణలను డిమాండ్ చేయాలని నేను భావిస్తున్నాను. ఇది భారతదేశం చేయిజార్చుకోకూడని గొప్ప అవకాశం. ఇది ప్రతి విద్యార్థికి, ప్రతి తల్లిదండ్రులకు, ప్రతి యువకుడికి, మన భారత దేశ భవిష్యత్తుకు సంబంధించిన అతి కీలకమైన అంశం.

*

# అయోధ్య రాముని దోచుకున్న ఆర్ఎస్ఎస్ పరివారం



రచయిత వెటరన్ జర్నలిస్టు. గతంలో టెలిగ్రాఫ్, స్టేట్స్‌మాన్ పత్రికల్లో పనిచేశారు. ప్రస్తుతం జలంధర్‌లోని లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో విజిటింగ్ ఫాకల్టీగా పనిచేస్తున్నారు

**నళిన్ వర్మ**

రామజన్మభూమి ఉద్యమంలో అద్వాని రామ రథయాత్ర, బీహార్‌లో ఆయనను అరెస్టు చేయటం, బాబ్రి మసీదును కూల్చి వేయటం–ఈ సంఘటనలు 1990వ దశాబ్దంలో జరిగాయి– హిందు సమాజంలోని అనేక తరగతుల దృక్పథంలో మార్పు తీసుకొచ్చాయి. దానితో పాటు భారతదేశ రాజకీయ రంగంలో కూడా మార్పులు చోటు చేసు కున్నాయి.

2014 నుండి అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోడి ఈ ఉద్యమ అసలు హీరోలైన అద్వాని, మురళి మనోహర్‌జోషి, అశోక్‌సింఘాల్, ఉమా భారతి, ప్రవీణ్ తొగాడియా, వినయ్ కటియార్ తదితరులను ఒక పద్ధతి ప్రకారం పక్కన పెట్టాడు. అయినప్పటికీ హిందు–ముస్లిం విభజన నుండి మోడి–షా ద్వయం అపారమైన రాజకీయ లబ్దిని పొందింది. దీనికి అవసరమైన బీజాలను 1990వ దశాబ్దంలో నాటారు.

న్యాయవ్యవస్థ, దానికి సహకరించటానికి ఏర్పాటు చేసిన పరిశోధనా సంస్థలపై సంఘ్ పరివార్ ఆధిపత్యం పెరిగింది. ప్రజలకు సమాచారాన్ని చేరవేసే వ్యవస్థలు వారి ఆధీనంలోకి వచ్చాయి. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఒకప్పుడు బాబ్రిమసీదు ఉన్నచోట రామ మందిరం నిర్మించిన ప్రతిష్ఠను హింది ప్రాంతంలోని హిందు సమాజం మోడికి కట్టబెట్టింది.

2024 పార్లమెంటు ఎన్నికలకు ముందు అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రధాన పూజారిగా వ్యవహరించటంతో హిందు హృదయ సామ్రాజ్యంలో మోడికి బలమైన స్థానం లభించింది.

రామాలయ నిర్మాణం కోసం భక్తులు ఇచ్చిన కోట్లాది రూపాయల చందాలు, ఆలయంలో రాముని ముందు సమర్పించిన కానుకలలోని ధనం, వెండి, బంగారం, వజ్రాలు, రత్నాలు, తదితరాలలో జరిగిన అవినీతితో హిందు సమాజంలో రాముని పట్ల ఉన్న విశ్వాసం సడలకపోయినప్పటికీ మోడి, హైందవ సంస్థల పట్ల ఉన్న విశ్వాసం సన్నగిల్లుతున్నదని రాజకీయాలు, మతపరమైన విషయాలను పరిశీలించేవారు భావిస్తున్నారు.

బిజెపితో పాటు సంఘ్ పరివార్ సంస్థలన్నింటికీ పునాది సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ రామ జన్మభూమి ఉద్యమం హిందువులలో పునరుజ్జీవాన్ని కలిగించిందని చెప్పింది. ఇంత భారీస్థాయిలో శ్రీరాముని ధనాన్ని, బంగారాన్ని లూటీ చేయటం హిందువుల మనసులలో ఎటువంటి ప్రభావం కలిగించదా అన్న సందేహాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

రాముని పేరుతో ప్రచారం చేసుకోవటం బిజెపికి భారీగా రాజకీయ ప్రయోజనం కల్పించింది. మరి రామునికి ప్రజలు సమర్పించిన ధనం, బంగారం, వజ్రాలు, ఆలయ నిర్మాణానికి ఇచ్చిన చందాలను దొంగిలించటం, అవినీతికి పాల్పడటం రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు–ట్రస్టులోని వారందరూ ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర హోం మంత్రి నియమిచింనవారే–పై విశ్వాసాన్ని దెబ్బతీయదా?

**అట్టడుగు స్థాయిలోని వాస్తవ పరిస్థితులు**

పూర్వాంచల్‌లోని సుదూరంగా ఉన్న వెనుకబడిన ప్రాంతాలలో–బీహార్‌లోని సివాన్, తూర్పు ఉత్తర ప్రదేశ్‌లోని డియోరియా జిల్లాలోని మెహ్రోనా, భట్‌పూర్– ఈ మధ్య పర్యటించాం. దిగువస్థాయిలోని సామాజిక–ఆర్థిక సంబంధాలలో వచ్చిన తీవ్రమైన మార్పులు ఈ పర్యటనలో వెలుగులో కొచ్చాయి.

సోమనాథ్ నుండి అయోధ్యకు అద్వాని ప్రారంభించిన రథయాత్ర, లాలూప్రసాద్ యాదవ్ ప్రభుత్వ పోలీసులు ఆయనను అరెస్టు చేయటం 1990లో జరిగింది. 1992లో బాబ్రిమసీదును కూల్చివేశారు. అది డిజిటల్, ఇంటర్నెట్, ఆండ్రాయిడ్ ఫోన్‌లు లేని, సమాచార సాంకేతిక విప్లవానికి ముందు కాలం. మార్కెట్ ఆర్థికవ్యవస్థకు ముందుదైన ఆ కాలంలో సామాజిక జీవనం, ముఖ్యంగా అట్టడుగు స్థాయిలో ప్రజల ఆలోచనా విధానానికి మార్గదర్శిగా ఉండేది.

అద్వాని, ఎ బి వాజ్‌పేయి, జోషి, ఉమాభారతి లాంటి నాయకుల ఉపన్యాసాలు వారికి దూరంగా జరుగుతుండేవి. వారు ఈ ప్రజల వద్దకు వచ్చి మాట్లాడినపుడు మాత్రమే వాటిపై చర్చలు జరిగేవి. పేదలకు ఇళ్ళస్థలాలు ఇవ్వటం, కరువులు, వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు వచ్చిపుడు సబ్సిడీలివ్వటం, సమాజంలోని అట్టడుగు తరగతులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించటం తదితరాలు అప్పటికీ ఉన్నాయి. ఈ ప్రయోజనాలు పొందటానికి ప్రజలు ప్రధానంగా సమితి, పంచాయితి స్థాయిలో ఉన్న అధికారులపై ఆధారపడేవారు.

అద్వాని గురించి అయినా, లాలూప్రసాద్ యాదవ్ గురించి అయినా లేదా ఇతర రాజకీయ నాయకులను గురించి అయినా గ్రామాలలోని కచేరిల వద్ద, వేసవిలో ఉమ్మడిగా చెట్లకింద కూర్చొని, చలికాలంలో చలిమంటల చుట్టూ చేరి, ప్రజలు సామూహికంగా చర్చించుకొనేవారు. ఇపుడు విస్తారమైన సమాచార ప్రవాహం ముంచి వేయటం, మొబైల్ ఫోన్ల వినియోగంతో ఈ పరిస్థితులు చాలా వరకు మారిపోయాయి.

స్థానికంగా పాటలు పాడేవారు, కథలు చెప్పేవారు, గ్రామాలలో జరిగే ప్రజల సమ్మేళనాలు తదితరాలు ప్రజలను ప్రభావితం

> **"మీరు అయోధ్య వెళ్ళారా? రామునికి కానుకలిచ్చారా?" అన్న ప్రశ్నకు పూర్వాంచల్ లోని దరైల్‌కు చెందిన పేదరైతు హర్దన్-మారుపేరు - "అవును, ఆ పాపం చేశాను" అని చెప్పాడు. కాని మోడి కా పైసా (వృద్ధాప్య పెన్షన్, ఇతర సబ్సిడిలు) తనకు వస్తుండటం వలన మోడికి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఆయన సుముఖంగా లేడు. తను ఈ అవినీతికి వ్యతిరే కంగా మాట్లాడితే మోడి వద్ద నుండి-బ్యాంకు ద్వారా- వచ్చే డబ్బులు పోతాయనే భయంతో ఆయన ఉన్నాడు.**



అయోధ్యలో రామాలయం

చేసే అంశాలుగా ఉండేవి. గ్రామాలలో ఇంకా ఉన్న రామ్‌లీలలో నటించే నటులు, అల్హా-ఉడల్ పాటలు పాడేవారు, బిర్హా, సొరాటి, లోరికాయన్ తదితర కళాకారులు వారికి వినోదం అందిస్తున్నారు. రామ్‌లీలలో రాముడు, రావణాసురుడు పాత్రలలో నటించే స్థానికులు ఈ ప్రాంతంలో తాజియాగా పిలిచే మొహరం పండుగ సమయంలో కర్బలాలో హుస్సేన్ చేసిన బలిదానాన్ని కూడా ప్రశంసిస్తుంటారు.

ఆధార్, బ్యాంక్ ఎకౌంట్లు, మొబైల్ ఫోన్‌లను లింక్ చేయటం ద్వారా వృద్ధాప్య పెన్షన్‌లు, ప్రభుత్వం ఇచ్చే వివిధ రకాల సబ్సిడీలు, ఎన్నికల సమయంలో కల్పించే ప్రయోజనాలు తదితరాలను లబ్దిదార్లకు చేర్చటంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రధానమైన మార్పులను తీసుకొచ్చింది. 54 కోట్లమందిని ఈ క్రమంలో భాగం చేయటంతో అట్టడుగు స్థాయిలోని సామాజిక-ఆర్థిక సంబంధాలలో తీవ్రమైన మార్పులు వచ్చాయి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మరికొన్ని బ్యాంకులు ప్రతి గ్రామంలోనూ వినియోగదారుల సేవా కేంద్రాలను ఏర్పాటు చేశాయి. తమ వృద్ధాప్య పెన్షన్‌లు, ఇతర సబ్సిడీలను తీసుకోవటం కోసం ప్రజలు గుమిగూడే కొత్త స్థలాలుగా ఈ వినియోగ దారుల సేవా కేంద్రాలు మారాయి.

ఈ ప్రయోజనాలు పొందటానికి అవసరమైన కెవైసి డాక్యుమెంట్లు తయారు చేయటం, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, శాశ్వత నివాస ధృవీకరణ సర్టిఫికెట్‌లకు దరఖాస్తులు పంపటం కోసం ఈ డిజిటల్ యుగంలో అత్యవసరమైన కంప్యూటర్, ఇంటర్నెట్ సేవా కేంద్రాలు కూడా ఈ వినియోగ దారుల సేవా కేంద్రాలతో సమాంతరంగా వచ్చాయి.

ఈ డిజిటల్ సెంటర్లు అవినీతికి అతీతంగా ఉన్నాయని కాదు. డిజిటల్ కాలానికి ముందు సమితి, పంచాయితి అధికారులు లంచాల కోసం డిమాండ్ చేసిన విధంగానే ఈ సేవాకేంద్రాలు, కంప్యూటర్ సెంటర్లలో కూడా తరచుగా కెవైసి, ఇతర సర్టిఫికెట్ల కోసం 200-300 రూపాయలు ఇవ్వమని డిమాండ్ చేస్తున్నారు. లంచం చెల్లించిన తర్వాత తమకు వచ్చే మొత్తాలు తిన్నగా తమ బ్యాంక్ ఎకౌంట్‌లో జమ కావటం, ఈ సమాచారం తమ మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ రావటం, తమకు ఉచితంగా వచ్చే మొత్తం కన్నా చెల్లించే లంచం చాలా తక్కువగా ఉండటంతో లబ్దిదారులకు ఈ విధానం ప్రయోజనకరంగా ఉన్నది.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలతో స్థానిక పాటలు పాడేవారు, జానపద కళాకారులు, కథలు చెప్పేవారి సంఖ్య భారీగా పెరగటంతో పాటు అట్టడుగు స్థాయిలో ఉన్నవారు కూడా అభివృద్ధి చెందవచ్చుననే భ్రమలు కల్పించింది. కాని అల్హా-ఉడాల్, బిర్హా, లోరికాయం పాడేవారు పూర్వాంచల్‌లోని గ్రామాలలో కొద్దిమంది మాత్రమే ఉన్నట్లు ఈ రచయిత గమనించాడు. ఒకప్పుడు స్థానిక యువకులను ఆకర్షించిన సాంప్రదాయక ఆటలు, పోటీలు దాదాపుగా అదృశ్యమైపోయాయి.

### అవినీతి వ్యతిరేక ఉద్యమం?

ఏ విధంగా చూసినప్పటికీ రాముని ధనాన్ని దోచుకోవటం అనేది హిందు, సనాతన ధర్మ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా ఉన్నది. ఇది బిజెపి రాజకీయ అవకాశాలపై ప్రభావం చూపుతుందా?

"మీరు అయోధ్య వెళ్ళారా? రామునికి కానుకలిచ్చారా?" అన్న ప్రశ్నకు పూర్వాంచల్ లోని దరైల్‌కు చెందిన పేదరైతు హర్దన్-మారుపేరు - "అవును, ఆ పాపం చేశాను" అని చెప్పా డు. కాని మోడి కా పైసా (వృద్ధాప్య పెన్షన్, ఇతర సబ్సిడిలు) తనకు వస్తుండటం వలన మోడికి వ్యతిరేకంగా మాట్లాడటానికి ఆయన సుముఖంగా లేడు. తను ఈ అవినీతికి వ్యతిరే కంగా మాట్లాడితే మోడి వద్ద నుండి-బ్యాంకు ద్వారా- వచ్చే డబ్బులు పోతాయనే భయంతో ఆయన ఉన్నాడు.

వాస్తవానికి బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. రాఫెల్ కుంభకోణం, పెగాసస్ వివాదం, ఎన్నికల బాండ్ల కేసు, ప్రధానమంత్రి కేర్ ఫండ్‌ను ప్రజల పరిశీలనకు అనుమతించక పోవటం, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ భారి ఎత్తున భూములు స్వంతం చేసుకోవటం, కీరదోసకాయల పంటకు ఇచ్చే సబ్సిడి కోటి రూపాయలు ఒక కేంద్రమంత్రి కాజేయటం తదితర అవినీతి ఆరోపణలను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది.

కాని గతంలో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ బోఫోర్స్ కుంభకోణాన్ని ప్రధాన రాజకీయ అంశంగా మార్చి, అట్టడుగు ప్రజల స్థాయికి తీసుకువెళ్ళి, స్థానిక ప్రజలు సామూహికంగా చర్చించి, సరైన నిర్ణయానికి వచ్చేలా చేశాడు. కాని మోడి ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ఆ విధంగా ప్రచారం చేయటం, దిగువ స్థాయి

వరకు తీసుకువెళ్ళి, ప్రజలను ఐక్యంగా కదిలించటంలో ప్రస్తుత ప్రతిపక్ష పార్టీలు, నాయకులు విఫలమైనారు. పాత కాలపు సామూహిక జీవన విధానం విచ్ఛిన్నం కావటం, తమ వైఖరిని ప్రజల వద్దకు తీసుకు వెళ్ళటంలో డిజిటల్ యుగంలో ప్రతిపక్షాలకు ఎదురౌతున్న ఇబ్బందులు బహుశ ఇందుకు కారణం అయివుండవచ్చు.

> ❝ అయోధ్యలో రామునికి ప్రజలు సమర్పించిన కానుకలు, ఆలయ నిర్మాణానికి ఇచ్చిన చందాలలో అవినీతికి పాల్పడిన, దేవాలయ నిర్వహణ చూస్తున్న ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై ప్రజలలోని పెద్దభాగంలో ఉన్న భ్రమలు తొలుగుతాయనే విశ్వాసాన్ని కొందరు నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకులు కూడా అయోధ్య ఆలయంలో జరిగిన ఈ కుంభకోణం చూయించే రాజకీయ ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ❞

**దెబ్బతిన్న ప్రజల విశ్వాసం**

అయోధ్యలో రామునికి ప్రజలు సమర్పించిన కానుకలు, ఆలయ నిర్మాణానికి ఇచ్చిన చందాలలో అవినీతికి పాల్పడిన, దేవాలయ నిర్వహణ చూస్తున్న ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై ప్రజలలోని పెద్దభాగంలో ఉన్న భ్రమలు తొలుగుతాయనే విశ్వాసాన్ని కొందరు నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకులు కూడా అయోధ్య ఆలయంలో జరిగిన ఈ కుంభకోణం చూయించే రాజకీయ ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్దికాలంలో ఎన్నికలు జరుగనున్న ఉత్తరప్రదేశ్‌లో కొందరు ప్రతిపక్ష నాయకులు-ప్రత్యేకంగా సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్- చాలా అప్రమత్తంగా ఉన్నారు.

కాని నిర్బంధానికి గురవుతామనే భయం, తాము జీవించటానికి ప్రధాన వనరుగా మారిన "ఉచితాలు" రాకుండా పోతాయేమోననే ఆందోళనతో సామాన్య ప్రజలు మౌనంగా ఉంటున్నారు. దానితో పాటుగా మీడియాలో ఉన్న సంఘ్ పరివార్ అనుయాయులు ప్రస్తుతం అయోధ్యలోని రామునికి ప్రజలిచ్చిన కానుకలను కాజేసిన అంశంపై ప్రజలను నమ్మించేలా వివరణలు ఇచ్చి, 2027లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికలలో పరిస్థితులను తమకు అనుకూలంగా మలచగలమనే నమ్మకంతో ఉన్నారు.

సనాతన హిందు ధర్మానికి అత్యున్నత చిహ్నంగా ఉన్న పురుషోత్తముడైన శ్రీరాముని పేరుతో జరిగిన ఈ కుంభకోణం రాజకీయంగా ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందనేది కాలం మాత్రమే తెలుపగలదు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# గ్రామీణ భారతంలో వర్గాల సామాజిక-ఆర్థిక లక్షణాలు

**(8వ పేజీ తరువాయి)**

**కార్మికులు-పేద రైతాంగం మధ్య చెలిమిని నిర్మించడం ద్వారా మాత్రమే మన పునాది శక్తిని మరింత బలోపేతం చేసుకోగలుగుతాం. ఈ పునాది వర్గాల బలాన్ని మనం పెంచుకోగలిగితే భూస్వామ్యేతర రైతాంగం కూడా మనతో వచ్చి చేరుతుంది.".....**

గ్రామీణ భారతదేశంలో దోపిడికి, పీడనకు ఉపకరించే ప్రతి సాధనం భూస్వాములు, పెట్టుబడిదారీ రైతాంగంతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నది.

వ్యవసాయ రంగంలో వర్గాల సమస్యకు కులపీడన, జెండర్ అణిచివేత, పురుషాధిపత్య భావజాలం, శాస్త్రీయ ఆలోచనను గిడిస బార్చడం, ఆధునిక, విజ్ఞాన సంస్కృతిని అణగ దొక్కడం వంటి అంశాలకు మధ్య ఉన్న అంత:సంబంధాన్ని సమీప గతం వరకూ తృణీకరిస్తూ వచ్చాం. తద్వారా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నాం అని పార్టీ మధురై మహాసభ గుర్తించింది. ఈ అంశాలను వర్గపోరాటంలో అంతర్భాగం చేసుకోకపోవడమంటే సరాసరి అస్థిత్వ రాజకీయాలకు మార్గం సుగమం చేసినట్లే.

భూస్వాములు, ధనిక పెట్టుబడిదారీ రైతాంగం కేవలం ఆర్థికంగా అగ్రస్థానంలో ఉండడమే కాదు గ్రామాల్లోని సంప్రదాయ సామాజిక జీవితం మీదా, ఆధునిక రాజకీయ అధికార దొంతరల మీదా పెత్తనం చెలాయిస్తున్నారు. ఈ ఆధిపత్యాలను కూలదొయ్యాలంటే ఈ ఆధిపత్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను వీరి పోరాటంతో మిళితం చెయ్యాలి. గ్రామీణ పేదలను పెద్ద ఎత్తున సమీకరించడం ద్వారా ఈ కర్తవ్యాన్ని చేపట్టాలి. ఈ పోరాటాలను గ్రామీణ పేదలు కాకపోతే ఇంకెవరు ముందుండి నడుపుతారు? గ్రామీణ ప్రాంత ధనికులా? ఏ దోపిడి వ్యవస్థకు కందెనలా పని చేస్తున్నారో ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వాళ్ళు కలిసి వస్తారని ఆశించవచ్చా?


చరిత్రను తరచి చూస్తే వేతన కార్మికులు-పేద రైతాంగం యొక్క ఐక్య కార్యాచరణయే మన దేశ గ్రామీణ ప్రాంత రూపురేఖలను మార్చడానికి అక్కరకు వచ్చే సంస్థాగత పునాదిగా మన్నుతుందని తెలియవస్తుంది. గ్రామీణ ప్రాంతంలో 70 శాతం మంది వ్యవసాయ-వ్యవసాయేతర రంగాలలో వేతన కార్మికులుగా పని చేస్తున్నారు. వీరంతా వ్యవసాయ కార్మిక, పేద రైతాంగ వర్గానికి చెందినవారే.

పేద రైతాంగం, వేతన కార్మికుల మధ్య ఉన్న సరిహద్దులు భారతదేశ గత చరిత్రలోనే లేనివిధంగా ఈనాడు అంత:సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఒక సీజన్‌లో పేదరైతు మరో సీజన్ నాటికి వేతన కార్మికుడిగానూ మరొక సీజన్‌లో అటు పేదరైతు, ఇటు వేతన కార్మికుడిగానూ కొనసాగుతున్నాడు. ఇంకొక అడుగుముందుకు వేసి చెప్పుకోవాలంటే స్థూలంగా వీరి డిమాండ్లు పరిపరివిధాలా ఒకటిగానే ఉంటున్నాయి.

2025 ఏప్రిల్ నెలలో మధురై మహాసభలో ఆమోదించిన రాజకీయ సమీక్షా నివేదిక నిర్దేశించిన కర్తవ్యాన్ని అనుసరించి గ్రామీణ ప్రాంతాల్లో పేద రైతాంగం, వేతన కార్మికుల మధ్య ఐక్యతను నిర్మించి - తదనంతరం రైతాంగంలోని ఇతర తరగతులకూ విస్తరింపచేసి - గ్రామీణ ప్రాంత ప్రజానీక సామాజిక, ఆర్థిక విముక్తి కోసం కృషి చెయ్యాలి. కాబట్టి మన వ్యవసాయరంగ ఉద్యమంలో పనిచేసే కార్యకర్తలు ప్రతి రాష్ట్రంలోనూ జిల్లా, బ్లాక్, మండల, పంచాయతీ స్థాయిలలో ఏదో ఒక గ్రామాన్ని ఎంచుకుని అక్కడి పేద రైతులు, వేతన కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడాలి. వాళ్ళ జీవనోపాధి, ఆదాయాలు, గ్రామీణ ప్రాంత పేదల సామాజిక స్థాయి, వాళ్ళు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలి. గ్రామీణ ప్రాంత పేదల నాయకత్వాన జరిగే పోరాటాల ద్వారా మాత్రమే గ్రామీణ ప్రాంత సామాజిక జీవన ముఖ చిత్రాన్ని మార్చగలం.

*

# క్రీ.శ.12-15 శతాబ్దాల ఆర్థిక పరిస్థితులు-2



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

(గత మాసం వ్యాసంలో ఈ కాలంలో ఉన్న వివిధ వర్గాల స్థితిగతులు తెలుసుకున్నాం. అంతకు మునుపే వ్యవసాయ రంగం గురించి తెలుసుకున్నాం. ఇక వ్యవసాయేతర రంగాల గురించి)

**వ్యవసాయేతర ఉత్పత్తులు:**
**చేనేత**

గనుల తవ్వకాలు, కలప కోసి తేవడం వంటి పనులు దూరంగా అడవుల్లో సాగేవి. అవి తప్ప తక్కిన వ్యవసాయేతర వృత్తులన్నీ ప్రధానంగా పెద్ద, చిన్న పట్టణాల్లోనే నడిచేవి. అటువంటి వృత్తులన్నింటిలోకీ, దాని విలువ రీత్యా కానీ, దానిలో నిమగ్నమైన పనివారి సంఖ్యరీత్యాల కానీ, జరిగిన ఉత్పత్తి పరిమాణం రీత్యా కానీ చేనేత రంగం ప్రథమ స్థానంలో ఉండేది. పత్తి పంట ఒక ప్రధాన వ్యాపార పంటగా మధ్య యుగాలలో సాగయేది. గ్రామాల్లో పత్తిని ఏకడం, నూలు వడకడం వరకూ గ్రామాల్లోనే ప్రధానంగా చేసేవారు. ఐతే, 14వ శతాబ్దం ప్రారంభం నాటికి నూలు వడకడం పట్టణ మహిళల్లో సైతం ఒక ప్రధాన వ్యాపకంగా పెంపొందింది. ఐతే, అప్పుడే భారతదేశంలోకి కాళ్ళతో తొక్కుతూ మగ్గాన్ని ఆడించే సాంకేతికత ప్రవేశించింది. నేటికీ చేనేత ఈ తరహా మగ్గాల మీదనే ప్రధానంగా సాగుతుంది. ఈ కొత్త సాంకేతికత వలన నేతగాళ్ళ చేతులు స్వేచ్ఛ పొందాయి. దారపు కండెను అటునుంచి ఇటు మార్చేందుకు ఇప్పుడు చేతులు ఉపయోగపడ్డాయి. దాంతో నేత వేగం బాగా పెరిగింది. బట్ట తయారీ వేగంగా, ఎక్కువ పరిమాణంలో సాగింది. దీని వలన బట్టలకు రంగులు అద్దే పని, వాటిని ఉతికే వృత్తి పెరిగాయి. రంగులు అద్దడానికి కర్ర అచ్చులను విరివిగా ఉపయోగించసాగారు. ఇది ఇప్పుడు కలంకారీ పేరుతో మన రాష్ట్రంలో బందరు ప్రాంతంలో కొనసాగుతోంది.

చాలా కాలం వరకూ బట్టలను ఉతకడానికి కుంకుడు, సీకాకాయలే ప్రధాన వనరుగా ఉండేవి. ముస్లింలు ప్రవేశించాక సున్నం, సోడా కలిసిన మట్టిని తీసి అవిశ గింజల నూనెతో మేళవించి గంగాళాల్లో ఉడకబెట్టి సబ్బు తయారు చేసే విధానం తెలుసుకున్నారు. సబ్బు తయారీ కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. ముతక వస్త్రాల నుండి అత్యంత నాజూకైన మజ్లిన్ తరహా వస్త్రాల వరకూ విరివిగా ఉత్పత్తి అయేవి. మజ్లిన్ తయారీలో బెంగాల్‌దే అగ్రస్థానం.

అత్యంతఖరీదైన వస్త్రాలు మాత్రం పట్టు వస్త్రాలే. ఇందుకు ఒక కారణం 15 వ శతాబ్దం వరకూ ముడి పట్టును చైనా నుండి దిగుమతి చేసేకోవలసిరావడమే. మల్బరీ తోటల సాగును, పట్టుపురుగుల పెంపకాన్ని మన దేశంలో బెంగాల్‌లో మొదలుపెట్టింది 15వ శతాబ్దంలో మాత్రమే.

నేతతో ముడిపడిన మరొక వృత్తి దర్జీ పని. 13వ శతాబ్దంలో కేరళ సందర్శించిన మార్కో పోలో కేరళ అంతా వెతికినా, ఒక్కడంటే ఒక్క దర్జీ అనేవాడు కూడా కనిపించలేదు అని తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు. ఉత్తర భారతంలో కుషానుల కాలం నాటికే (క్రీ.శ. 1–4 శతాబ్దాల మధ్య) బట్టలను కుట్టే నైపుణ్యం ఉండేది. ఐతే అటువంటి దుస్తులను ధరించే స్థాయి పాలక వర్గాలకే ఉండేది. ఢిల్లీ సుల్తానుల కాలం వచ్చేసరికి దర్జీ వృత్తి విస్తరించింది. కుట్టు సూదిని అమీర్ ఖుస్రూ "స్త్రీ చేతిలోని బాణం" అని వర్ణించాడు. బట్ట తయారీ పెరగడం వలన దర్జీ వృత్తి పూర్తి కాలపు వ్యాపకంగా మారింది. మగవారి పాత్ర పెరిగింది.

**భవన నిర్మాణం**

ఇప్పటికీ ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో చెదరకుండా నిలబడివున్న అనేక పురాతన కట్టడాలు చాలా మేరకు ఢిల్లీ సుల్తానుల హయాంలో నిర్మించినవే. వాటన్నింటినీ మొత్తంగా చూసినప్పుడు ఆ కాలంలో వాటి నిర్మాణానికి భారీగా పెట్టుబడులు పెట్టారని, పెద్ద సంఖ్యలో ఆ పనుల్లో వివిధ నైపుణ్యాలు కల వృత్తిదారులను, కూలీలను ఉపయోగించారని తెలుస్తోంది. భవనాలు, బురు జులు, మసీదులు నిర్మించడానికి, చెరువులను తవ్వించడానికి అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలంలో 70,000 మంది పనివారిని నియోగించినట్టు బరాని తన రాతల్లో పేర్కొన్నాడు. ఇక ఫిరోజ్ షా కాలంలో అంతకన్నా ఎక్కువ స్థాయిలో నిర్మాణాలు జరిగాయి. ఢిల్లీలో పెద్ద పెద్ద భవనాలతోబాటు వ్యాపారులు, ఉన్నతస్థాయి అధికారులు ఇతర సంపన్నులు రెండంతస్థుల భవనాలను ఎక్కువగా నిర్మించుకున్నారు. వాటన్నింటికీ చాలా పెద్ద ఎత్తును ఇటుకలు వాడారు. (చూ. ఢిల్లీ లోని హౌజ్ ఖాస్ భవనం)

ఇంత భారీ స్థాయిలో నిర్మాణాలకు అవసరమైన పెట్టుబడులను గ్రామాల నుండి రకరకాల పన్నుల రూపంలో వసూలు చేశారు. దానితోబాటు సాంకేతికంగా విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టారు. రాతి స్తంభాలపైన రాతి పలకలను ఉంచి పై కప్పులను నిర్మించే పద్ధతి స్థానంలో గుమ్మటాల, ధనుస్సు ఆకృతిలో పైకప్పులు ఉండే విధంగా, నేల మాళిగలు ఉండేలా కొత్త పద్ధతులు వచ్చాయి. సున్నపు రాయిని, జిప్సంను కలిపి గానుగ ఆడించి తయారుచేసే చెక్క సున్నం వాడకం వల్లనే ఈ మార్పు సాధ్యపడింది. ఆ చెక్క సున్నంతో ఇటుకలను, కంకరను, రాళ్ళను కలిపి బలంగా నిర్మాణాలు చేసేవారు.

ఈ భవన నిర్మాణ రంగానికి అనుబంధంగా ఇటుకబట్టీలు పెద్ద ఎత్తున విస్తరించాయి. వాటితోబాటు రాళ్ళ క్వారీలు కూడా పెరిగాయి. చలువరాళ్ళు, ఎర్ర ఇసుకరాళ్ళు (రెడ్ శాండ్‌స్టోన్) తవ్వి తీయడం పెరిగింది. రాజస్థాన్‌లోని మక్రానా చలువరాతి క్వారీలు అప్పుడే మొదలయ్యాయి. భవన నిర్మాణ రంగంలో రాళ్ళను కోసేవారు, చెక్కేవారు, రంపపు పనివారు, వడ్రంగులు, కమ్మరులు, చెక్కసున్నపు గానుగల పనివారు, తాపీ పనివారు వంటి వివిధ నైపుణ్యాలు కల పనివారు పుట్టుకొచ్చారు. వారిలో ఎక్కువమంది స్థానికులే. అందుకనే చాలా భవనాల మీద నాగరి, సంస్కృత లిపిలో అక్షరాలు చెక్కివుండడాన్ని మనం చూడవచ్చు.

భవనాల నిర్మాణాలను ప్లాను చేయడం కూడా ఒక శాస్త్రంగా అభివృద్ధి చెందింది. దానికి సంబంధించిన గ్రంధాలు భారతీయ భాషల్లో ఉన్నాయి. అంటే ఈ నిర్మాణ రంగంలో స్థానికులే కాంట్రాక్టర్లుగా, నిర్వాహకులుగా ప్రధానంగా వ్యవహరించారని అనుకోవాలి.

**ఇతర వృత్తులు**

**లోహపు పనులు:** ముడి ఇనుముకు తగరం, తదితర లోహాలను కలిపి చేసిన ఉక్కు తయారీకి భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఆ కాలంలో ప్రసిద్ధి చెందింది. దృఢంగా ఉండే ఇనుప వైర్ల తయారీ నైపుణ్యాన్ని కూడా మనం ఈ కాలంలో నేర్చుకున్నాం. 10 వ శతాబ్దంలో యూరప్‌లో మొదలైన ఈ పరిజ్ఞానం 12వ శతాబ్దాం నాటికి ఇరాన్‌కు, ఆ తర్వాత మన దేశానికి విస్తరించింది. రాగిని తగరం తో (టిన్) కంచుగా మిశ్రమం చేసి దానితో చేసే రకరకాల పాత్రలకు, కంచు గంటల తయారీకి మన దేశం పేరు పొందింది. ఇక వెండి కోసం జరిపిన తవ్వకాలలో వచ్చిన ముడి ఖనిజం నుండి వెండిని తీసే క్రమంలో ఇక్కడ జింక్ (తుత్తునాగం) ను తయారు చేయడం నేర్చుకున్నారు. స్వేదనం (డిస్టిలేషన్) పరిజ్ఞానం మనం చైనా నుంచి తెలుసుకున్నాం. జింక్ ఉత్పత్తి వలన ఇత్తడి వస్తువుల తయారీ బాగా పెరిగింది. రాగితో ఎక్కువ మోతాదులో జింక్‌ను కలిపితే ఇత్తడి తయారౌతుంది. ఇప్పటికీ, దేశంలో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ మనకు కంచు, ఇత్తడి పాత్రలు, గృహోపకరణాలు కనిపిస్తూంటాయి.

**కాగితం తయారీ:** మన దేశంలో రచనలన్నీ చెట్ల బెరళ్ళకు, తాటి ఆకులకు, వస్త్రాలకు పరిమితమై సాగాయి. చైనాలో కాగితం తయారీని కనుగొన్నారు. అది పశ్చిమ చైనా ప్రాంతానికి 4వ శతాబ్దానికి, అక్కడినుంచి మంగోలియా మీదుగా తజకిస్తాన్ ప్రాంతానికి చేరేసరికి 8వ శతాబ్దం పట్టింది. అక్కడినుండి సింధు ప్రాంతానికి 11వ శతాబ్దానికి చేరింది. డిల్లీ ప్రాంతంలో కాగితం తయారీ 14 వ శతాబ్దంలో వచ్చింది. 12వ శతాబ్దం నుంచీ కాగితం మీద రాసిన గ్రంధాలు లభించాయి. కేవలం రాత కోసమే కాక తినుబండారాలను, చిన్న చిన్న పరిమాణాల్లో వస్తువులను పొట్లాలుగా కట్టడానికి చౌకగా లభించే కాగితాన్ని విరివిగా వాడేవారు.

> “ లోహపు పనులు: ముడి ఇనుముకు తగరం, తదితర లోహాలను కలిపి చేసిన ఉక్కు తయారీకి భారతదేశం ప్రపంచవ్యాప్తంగా ఆ కాలంలో ప్రసిద్ధి చెందింది. దృఢంగా ఉండే ఇనుప వైర్ల తయారీ నైపుణ్యాన్ని కూడా మనం ఈ కాలంలో నేర్చుకున్నాం. 10 వ శతాబ్దంలో యూరప్‌లో మొదలైన ఈ పరిజ్ఞానం 12వ శతాబ్దాం నాటికి ఇరాన్‌కు, ఆ తర్వాత మన దేశానికి విస్తరించింది. రాగిని తగరం తో (టిన్) కంచుగా మిశ్రమం చేసి దానితో చేసే రకరకాల పాత్రలకు, కంచు గంటల తయారీకి మన దేశం పేరు పొందింది. ”



ఢిల్లీలోని హౌజ్ ఖాస్ భవనం

**కుమ్మరి వృత్తి:** ప్రజానీకంలో ఎక్కువమంది మట్టి కుండలను, పాత్రలను ప్రధానంగా వాడేవారు. అందుచేత కుమ్మరి వృత్తికి గిరాకీ బాగా ఉండేది. రకరకాల నాణ్యతలు ఉన్న మట్టి పాత్రలను, ఉత్పత్తులను తయారు చేయడం పెరిగింది. ముఖ్యంగా నగిషీలు చెక్కిన మట్టి పాత్రలను, నునుపు దేలిన పెంకులు, బండలు (టైల్స్) వంటి ఉత్పత్తులను తయారు చేయడం పెరిగింది. తొలుత ముస్లింల నివాసాల్లో వీటిని ఎక్కువగా ఉపయోగించేవారు. తర్వాత క్రమంగా వాటి వాడకం విస్తరించింది.


**ఖనిజాల తవ్వకం:** రాతి ఉప్పు తవ్వకం వాయవ్య పంజాబ్, రాజస్థాన్ ప్రాంతాల్లో ఎక్కువగా జరిగేది. భవనాల నిర్మాణానికి కావలసిన కంకరను కూడా ఎక్కువగా తవ్వితీసేవారు. జింక్ తయారీకి రాజస్థాన్ లోని జవార్ గనుల వద్ద తవ్వకాలు ఎక్కువగా జరిగేవి. ఆంధ్ర ప్రాంతంలో రాయలసీమలో కర్నాటకలో వజ్రాల కోసం తవ్వకాలు జరిగేవి. తమిళనాడు తీరంలో ముత్యాల చిప్పల వేట సాగేది.

**రవాణా**

ప్రయాణాలకు ఎడ్లబళ్ళు, గుర్రాలు, ఒంటెలను ఉపయోగించేవారు. ఐతే ఇవి తక్కువ దూరాలకు మాత్రమే ఉపయోగపడేవి. ఎక్కువ దూరాలకు పోవాలంటే బళ్ళు మారవలసివచ్చేది. షేక్ నసీరుద్దీన్ తన జ్ఞాపకాల్లో రాసుకున్నది చూస్తే అయోధ్య నుంచి డిల్లీ కి ఒంటెపై రావడానికి అతడికి 40 దినాలు పట్టిందట. వేగంగా ప్రయాణించడానికి గుర్రం ప్రధాన సాధనంగా ఉండేది.

**“ విదేశీ వాణిజ్యం చూస్తే ప్రధానంగా మూడు ప్రాంతాలతో అంటే, మధ్య ఆసియా నుండి మంగోలియా వరకూ ఉన్నప్రాంతం తో, అరబ్ ప్రాంతంతో, చైనాతో ఎక్కువగా సాగేది. ఈ వ్యాపారా లకు ప్రధాన కూడలిగా ముల్తాన్ పట్టణం ఉండేది. భారతదేశం నుండి వస్త్రాలను, బానిసలను ఎక్కువగా బైటకు తీసుకుపోయే వారు. అక్కడినుండి గుర్రాలను, పట్టు వస్త్రాలను ఎక్కువగా దిగుమతి చేసుకునేవారు. గుజరాత్ నుండి వాణిజ్యం ప్రధానంగా సముద్ర మార్గాన సాగేది. ఇరాన్ లోని హెూర్ముజ్‌కు ఎక్కువ రవాణా జరిగేది. ”**

ఇక సరుకుల రవాణాకు ప్రధానమైనది ఎడ్లబళ్ళు. ముఖ్యంగా ధాన్యాన్ని రవాణా చేసే వారిని నాయక్‌లు అనేవారు. వీళు ్ళ ప్రధానంగా బంజారాలు. ఒక్కో ఎద్దు మీద దాదాపు 100 కిలోల బరువు ఉండే బస్తాలను రవాణా చేసే వారు. ఎక్కువ విలువ ఉండే సరుకులను ఎడ్లబళ్ళమీద రవాణా చేసేవారు. ఐతే రవాణాకు దోహదం చేసే రహదారుల నిర్మాణం మాత్రం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జరిగింది. డిల్లీ-దౌలతాబాద్ మధ్య, మలబార్ తీరంలో రోడ్లు కొంత శ్రద్ధతో నిర్మించ బడ్డాయి. మార్గమధ్యంలో వాగులు, నదులు ఉన్నచోట వంతెనల నిర్మాణం జరిగింది చాలా తక్కువ. పడవల మీద వాటిని దాటే వారు.




దారిదోపిడీలకు పాల్పడే థగ్గులు నిరంతర సమస్యగా ఉండేవారు. అడవిమృగాల బెడద కూడా యాత్రికులను వేధించేది. ఇక రోడ్డు మార్గం ద్వారా సమాచారం చేరవేత జరిగేది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఇలా చేరవేయడానికి ప్రతీ కిలోమీటర్‌కు ఒక మనిషి ఉండేవాడు. కొందరు గుర్రాల మీద చేరవేయడానికి ప్రతీ 10-12 కిలో మీటర్లకు ఒకరు చొప్పున ఉండేవాళ్ళు. సింధ్ నుండి డిల్లీకి ప్రయాణానికి సుమారు 50 రోజుల పట్టే ఆ రోజుల్లో సమాచారం మాత్రం అయిదారు దినాల్లో చేరిపోయేది. (చూ. 14వ శతాబ్దం నాటికి విస్తరించిన డిల్లీ సుల్తానుల ఆధిపత్యం-మ్యాప్)

భారత దేశ సముద్ర తీరంలో, అరేబియా సముద్ర తీరంలో తయారయే నౌకలు సాంకేతికపరంగా వెనుకబడివుండేవి. చైనా నౌకలు పెద్దవిగా, నాలుగైదు అంతస్తులతో ఉండేవి. వాటిలో దిక్సూచిని ఉపయోగించే వారు. మన నావికులు దిక్సూచి వాడకాన్ని ఆలస్యంగానే తెలుసుకున్నారు.

**వాణిజ్యం**

దేశీయంగా వర్తకం ప్రధానంగా మూడు స్థాయిల్లో సాగేది. మొదటిది, పట్టణంలో తయారైన సరుకుల అమ్మకం. దుస్తులనుండి ఇనుప సామాన్ల వరకూ రకరకాల ఉత్పత్తులను పట్టణంలోని దుకాణాల్లో అమ్మేవారు. రెండవది, గ్రామాల్లో పండిన పంటలను, తవ్విన ఖనిజాలను పట్టణాలకు తెచ్చి అమ్మడం, పట్టణం నుంచి గ్రామాలకు తిరిగి కొన్ని సరుకులను చేరవేయడం. మూడవది, ఒక పట్టణంలో ప్రత్యేకంగా తయారీలో పేరు పొందిన సరుకులను ఇతర పట్టణాల్లో అమ్మడం. ఈ వ్యాపారాల మీద పన్ను వసూలు చేయడం ఒక ప్రధాన ఆదాయ వనరుగా ఉండడంతో క్రమంగా ఆ పన్నుల భారం పెరిగిపోతూవచ్చింది. పంజాబ్-హర్యానా ప్రాంతం నుండి నాణ్యత కల బియ్యం, చక్కెర, నెయ్యి వంటివి డిల్లీకి ఎక్కువ మోతాదులో వచ్చేవి. ఇక సముద్ర తీరం వెంబడి రవాణా అయే సరుకుల్లో దక్షిణాది నుండి మిరియాలు, నీలిమందు, నల్లమందు వంటివి ఎక్కువగా ఉండేవి.

ఇక విదేశీ వాణిజ్యం చూస్తే ప్రధానంగా మూడు ప్రాంతాలతో అంటే, మధ్య ఆసియా నుండి మంగోలియా వరకూ ఉన్న ప్రాంతంతో, అరబ్ ప్రాంతంతో, చైనాతో ఎక్కువగా సాగేది. ఈ వ్యాపారాలకు ప్రధాన కూడలిగా ముల్తాన్ పట్టణం ఉండేది. భారతదేశం నుండి వస్త్రాలను, బానిసలను ఎక్కువగా బైటకు తీసుకుపోయే వారు. అక్కడినుండి గుర్రాలను, పట్టు వస్త్రాలను ఎక్కువగా దిగుమతి చేసుకునేవారు. ఇక గుజరాత్ నుండి వాణిజ్యం ప్రధానంగా సముద్ర మార్గాన సాగేది. ఇరాన్ లోని హెూర్ముజ్‌కు ఎక్కువ రవాణా జరిగేది. మన దేశం నుండి సుగంధద్రవ్యాలు, విలువైన రంగురాళ్ళు, ముత్యాలు, బంగారుతీగెలతో నేసిన వస్త్రాలు వంటివి ఎక్కువగా ఎగుమతి అయ్యేవి. ఇరాన్ నుండి గుర్రాలను ఎక్కువగా దిగుమతి చేసుకునేవారు. 12వ శతాబ్దం తర్వాత చైనాతో వ్యాపారం పుంజుకుంది. పశ్చిమ దేశాలకు పంపిన సుగంధ ద్రవ్యాలతో పోల్చితే అంతకు వంద రెట్లు ఎక్కువ సరుకును చైనా కొనుగోలు చేసేదని మార్కోపోలో రాశాడు. భారతీయ వ్యాపారులకు చైనాలో కొన్ని కాలనీలు ఉండేవి. అక్కడ శివాలయం నిర్మించినట్టు పేర్కొన్నాడు. చైనా నుండి ఇక్కడికి పింగాణీ, గాజు వస్తువులు ఎక్కువగా వచ్చేవి. ఆగ్నేయ ఆసియా దేశాలనుండి ఏనుగులను కొనుగోలు చేయడం పట్ల ఫిరోజ్ షా ఎక్కువ ఆసక్తి చూపించినట్టు తెలిపాడు.

మొత్తం మీద అంతర్జాతీయ వాణిజ్యాన్ని చూసినపుడు ఇక్కడినుండి ఎక్కువగా సరుకులు పోతే, బైటనుండి ఎక్కువగా బంగారం, వెండి వచ్చేవి. మన దేశం నుండి బైటకు తరలిన బంగారం, వెండి చాలా తక్కువ. అంటే విదేశీ వాణిజ్యంలో మనకు చాలా మిగులు ఉండేదని గ్రహించాలి. ముస్లింల కాలంలో మన దేశ సంపదను కొల్లగొట్టుకు పోయారంటూ ఇప్పుడు హిందూత్వ వాదులు చేస్తున్న ప్రచారం నిరాధారం అని చారిత్రిక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

**(తరువాయి వచ్చే సంచికలో)**

ఈ మాసం ప్రత్యేకం

# బొద్దింకల ప్రజాస్వామ్యం:
## నిరాయుధమైనది ఇంకా ప్రమాదకరమైనది



అరుంధతి రాయ్ ప్రముఖ రచయిత్రి. సామాజిక కార్యకర్త. బుకర్ బహుమతి గ్రహీత.

అరుంధతి రాయ్

అనేక సంవత్సరాల తర్వాత నాకు మొదటిసారిగా, ఒక భారతీయ మహిళగా ఉండటం అద్భుతంగా అనిపిస్తోంది. ఆశలన్నీ అడుగంటిపోయాయనుకున్న తరుణంలో వాళ్ళు వచ్చేశారు. వర్షంలో తేలుతూ వచ్చిన యువ బొద్దింకలు. ఒక న్యాయమూర్తికి, ఒక జోక్‌కి మధ్య జరిగిన అపవిత్ర కలయికకు పుట్టిన సంతానం.

మనందరికీ ఆ కథ తెలుసు, కానీ రికార్డు కోసం ఇక్కడ చెబుతున్నాను. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, కొంతమంది నిరుద్యోగ యువ భారతీయులను బొద్దింకలతో పోలుస్తూ చేసిన అహంకారపూరిత, అవమానకర వ్యాఖ్యకు ప్రతిస్పందనగా, బోస్టన్‌లో నివసిస్తున్న విద్యార్థి అభిజీత్ దీప్కే, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇలా వ్యాఖ్యానించాడు: "బొద్దింకలన్నీ ఏకమైతే ఎలా ఉంటుంది?" లక్షలాది మంది స్పందించారు. అలా బొద్దింకల జనతా పార్టీ పుట్టింది. దీప్కే తన మాటల సంగీతంతో బొద్దింకలను ఆకర్షించాడు. పబ్లిక్ పరీక్షల పేపర్లు తరచూ లీక్ అవుతున్న, అవినీతితో కుళ్ళిపోయిన మంత్రిత్వ శాఖకు అధిపతిగా విర్రవీగుతున్న విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే వారి మొదటి డిమాండ్. ప్రతిపక్ష పార్టీల అంచనాల ప్రకారం, 2014 నుండి ఇప్పటి వరకు సుమారు 152 పేపర్లు లీక్ అయ్యాయి. ఈ పరీక్షల కోసం సంవత్సరాల తరబడి సిద్ధమైన లక్షలాది మంది యువత జీవితాలను ఈ లీకులు నాశనం చేశాయి. వారిలో కొందరి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం, అలాగే ఈ పరీక్షలకు హాజరయ్యే హక్కు కోసం ఫీజు చెల్లించడానికి తమ భూములను లేదా ఇళ్లను అమ్ముకోవలసి వచ్చింది. ఇది ఒక కొత్త రకమైన చట్టబద్ధమైన దోపిడీ. ఇటీవల నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పేపర్ లీక్ అయిన తర్వాత, తీవ్ర మనోవేదనకు గురై, కుంగిపోయిన 12 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

కాక్రోచ్ ఆగ్రహం ఆన్‌లైన్ సునామీగా మారడంతో, దీప్కే జూన్ 6న బోస్టన్ నుండి స్వదేశం వచ్చి, విమానాశ్రయం నుండి నేరుగా ఢిల్లీలోని ప్రసిద్ధ నిరసన ప్రదేశమైన జంతర్ మంతర్‌కు వెళ్లారు. లడఖ్‌కు చెందిన సుప్రసిద్ధ కార్యకర్త, విద్యా సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆయనతో కలిసి నిరవధిక నిరాహార దీక్షను ప్రకటించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (లిబరేషన్) విద్యార్థి విభాగమైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) సభ్యులైన ఆరుగురు విశ్వవిద్యాలయ విద్యార్థులు నేహా బోరా, మనీష్ కుమార్, అమీన్ అమితోష్, డానిష్ అలీ, హృషికేష్, దీపక్ కూడా నిరాహార దీక్ష చేస్తామని ప్రకటించి, పక్కనే ఉన్న వేదికపైకి ఎక్కారు. ఇతర నగరాల్లో కూడా నిరసనలు ప్రారంభమయ్యాయి. నిరాహార దీక్ష చేస్తున్న వారి ఆరోగ్యం క్షీణించడంతో, ఇంటర్‌నెట్‌లో హడావిడి చేసిన ఆ యువ 'బొద్దింకలు' నిజంగానే జంతర్ మంతర్ వద్ద ప్రత్యక్షమయ్యారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న జూలై 20న పార్లమెంటు వైపు ర్యాలీ నిర్వహిస్తామని 'కాక్రోచ్ జనతా పార్టీ' ప్రకటించింది. ఆ ర్యాలీకి రెండు రోజుల ముందు పోలీసులు సోనమ్ వాంగ్‌చుక్‌ను వేదికపై నుండి బలవంతంగా తీసుకెళ్లి నిర్బంధించారు. మొదట ప్రభుత్వ ఆసుపత్రిలో, ఆ తర్వాత ఆయన భార్య పట్టుబట్టడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో ఉంచారు. ఆయన ర్యాలీకి ముందే తన దీక్ష విరమించారు. ర్యాలీ జరగాల్సిన జూలై 20 ఉదయం ఏఐఎస్ఏ విద్యార్థులు దీక్ష విరమించారు.

'బొద్దింకలు' రాజధాని నగరాన్ని ముంచెత్తాయి. వారు రైలు, బస్సు, విమానం ఇంకా మెట్రో మార్గాల్లో తరలివచ్చారు. వారి సంఖ్య గంట గంటకూ పెరుగుతూనే ఉంది. ఢిల్లీ వర్షాకాల ఆకాశంలో సూర్యకిరణాలు ప్రసరించడానికి కొన్ని గంటల ముందే, వేల సంఖ్యలో వారు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవడం మొదలుపెట్టారు. సూర్యోదయ సమయానికి ఒక విషయం స్పష్టమైంది: తమ కళ్ల ముందే తమ భవిష్యత్తు కరిగిపోవడం చూసిన, తీవ్ర ఆవేదన, ఆగ్రహంతో ఉన్న యువతరం, తమ తల్లిదండ్రులు, తాతల తరాలు వదులుకున్న వాటిని తిరిగి సాధించుకోబోతోంది. అవే ఒక ప్రజలుగా, ఒక దేశంగా మనకున్న ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య పౌరులుగా మనకున్న హక్కులు. నిరసనకారులు తమ అపారమైన ధైర్యం, హుందాతనం, హాస్య చతురతతో మనందరికీ సహజ లక్షణంగా మారిపోయిన భయాన్ని పారద్రోలారు. ఆ రోజు ముగిసే సమయానికి, ఆ నిరసన కేవలం నిరసనకారులు లేదా వారి నాయకులు డిమాండ్ చేస్తున్న అంశాల కంటే చాలా పెద్ద విషయంగా మారిందని స్పష్టమైంది. ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు చాలా చిన్న విషయం. అంతకంటే పెద్ద సమస్యలు ఉన్నాయి. పై స్థాయి నుండి కింది స్థాయి వరకు మొత్తం పాలనా వ్యవస్థలో ఉన్న కుళ్లు స్పష్టంగా కనిపిస్తోంది. అది కుళ్ళిపోతున్న శవంలా దుర్వాసన కొట్టడం మొదలుపెట్టింది. ఏడు లేదా ఎనిమిది ఏళ్ల వయసున్న అత్యంత చిన్న 'బొద్దింకలు' కూడా ఆ విషయాన్ని స్పష్టంగా చెప్పగలిగాయి.

ర్యాలీకి కొన్ని రోజుల ముందు కొత్త పోలీస్ చీఫ్‌ను అత్యవసరంగా, దాదాపు రహస్యంగా నియమించినప్పటికీ, అలాగే భయానక సామర్థ్యం కలిగిన మన కేంద్ర హోం మంత్రి గురించి ఆందోళనకరమైన గుసగుసలు ఉన్నప్పటికీ, జూలై 20న ఢిల్లీని ముంచెత్తిన ఆ 'సునామీ' స్థాయిని పోలీసులు, హోం మంత్రిత్వ శాఖ పూర్తిగా తప్పుగా అంచనా వేశాయి. వారు అన్ని ప్రయత్నాలు చేశారు. బస్సులు, రోడ్లు, మెట్రో స్టేషన్లను అడ్డుకున్నారు. కానీ అవి ఏవీ పని చేయలేదు. వారు ఇంటర్నెట్‌ను నిలిపివేయడానికి కూడా ప్రయత్నించారు. కానీ,

> “ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి పోలీసులు తమ పసుపు లోహపు బారికేడ్లను వెల్డింగ్ చేసి, తమకు అలవాటైన ఆయుధాలను - రాళ్లతో నిండిన ట్రక్కులు, ముందుగానే ధ్వంసం చేసిన వాహనాలు మొదలైన వాటిని రంగంలోకి దించారు. యువకులు హింసాత్మ కంగా మారారనీ, పోలీసులు ఆత్మ రక్షణలో భాగంగానే అలా చేస్తున్నారనీ నమ్మించాలనేది వారి ఆశ. వారు లాఠీలు, కర్రలతో సాయుధు లైన సాదా దుస్తుల గూండా సైన్యాన్ని రంగంలోకి దించారు.”

ఇంటర్నెట్ సృష్టి అయిన ఆ యువ బొద్దింకలు, ఒకేసారి నవ్వించి, ఏడ్పించే మీమ్స్, వీడియోల వెల్లువతో ఆ ప్రయత్నాన్ని ఏదో విధంగా దెబ్బతీశాయి. ప్రపంచంలోని అన్ని ప్రదేశాల లోకెల్లా ఢిల్లీలో, నిరసనలో పాల్గొన్న యువ తులు తాము గుంపులో సురక్షితంగా ఉన్నామని చెప్పారు. అయినప్పటికీ, కొందరు పోలీసులు తమను అసభ్యంగా తాకారని ఫిర్యాదు చేశారు. ముస్లింలు, హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, ప్రతి కులానికి, వర్గానికి చెందిన ప్రజలు కలిసికట్టుగా రావడం, ఒకరికొకరు సహాయం చేసుకోవడం, పోలీసులను ఎదుర్కొం టూ ఒకరినొకరు రక్షించుకోవడం మేము చూశాము. మాకు ఉపన్యాసాలు ఇవ్వ కుండా, లేదా గొప్ప ప్రసంగాలు చేయకుండా, వారు మా కలలలోని అందమైన, సాధ్యమయ్యే భారత దేశాన్ని మాకు చూపించారు. చేసి చూపించారు.

ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి పోలీసులు తమ పసుపు లోహపు బారికేడ్లను వెల్డింగ్ చేసి, తమకు అలవాటైన ఆయుధాలను – రాళ్లతో నిండిన ట్రక్కులు, ముందుగానే ధ్వంసం చేసిన వాహనాలు మొదలైన వాటిని రంగంలోకి దించారు. యువకులు హింసాత్మ కంగా మారారనీ, పోలీసులు ఆత్మరక్షణలో భాగంగానే అలా చేస్తున్నారనీ నమ్మించాలనేది వారి ఆశ. వారు లాఠీలు, కర్రలతో సాయుధు లైన సాదా దుస్తుల గూండా సైన్యాన్ని రంగంలోకి దించారు. చర్యకు సిద్ధం కావడానికి సిద్ధమైన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ తమ యూనిఫారాల నుండి నేమ్–ట్యాగ్‌లను తొలగించారు. నమ్మకమైన ప్రధాన టీవీ ఛానెళ్లు అబద్ధాలను ప్రసారం చేయడానికి సిద్ధంగా వరుసలో నిలబడ్డాయి. (కొన్ని ఛానెళ్లు తొందరపడి, ఇంకా జరగని విషయాలను ప్రసారం చేయడం ప్రారంభించాయి. భారతదేశంలో వార్తలు వర్తమానం గురించి కాకుండా భవిష్యత్తు గురించే ఉంటాయి.) ఏదీ ఫలించలేదు.

పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ తమ లాఠీలను విచ్చలవిడిగా తిప్పారు, పిల్లల తలలు పగలగొట్టారు, అవయవాలను విరగ్గొ ట్టారు. వారు బాష్పవాయువును ప్రయో గించారు. కానీ యువకులు ముందుకు సాగుతూనే ఉన్నారు. నేరుగా పార్లమెంటు వైపు. తాము వెళ్తామని చెప్పిన చోటికే నేరుగా. వారు సమీపిస్తుండగా, భద్రతా దళాలు నిరాయుధు లైన విద్యార్థులపై తమ ఎకె47లను గురిపెట్టి మోహరించారు. అయినప్పటికీ, ఆ బొద్దింకలు కవాతు కొనసాగించాయి. వారు కవాతు చేస్తూ, ప్రభుత్వపు ఉక్కు పిడికిలిని కప్పి ఉంచే మృదువైన తొడుగు ఆనవాళ్లను తొలగించి, ప్రస్తుత పాలన నిజ స్వరూపాన్ని, అది ఎప్పటి నుంచో ఉన్న తీరును బట్టబయలు చేశారు. అదొక ఫాసిస్టు ఉక్కు పిడికిలి. తాము పరిపాలి స్తున్న దేశ చరిత్రను, వైవిధ్యాన్ని అర్థం చేసుకోలేని మృగాల కూటమి. ద్వేషించడం మాత్రమే తెలిసిన, కానీ ప్రేమించడం ఎలాగో తెలియని ప్రజలు. లేదా ఆలోచించడం ఎలాగో కూడా తెలియని వారు.

### ప్రకటన

కవాతుదారులు సమీపిస్తుండగా, మన ధైర్యవంతుడైన, గొప్పలు చెప్పుకునే ప్రధాన మంత్రిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రతిరోజూ రాజ్యాంగాన్ని బలహీనపరచడమే ఏకైక ఉద్దేశ్యంగా కనిపించే, తళతళలాడుతున్న కొత్త సంవిధాన సంసద్ భవనం నుండి పార్లమెంట్ సభ్యులను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

సాయంత్రానికల్లా నిరసన స్థలంలోని ప్రధాన వేదికను పోలీసులు ధ్వంసం చేశారు. రాత్రికి ప్రజలు దానిని తిరిగి స్వాధీనం చేసు కున్నారు. పోలీసులు రాత్రికి వెళ్ళిపోతుం డగా, ఆ బొద్దింకలు వారికి నిలబడి చప్పట్లు కొట్టారు. పిల్లలను కొట్టినందుకు. వాహ్ మోదీ జీ! వాహ్!

దీని నుండి పెద్ద రాజకీయ మార్పు వస్తుందని ఆశించడం అవివేకం. కానీ దీనిని కేవలం ఒక ఉద్వేగభరితమైన క్షణంగా కొట్టి పారేయడం మూర్ఖత్వం అవుతుంది. విదేశీ నిధులు, సీఐఏ కుట్రల గురించిన పుకార్లు, పరోక్ష సూచనలు, కుట్ర సిద్ధాంతాలతో వార్తా సంస్థలు, ప్రత్యక్ష ప్రసారాలు చేసే టీవీ ఛానెళ్లు హోరెత్తడంలో ఆశ్చర్యం లేదు. ఒక గర్వించ దగ్గ ‘ఆందోళన్ జీవి’గా (నా లాంటి వారిని ఉద్దేశించి మోదీ వాడిన ఎగతాళి పదం ఇది) చెబుతున్నాను, ఇదంతా మొదలైనప్పుడు నాకూ కొంత సందేహం కలిగింది. మనం మరో ‘అన్నా హజారే’ ఘట్టం వైపు వెళు తున్నామేమోనని భయపడ్డాను. 2011 నాటి ఆ అవినీతి వ్యతిరేక ప్రజా ఉద్యమం, ప్రారంభ ఉద్దేశాలు ఏవైనప్ప టికీ, చివరికి మనకు ఒక రాజకీయ పార్టీ పాలనను మూడు పర్యాయాలు కట్టబెట్టింది. ఆ పార్టీ దేశంలోని ప్రతి వ్యవస్థను ధ్వంసం చేసింది, రాజకీయ పార్టీకి, భారత ప్రభుత్వానికి మధ్య ఎటువంటి తేడా లేదని భావిస్తుంది. దేశాన్ని గానీ పౌరులను గానీ గౌరవించదు. అంతర్జాతీయంగా మనల్ని అవమానపాలు చేసి భారతదేశాన్ని మోకాళ్లపై నిలబెట్టింది.


కానీ ‘కాక్రోచ్ జనతా పార్టీ’ పట్ల ప్రధాన స్రవంతి మీడియా ప్రదర్శించిన వ్యతిరేకతను చూసినప్పుడు నా అనుమానాలు పటాపంచ లయ్యాయి. నాకు అది మొదటి, అత్యంత భరోసా ఇచ్చే సంకేతం. అభిజీత్ దిప్కే దళిత వర్గానికి చెందినవాడు కావడం నాకు సంతోషాన్నిచ్చింది. అంతకంటే ముఖ్యంగా ఎవరూ ఆ విషయాన్ని ప్రధానంగా పరిగణించక పోవడం నాకు మరింత ఆనందాన్ని కలిగించింది. “నా పేరు ఖలీద్ అయి ఉంటే, లేదా నేను ముస్లిం అయి ఉంటే, ఇప్పటికి జైలులో ఉండేవాడిని” అని అతను అనడం విన్నప్పుడు నా దృక్పథం పూర్తిగా మారింది. భారతదేశంలో పరిస్థితులు వాస్తవానికి ఎంత నీచంగా పనిచేస్తాయో ఎత్తిచూపే ధైర్యం అతనికి ఉంది. అంటే మన దేశంలో ప్రతిదీ (ముఖ్యంగా చట్టం) అందరికీ సమానంగా వర్తించదు. అంతా మీ మతం, కులం, వర్గం, జాతి, లింగంపైనే ఆధారపడి ఉంటుంది. అది చాలా లోతైన పరిశీలన, కానీ చాలా సరళంగా చెప్పబడింది. “హిందువుల నుండి వ్యతిరేక స్పందన” వస్తుందనే భయంతో ప్రతిపక్ష రాజకీయ నాయకులు కూడా “ముస్లిం” అని అనడానికి బదులుగా “మైనారిటీ వర్గం” అని మాత్రమే అంటున్న తరుణంలో, అతను బహిరంగంగా అలా మాట్లాడటం నన్ను వెంటనే జంతర్ మంతర్ వైపు వెళ్లేలా చేసింది.

దిప్కే "ఖలీద్" అనే పేరును ఎంచుకున్నప్పుడు, అతను ఉమర్ ఖలీద్ గురించి మాట్లాడుతున్నాడని కూడా నాకు అర్థమైంది. షర్జీల్ ఇమామ్ ఇంకా అనేకమందితో పాటు దాదాపు ఆరేళ్లుగా విచారణ లేకుండా జైలులో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ – జెఎన్‌యు స్కాలర్ ఉమర్ ఖలీద్. ఉమర్ చేసిన నేరం ఏమిటి? పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2020లో జరిగిన నిరసనల సమయంలో శాంతియుతంగా ఉండాలని నిరసనకారులను కోరడం. అప్పుడు ఢిల్లీలో ఆర్ఎస్ఎస్ పరివార్ అల్లరి మూకలు అల్లర్లు, హత్యలు, మసీదుల దహనాలకు పాల్పడుతుంటే, పోలీసులు చూస్తూ ఊరుకోవడమే కాకుండా అప్పుడప్పుడు వాటిలో పాల్గొనడం కూడా జరిగింది. ఏది సరైనదో చూసే ధైర్యాన్ని గానీ, కనీసం అర్థం చేసుకునే ధైర్యాన్ని గానీ కోల్పోయినట్లుగా కనిపిస్తున్న న్యాయమూర్తులు, బెయిల్ కోసం చేసిన అప్పీళ్లన్నీ తిరస్కరిస్తూనే ఉన్నారు.

బొద్దింకలు కవాతు చేస్తూ, వాటి సంఖ్య పెరిగిపోతున్న కొద్దీ, నాలో నేను ఇలా అనుకున్నాను. అదృష్టవశాత్తూ వారిలో ఎక్కువమంది ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు లేదా ఆదివాసులు కాదు. లేకపోయి ఉంటే, వారిని అణచివేసి, చంపి, కాల్చి, జైల్లో పెట్టేవారు. దేవుడి దయవల్ల వారు కాశ్మీరీలు కాదు. లేకపోయి ఉంటే, వారు కళ్ళు కోల్పోయేవారు (కొంతమందికి పెల్లెట్ల వంటి గాయాలైనప్పటికీ). అదృష్టవశాత్తూ వారిలో ఎక్కువమంది హిందువులు. భారతదేశంలో ఈ క్షణం అంత విచారకరమైనది. అయితే, పరిస్థితులు ఒక్క నిమిషంలో మారిపోవచ్చు. మనం 'అభివృద్ధి చెందుతున్న పరిస్థితి' అని పిలవబడే దానిలో ఉన్నాము. ఇతర రాష్ట్రాల నుండి వేలాది పారామిలిటరీ దళాలను విమానాల్లో తరలిస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. రాబోయే రోజులు ఏమి తెస్తాయో మనకు తెలియదు.

ఇదంతా మనల్ని ఎక్కడికి తీసుకువెళుతుంది? వందలాది ఉన్మాదపూరిత, కార్పొరేట్ యాజమాన్యంలోని టీవీ ఛానెళ్లలో వారాల తరబడి ఉన్మాదభరితంగా, నిరంతరాయంగా 24X7 ప్రసారాలు పొందిన అన్నా హజారే ఉద్యమంలా కాకుండా, ఈ బొద్దింకల జనతా పార్టీ తనపై తాను లేక ఇంటర్నెట్‌పై మాత్రమే ఆధారపడాల్సి ఉంది. టీవీల ద్వారా రేగిన హజారే ఉన్మాదాన్ని ఎన్నికల పరంగా సొమ్ము చేసుకోవడానికి మోడీ నేతృత్వంలోని బీజేపీ పూర్తిగా సిద్ధమై, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చేతిలోకి చిక్కి, ఆ ఉద్యమాన్ని స్వాధీనం

> "బొద్దింకలు కవాతు చేస్తూ, వాటి సంఖ్య పెరిగిపోతున్న కొద్దీ, నాలో నేను ఇలా అనుకు న్నాను. అదృష్టవశాత్తూ వారిలో ఎక్కువమంది ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు లేదా ఆదివాసులు కాదు. లేకపోయి ఉంటే, వారిని అణచివేసి, చంపి, కాల్చి, జైల్లో పెట్టేవారు. దేవుడి దయవల్ల వారు కాశ్మీరీలు కాదు. లేకపోయి ఉంటే, వారు కళ్ళు కోల్పోయేవారు (కొంతమందికి పెల్లెట్ల వంటి గాయాలైనప్పటికీ). అదృష్టవశాత్తూ వారిలో ఎక్కువమంది హిందువులు."



చేసుకున్న దానికి భిన్నంగా, ఈ బొద్దింకల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా, తెరవెనుక వ్యవస్థీకృత ప్రతిపక్ష పార్టీలు ఏవీ లేవు. అయినప్పటికీ బొందింకల జనతా పార్టీ విజయం సాధించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సాధించింది.

ప్రస్తుతం భారతదేశం అంతటా జరుగుతున్న అనేక నిరసనలలో ఈ బొద్దింకల ఉద్యమం ఒకటి. మధ్యప్రదేశ్‌లోని ఆదివాసులు కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని గ్రామస్థులు పెద్ద ఎత్తున చెట్లను నరికివేయడానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. గ్రేటర్ నికోబార్ దీవుల పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన తెలుపుతున్నారు. మణిపూర్ అట్టుడుకుతోంది. ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయి. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆగ్రహం పెరిగిపోతోంది. ఇక బీజేపీ–ఆర్ఎస్ఎస్‌ల 'దేవుడి' ఆట మొదటినుంచీ ఉన్నట్టుగా బట్టబయలవుతోంది. అదొక బూటకం. గ్యాంగ్‌స్టర్లు నడిపిస్తున్న ఒక బంగారు వేట. అయోధ్యలోని రామ మందిరం దోపిడీ మన కళ్ల ముందే ఒక చెత్త బాలీవుడ్ కథను ఆవిష్కరిస్తోంది. ఆకర్షణీయమైన దైవపురుషులు, అవినీతి రాజకీయ నాయకులు హోటళ్లు కడుతూ, స్థిరాస్తులను పోగుచేసుకుంటూ, విహంగాల లాంటి కార్లలో విహరిస్తూ, అమాయకులైన పేదల విశ్వాసంతో బలిసిపోతున్నారు. అవినీతి, పగటి దోపిడీల విషపు కోరలు అగ్రస్థాయి వరకు పాకుతున్నాయి.

ఈ గొయ్యి నుండి బొద్దింకల శక్తి మనల్ని బయటకు లాగగలదా? అంత సులభం కాదు. భారతదేశంలోని ప్రజా ఉద్యమాల ఫలితాలను ఒకసారి చూస్తే, అది ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు. అది క్షీణిస్తున్న ఆశయాలు, భగ్నమైన కలల సంక్షిప్త చరిత్ర. అరవై, డెబ్బైలలో నక్సలైట్ల సాయుధ తిరుగుబాటుతో సహా వివిధ ఉద్యమాలు, సంపదను, భూమిని రైతుకే పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేశాయి. వాటిని అణచివేశారు. ఎనభై, తొంభైవ దశకాలలో, సామాజిక ఉద్యమాలు – వాటిలో అత్యంత ప్రసిద్ధి చెందినది నర్మదా బచావో ఆందోళన, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్,

> “ మన భయాందోళనలు, వేదనలు ఈ బొద్దింకల తిరుగుబాటుపై మితిమీరిన ఆశలు పెట్టుకునేలా మనల్ని పురికొల్పవచ్చు. కొందరు ఇప్పటికే దీనిని బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలలో ప్రభుత్వ మార్పులకు దారితీసిన యువజన తిరుగుబాట్లతో పోల్చారు. కానీ భారతదేశం అంత విశాలమైన దేశం కాబట్టి అక్కడ అలా జరగడం సాధ్యం కాదు. మరికొందరు దీనిని జయప్రకాష్ నారాయణ్ ఉద్యమంతో పోలుస్తున్నారు. ఈ పోలికలు ఏమాత్రం ఉపయోగ పడవు. అది దానికదే ఒక ప్రత్యేకమైన విషయం. ”

జార్ఖండ్‌లలో మావోయిస్టులు – రైతులు మరియు ఆదివాసీ గిరిజనులను వారి భూముల నుండి వెళ్లగొట్టడానికి వ్యతిరేకంగా పోరాడాయి. మరో మాటలో చెప్పాలంటే, పేదల వద్ద ఇంకా ఉన్నవాటిని లాక్కోకుండా ఉండేందుకు వారు వాటిని డిమాండ్ చేశారు. వారిని కూడా అణచివేశారు. 2000వ దశకం వచ్చేసరికి, వారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కృతజ్ఞతలు చెప్పుకునే స్థాయికి దిగజారారు. కనీస వేతనాలతో మూడు నెలల ఉపాధి పొందే హక్కు వల్ల వచ్చే మొత్తం ఒక నగరంలోని ఖరీదైన రెస్టారెంట్‌లో ఒక మంచి భోజనం ధరతో సమానం. ఈ ప్రభుత్వం దానిని కూడా పక్కనపెట్టి, దాని స్థానంలో కనీస జీవన ప్రమాణాలతో కూడిన రేషన్లను ప్రవేశపెట్టింది. కృతజ్ఞత. ఓట్ల కోసం కదులుతున్న కార్ల నుండి బిచ్చగాళ్లకు భిక్ష విసిరినట్లుగా, మోడీ ముఖ చిత్రం ఉన్న సరుకుల సంచులను ప్రజలపై ధిక్కారంగా విసిరేస్తోంది. ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతున్న కొద్దీ, ఇది కూడా ప్రమాదంలో పడింది.

ఈ రోజు, 2026లో, మనం మన ఓటు హక్కు, పౌరసత్వం కోసం పోరాడాల్సిన స్థితికి దిగజారాము. పౌరసత్వ సవరణ చట్టం, దానితో ముడిపడి ఉన్న జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సి) అనేవి, 1935లో నాజీ జర్మనీ ప్రవేశపెట్టిన న్యూరెంబర్గ్ చట్టాల హిందూ రాష్ట్ర రూపం మాత్రమే. ఆ చట్టాల ప్రకారం, జర్మన్ పౌరులకు వారి “వారసత్వ పత్రాల” ఆధారంగా థర్డ్ రీచ్ (జర్మన్ ప్రభుత్వం) పౌరసత్వాన్ని మంజూరు చేసింది. (భారతదేశంలో ఈ పత్రాలు ఎంతమంది దగ్గర ఉన్నాయి?) భారీ నిరసనలు నిరసనకారుల హత్యలకు, కార్యకర్తల జైలుపాలకు దారితీయడంతో, సిఎఎ–ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమం సద్దుమణిగింది. కానీ ఆ నిరసనల కారణంగానే ప్రభుత్వం ఆ కొత్త చట్టాల అమలును నెమ్మదింపజేసింది. కానీ ఇప్పుడు, ప్రధానంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకుందని చాలామంది సరిగ్గానే భావించిన సర్ (ప్రత్యేక తీవ్ర సవరణ) ముసుగులో తిరిగి వచ్చింది. మన పాస్‌పోర్ట్‌లు కూడా పౌరసత్వానికి రుజువు కాదని మనకు తేలికగా తెలియజేశారు. లక్షలాది మందిని ఓటర్ల జాబితాల నుండి తొలగిస్తున్నారు. దేశ మంతా ‘వారసత్వ పత్రాల’ కోసం తీవ్రంగా వెతుకుతోంది. మన పరిస్థితి ఏమిటో మనకు తెలియడం లేదు. మనం చట్టబద్ధమైన వాళ్ళ మా? చట్టవిరుద్ధమైన వాళ్ళమా? మనకు హక్కు లు ఉన్నాయా? ‘అనుమానాస్పద పౌరుల’ కోసం నిర్మిస్తున్న ఆ భారీ నిర్బంధ కేంద్రాలలో మనలో ఎవరికి చోటు ఉంది? మనం మన రోజులను ఒక ట్రిబ్యునల్ నుండి మరొక ట్రిబ్యునల్‌కు పరుగెడుతూ గడుపుతామా? ఫాసిస్టులకు గంద రగోళం, అయోమయం అంటే చాలా ఇష్టం.

మన భయాందోళనలు, వేదనలు ఈ బొద్దింకల తిరుగుబాటుపై మితిమీరిన ఆశలు పెట్టుకునేలా మనల్ని పురికొల్పవచ్చు. కొందరు ఇప్పటికే దీనిని బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలలో ప్రభుత్వ మార్పులకు దారితీసిన యువజన తిరుగుబాట్లతో పోల్చారు. కానీ భారతదేశం అంత విశాలమైన దేశం కాబట్టి అక్కడ అలా జరగడం సాధ్యం కాదు. మరికొందరు దీనిని 1977లో ఇందిరా గాంధీని గద్దె దించిన జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ఉద్యమంతో పోలుస్తున్నారు. ఈ పోలికలు ఏమాత్రం ఉపయోగపడవు. ఈ బొద్దింకల జనతా పార్టీ ఆ రెండింటిలో ఏదీ కాదు. అది దానికదే ఒక ప్రత్యేకమైన విషయం. ఆయా కాలాల యొక్క ఒక విశిష్టమైన ఉత్పత్తి. అది, తనను వ్యతిరేకించే వారి పట్ల కనికరం చూపని ఒక క్రూరమైన, కక్షపూరిత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బలహీన యువత. ప్రతీకారానికి ఖచ్చితంగా ప్రణాళికలు వేస్తున్నా రు. ప్రధాన వ్యక్తులుగా భావించే వారిపై ప్రతీకారం తీర్చుకోబడుతుంది.

స్పష్టంగా తీవ్ర ప్రజాదరణ కోల్పోతున్న ఒక ప్రభుత్వానికి, తమకు ఓటు వేసిన ప్రజలకు ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా ఉండే ధైర్యం ఎలా వచ్చింది? బహుశా ఎన్నికల వ్యవహారాన్ని విజయవంతంగా తమ వశం చేసుకున్నామని అది భావిస్తోంది కాబోలు. అది యంత్రాంగాన్ని తన ఆధీనంలోకి తీసుకుంది. ఎన్నికల సంఘం కూర్పులోనే లోపాలు ఉన్నాయి. అది ఇకపై నిష్పక్షపాతంగా ఉంటుందని నమ్మలేము. ఈవీఎంలను తారుమారు చేశారు, ఓటర్ల జాబితాల నుండి ఇప్పుడు లక్షలాది మంది నిజమైన ప్రజలను మినహాయించి, లక్షలాది దొంగ పేర్లను చేర్చారు. ఎన్నికలను పర్యవేక్షించే అధికార యంత్రాంగం కూడా ఇందులో పూర్తిగా భాగస్వాములని తేలిపోయింది, ఘోరమైన అవకతవకలను ఆలస్యం చేయడానికి లేదా చూసీచూడనట్లు వదిలేయడానికి న్యాయస్థానాలపై ఆధారపడవచ్చు. నిష్పక్షపాతమంటే ఏమిటో పోలీసులకు తెలియదు. అధికారంలో ఉన్నవారు తటస్థంగా ఉంటామని వేలు క్లిక్ చేసినప్పుడల్లా పత్రికలు మోకరిల్లుతాయి. ఎల్లప్పుడూ బీజేపీకి అనుకూలంగా ఉండేలా నియోజకవర్గాల మ్యాపింగ్‌ను మార్చబోతున్నారు. అధికార పార్టీకి భయపడటానికి ఏముంది? అది ఎవరి మాటైనా ఎందు కు వినాలి? అది ప్రపంచంలోనే అత్యంత ధనిక పారిశ్రామికవేత్తల మద్దతు ఉన్న, భూమిపైనే అత్యంత ధనిక రాజకీయ పార్టీ. అది దేన్నైనా కొనగలదు. ఎవరినైనా కొనగలదు. లేదా అది అలా నమ్ముతుంది.

కానీ ఈ ఆట ఎప్పటికీ కొనసాగు తుందా? ప్రజలందరినీ ఎల్లప్పుడూ మోసం చేయగలరా? నూటా యాభై కోట్ల జనాభా ఉన్న దేశాన్ని ఎప్పటికీ శవంలా ఈడ్చుకెళ్లగలరా? ఈడ్చుకెళ్లలేరు. బొద్దింకలు బయటకు వచ్చాయి. రైతులు మరోసారి ఢిల్లీకి పాదయాత్ర మొదలుపెట్టారు. ఈసారి భారత–అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. ఆ ఒప్పందం అనేది, భారత ప్రభుత్వం వారి తరపున బానిసలా అంగీకరించి సంతకం చేసిన ఒక మరణ శాసనం. రైతులకు నగర సరిహద్దులను మూసివేశారు. కానీ అది వారిని ఆపలేకపోవచ్చు. బహుశా, కాస్తంత ప్రమాదకరంగా ఎలా మారాలనే విషయంలో మనం మన రైతుల నుండి, అలాగే బొద్దింకల నుండి పాఠాలు నేర్చుకోవచ్చు. యువత మనకు ఒక గొప్ప కానుకను అందించారు; వారు చేసిన కృషికి సార్థకత చేకూర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

ఒక ప్రధాన మంత్రి భౌతికంగా పారిపోయిన తర్వాత, రాజకీయంగా కూడా పారిపోవాల్సిన పరిస్థితి రావడానికి ఎంతో సమయం పట్టదు. *

**సోషలిస్టు విజయం**

# 105 ఏళ్ల చైనా కమ్యూనిస్టు పార్టీ: విప్లవం, సోషలిస్టు నిర్మాణంలో శతాబ్దపు అనుభవం




విజయ ప్రసాద్, శిరన్ ఇల్లనపెరుమ

గత నెల (2026 జులై) 1వ తేదీన చైనా కమ్యూనిస్టు పార్టీ 105 వార్షికోత్సవాన్ని జరుపుకుంది. శతాబ్దం దాటిన ఈ కాలంలో చైనా పార్టీ సాధించిన విజయాలపట్ల ఉత్సవాలు జరుపుకోవడమే కాదు, జాగ్రత్తగా అధ్యయనం చేయాలి కూడా. ఆధునిక చరిత్రలో కొద్ది సంస్థలు మాత్రమే చైనా కమ్యూనిస్టు పార్టీ లాగా ఒకవైపు అంతర్జాతీయ బలాబలాల్లో గణనీయమైన మార్పులు తెస్తూ మరోవైపు తన దేశ భవిష్యత్తును సమున్నతంగా తీర్చిదిద్ద గలిగాయి. చైనాను సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండీ, ఫ్యూడల్ దోపిడీ నుండీ, సామాజిక విచ్ఛిన్నత నుండీ విముక్తి చేయాలన్న దృఢ సంకల్పం కలిగిన కొద్ది మంది మార్క్సిస్టు బృందంతో 1921లో ఏర్పడిన చైనా కమ్యూనిస్టు పార్టీ నేడు ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్‌గా పనిచేస్తున్న దేశానికి నాయకత్వం వహిస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థకు నాయకత్వం వహిస్తోంది. అంతేకాదు చైనా నేడు ప్రపంచంలోనే అతి దీర్ఘకాలం మనుగడ సాగించిన సోషలిస్టు వ్యవస్థగా నిలబడింది. ఇటువంటి విజయం ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా లభించదు. ఇదంతా విప్లవం ద్వారా, త్యాగాల ద్వారా, అనేక ప్రయోగాలు, ఆత్మ–విమర్శల ద్వారా అన్నిటికీమించి చారిత్రక గమ్యాన్ని విడనాడకుండా వ్యూహాత్మక మార్పులు చేసుకోగల అసాధారణ సామర్థ్యాన్ని ప్రదర్శించడం ద్వారా లభించిన విజయం.

చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర మనకు ఒకదానితో మరొకటి సంబంధంలేని విధాన మార్పులుగా చూస్తే అర్థం కాదు.దాన్ని ప్రతి తరం పాత తరం నుండి సంక్రమించిన కొత్త వైరుధ్యాలను ఎదుర్కొంటూ సాగిన ఒక నిరంతరాయమైన విప్లవ క్రమంలో భాగంగా చూడాలి. చైనాను శతాబ్దాలపాటు పీడనకూ, అవమానాలకూ గురిచేసిన పాత సామాజిక వ్యవస్థను నాశనం చేయడం దాని మొదటి లక్ష్యం కాగా, సోషలిస్టు వ్యవస్థకు కావలసిన ఉత్పత్తి సామర్థ్యాలను (ముఖ్యంగా పేద, ప్రధానంగా వ్యవసాయ సమాజంలో) నిర్మించడం రెండవ లక్ష్యం. ఇక ఈ ఉత్పత్తి శక్తులను.. కొద్ది మంది ఉన్నత వర్గాలను మరింత ధనికులుగా మార్చడానికి కాకుండా ప్రస్తుతం జరుగుతున్నట్లు ప్రజల "ఉమ్మడి సౌభాగ్యాన్ని" సాధించడానికి ఉపయోగించే క్రమం మూడవ లక్ష్యం. వివిధ రకాలైన ఈ చారిత్రక దశల్లో ఒక విషయం మాత్రం స్థిరంగా కొనసాగుతూ వస్తోంది. అది: కమ్యూనిస్టు పార్టీ యొక్క కేంద్ర, అనివార్యమైన పాత్ర.

### మావో పోరాటం

1949 అక్టోబర్ 1న చైనా ప్రజా రిపబ్లిక్‌ను ప్రకటించినప్పుడు మావో జెడాంగ్ ఒక విషయం స్పష్టం చేశారు. చైనా ప్రజలు నేడు తలెత్తుకు నిలబడ్డారు అని ఆయన అన్నారు. అవి కేవలం అలంకారికమైన మాటలు కావు. అవి ఒక చారిత్రక పరిణామానికి వ్యక్తీకరణలు. చైనా ఒక శతాబ్దానికి మించిన కాలం సామ్రాజ్యవాద పెత్తందారీ జోక్యాన్ని ఎదుర్కొన్నది. అనేక అసమాన ఒప్పందాలు దానిపై రుద్దబడ్డాయి. విదేశాలు దాన్ని ఆక్రమించాయి. వీటికి తోడు కరువు కాటకాలను, యుద్ధ ప్రభువుల దురాగతాలను, అంతర్యుద్ధాలను అది చవిచూసింది. చైనాలోని పెద్ద భాగాన్ని విదేశీ శక్తులు నియంత్రించాయి. దాని ఆర్థిక వ్యవస్థను విదేశీ, స్వదేశీ ప్రభువుల ప్రయోజనాల రక్షణకు అనుగుణంగా వక్రీకరించడం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో విప్లవ విజయం అనేది కేవలం ప్రభుత్వ మార్పుకు మాత్రమే పరిమితం కాలేదు. అది చైనా స్వతంత్ర అభివృద్ధిని నిరోధించిన పాత సామాజిక వ్యవస్థను దాని రాజకీయ, ఆర్థిక, సైద్ధాంతిక పునాదులతో సహా నాశనం చేసింది.

చైనా సమాజాన్ని కిందినుండి పునర్నిర్మించడానికి మావో నాయకత్వంలో పార్టీ నడుం కట్టింది. భూ సంస్కరణలు చేపట్టింది. ఇవి భూస్వామ్య వర్గాల అధికారాన్ని కాలరాసి వ్యవసాయ సంబంధాలను సమూలంగా మార్చేశాయి. పెళ్లి చట్టం మహిళలకు సంపూర్ణమైన హక్కులు ప్రసాదించడంతో చైనా సమాజంలో లోతుగా పాతుకుపోయిన పితృ స్వామిక సంబంధాలు కూకటి వేళ్లతో పెకిలించి

> **"కేవలం రాజకీయ సార్వభౌమత్వం సాధించినంతమాత్రాన చైనా ప్రజల ఆశలు నెరవేరవని 1970 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ గ్రహించింది. పేదరికం, సాంకేతిక వెనుక బాటు, లేక చాలీ చాలని ఉత్పత్తి సామర్థ్యం..వీటి మీద సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదు. అందువల్ల చైనా ఎదుర్కొంటున్న వైరుధ్యం మారిపోయింది. విప్లవానికి సంబంధించిన రాజకీయ పునాదులను సాధించిన తరువాత పార్టీ ఇప్పుడు దీర్ఘకాలం నిలిచే సోషలిస్టు నిర్మాణానికి కావలసిన ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయాల్సి ఉంది."**

వేయబడ్డాయి. అక్షరాశ్యతా ఉద్యమాలు, సామూహిక విద్యా కార్యక్రమాలు, ప్రజారోగ్య కార్యక్రమాలు, గతంలో కనీస సామాజిక సేవలకు కూడా నోచుకోని కోట్లాది మంది సామాన్య ప్రజలకు విద్య, ఆరోగ్యాలను చేరువ చేశాయి. అంతకు ముందు దశాబ్దాల్లో నెలకొని ఉన్న అరాచక ఆర్థిక వ్యవస్థను జాతీయ ప్రణాళికలతో గాడిలో పెట్టడంతోపాటు ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగానికి అగ్రగామి పాత్ర ఇవ్వడం జరిగింది. మావో మరణించే నాటికి చైనా ఒక సమైక్య రాజ్యంగా, పారిశ్రామిక పునాదిగల దేశంగా మారింది. ప్రజాబాహుళ్యం విద్యావంతమైంది. ప్రజారోగ్యం ఎంతగానో మెరుగుపడింది. ఆ విధంగా తరువాతి కాలంలో దేశం పెద్ద పరివర్తన సాగించడానికి కావలసిన భూమిక ఏర్పడింది.

అయితే, ఈ కాలంలో సాధించిన విజయాలను గురించి విశ్లేషించేటప్పుడు జరిగిన తప్పులను విస్మరించకూడదు. రెండు పెద్ద తప్పులు (1958-1962 మధ్య గొప్ప ముందడుగు, 1966-1976 మధ్య సాంస్కృతిక విప్లవం) జరిగాయి. అయితే ఈ తప్పులు ఈ కాలంలో సాధించిన విజయాలను ఏమాత్రం మరుగున పరచేవి కావు. గతం నుండి సంక్రమించిన భూస్వామ్య విధానం, దళారీ పెట్టుబడిదారీ వ్యవస్థ, వలసవాద పరాధీనత, జాతీయ తలవంపు వంటి వాటిని ఈ కాలంలో నిర్మూలించడం జరిగింది. చైనా చరిత్రలో మొదటి సారిగా అభివృద్ధి అనేది సామ్రాజ్యవాద పీడన కింద కాకుండా జాతీయ స్వావలంబన కింద జరిగింది. చైనా చరిత్రను మనం 1949 తో అంతమైన ఒకే ఘటనగా చూడకూడదు. వాస్తవానికి అది సుదీర్ఘమైన విప్లవ క్రమానికి ఆరంభం మాత్రమే. ఈ విప్లవ క్రమం తరువాతి దశాబ్దాల్లో అనేక అనమాన దశల్లో ఆవిష్కృతమైంది. రాజ్యాధికారం చేజిక్కించుకోవడంతో విప్లవం అంతం కాలేదు. దాంతో అది ఒక కొత్త దశలోకి ప్రవేశించింది.

కేవలం రాజకీయ సార్వభౌమత్వం సాధించినంతమాత్రాన చైనా ప్రజల ఆశలు నెరవేరవని 1970 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ గ్రహించింది. పట్టి పీడిస్తున్న పేదరికం, సాంకేతిక వెనుకబాటు, లేక చాలీ చాలని ఉత్పత్తి సామర్థ్యం (అందుకే చైనా గొప్ప ముందడుగు కార్యక్రమంలోకి వెళ్లింది)...వీటి మీద సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదు. అందువల్ల చైనా ఎదుర్కొంటున్న వైరుధ్యం మారిపోయింది. విప్లవానికి సంబంధించిన రాజకీయ పునాదులను సాధించిన తరువాత పార్టీ ఇప్పుడు దీర్ఘకాలం నిలిచే సోషలిస్టు నిర్మాణానికి కావలసిన ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయాల్సి ఉంది.

### డెంగ్ సియావో పింగ్ ఫ్యాక్టరీలు

డెంగ్ సియావోపింగ్ ఈ కొత్త కాలానికి కావలసిన వ్యూహాత్మక దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి అంటే సోషలిజాన్ని వదిలేయడం కాదు, ఉత్పత్తి శక్తులు నిరంతరం అభివృద్ధి చెందకుండా ఉత్పత్తికి సంబంధించిన సామాజిక సంబంధాలు ఎల్లకాలం మనజాలవన్న కఠిన వాస్తవాన్ని మార్క్సిస్టులు గుర్తించడమే అని ఆయన పేర్కొన్నారు. అందువల్ల 1978 నుండి ఆయన పార్టీ నాయకత్వ పాత్రనూ, రాజ్యం యొక్క సోషలిస్టు లక్ష్యాన్ని కాపాడుతూనే ఉత్పత్తి శక్తులను పెద్దఎత్తున పెంచే సంస్కరణలు చేపట్టారు. అభివృద్ధి సాధనాలుగా మార్కెట్లను ప్రవేశపెట్టారు. అయితే అదేసమయంలో అవి రాజకీయ అధికారానికీ, వ్యూహాత్మక ప్రణాళికకూ, ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన రంగాలపై ప్రభుత్వ రంగ అజమాయిషీకి లోబడి ఉండేట్లు చేశారు. నిజానికి సోషలిస్టు రాజ్యం తన వ్యూహాత్మక దిశకు మార్గ దర్శకత్వం వహించే మార్కెట్లను సృష్టించి అందులో పాల్గొన్నది.

దీని ఫలితం చైనానే కాదు ప్రపంచాన్నే మార్చేసింది. తదుపరి దశాబ్దాల్లో చైనా మానవ చరిత్రలోనే బహుశా ఎన్నడూ చూడని అత్యంత శీఘ్రమైన పారిశ్రామికాభివృద్ధిని సాధించింది. కోట్లాది మంది ప్రజలు కటిక పేదరికం నుండి విముక్తి పొందారు. టెలికమ్యూనికేషన్స్, హైస్పీడ్ రైల్, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆధునిక వస్తూత్పత్తి, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో పూర్తిగా కొత్త పరిశ్రమలు ఉద్భవించాయి. శాస్త్ర పరిశోధనలు ఉద్ధృతమైనాయి. ఒకనాడు కొద్దిపాటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు మాత్రమే పరిమితమైన సాంకేతిక సామర్థ్యాలను చైనా అభివృద్ధి చేసుకుంది. ఈనాడు చైనా విధాన నిర్ణేతలు చెబుతున్న "నూతన నాణ్యమైన ఉత్పత్తి శక్తులు" అనేవి మార్కెట్ పోటీ నుండి వాటంతటవే అభివృద్ధి చెందలేదు. విద్య, మౌలిక సదుపాయాలు, సైన్సు వంటి రంగాలపై దశాబ్దాలపాటు పెట్టిన సమన్వయపూరితమైన పెట్టుబడులు, పార్టీ ఆధ్వర్యంలోని పారిశ్రామిక విధానాల మూలంగా ఇవి అభివృద్ధి చెందాయి.

ఈ అనుభవాలు ఇదే కాలంలో ప్రపంచ వ్యాపితంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై రుద్దబడిన నయా-ఉదారవాద మార్గం నుండి చైనాను వేరుచేశాయి. బ్రిట్టన్ వుడ్స్ సంస్థలు అనేక దేశాల్లో ప్రజా ఆస్తులను ప్రయివేటీకరించాలనీ, పారిశ్రామిక విధానాన్ని రద్దు చేయాలనీ, ప్రజాభ్యుదయంలో ప్రభుత్వ జోక్యాన్ని నీరుగార్చాలనీ, ఆర్థిక నిర్ణయాధికారాన్ని ద్రవ్య మార్కెట్లకు వదిలివేయాలనీ ఒత్తిడి చేశాయి. అయితే చైనా మాత్రం భూమి మీద, ద్రవ్య వ్యవస్థ మీద ప్రభుత్వ నియంత్రణ నిలుపుకుంది. వరుస పంచవర్ష ప్రణాళికల ద్వారా దీర్ఘకాలిక ప్రణాళికా విధానాన్ని కొనసాగించింది. వ్యూహాత్మక రంగాల్లో ప్రభుత్వ యాజమాన్యాన్ని విస్తరించింది. సాంకేతికాభివృద్ధిని కార్పొరేట్ లాభాల కోసం కాకుండా జాతీయ స్వావలంబన సమస్యగా చేపట్టింది. అందువల్ల సోషలిస్టు రాజ్యంలో శీఘ్రంగా అభివృద్ధి చెందనున్న ఉత్పత్తి శక్తులు దానికి సంస్థాగతమైన బలాన్ని చేకూర్చాయి.

### సి జిన్‌పింగ్ సోషలిజం

1921లో ప్రారంభమైన విప్లవ క్రమం ప్రస్తుతం సి జిన్‌పింగ్ హయాంలో మరింత అభివృద్ధి చెందింది. మావో రాజకీయ విముక్తి సమస్యకు పరిష్కారం చెప్పారు. డెంగ్ సియావో పింగ్ ఆర్థిక పరివర్తనకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొన్నారు. సి జిన్‌పింగ్ హయాం, ప్రధానంగా నాణ్యత, అభివృద్ధి దిశ, దాని సామాజిక లక్ష్యాలు కేంద్రంగా నడుస్తోంది. చైనాలో శీఘ్ర ఆర్థికాభివృద్ధి కార్పొరేట్ లాభాలు లక్ష్యంగా కాకుండా సామాన్య ప్రజల జీవితాలు మెరుగుపరిచే దిశగా సాగుతున్నదన్న విషయాన్ని

ఆ దేశంలో జరిగిన చారిత్రాత్మక పేదరిక నిర్మూలన కార్యక్రమం వెల్లడించింది. అదే సమయంలో ప్రాంతీయ అసమానతలు నిర్మూలించడం మీద, ప్రజా సేవలను మెరుగు పరచడం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ సమాజాలను పునరుత్తేజపరచడం, పెట్టుబడి సట్టా వ్యాపారం వద్ద పోగుపడకుండా చూడ్డం, చైనా విధాన నిర్ణేతలు చెప్పనట్లు "ఉమ్మడి సౌభాగ్యం" అనే లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోవడం అనే వాటిపై కేంద్రీకరించడం జరిగింది.

ఈ పరిణామం ఒక ముఖ్యమైన సైద్ధాంతిక అవగాహనకు అద్దం పడుతోంది. సోషలిజాన్ని కేవలం ఆర్థికాభివృద్ధి రేట్ల లెక్కన, లేక సాంకేతిక విజయాల లెక్కన మాత్రమే కొలవకూడదు, ఆ అభివృద్ధి ఎంతటి ఘనమైనదైనప్పటికీ. ఉత్పాదకాభివృద్ధి, సామాజిక మేలు లేక "ఉమ్మడి సౌభాగ్యం" అనేది కీలకమైన ప్రశ్న. ఆర్థిక ఆధునీకరణ ప్రజల భౌతిక, సాంస్కృతిక, ప్రజాతంత్ర సామర్థ్యాలను పెంచడంలోనే సోషలిజం ప్రాశస్త్యం ఇమిడి ఉంది. ప్రభుత్వ విద్య, ఆరోగ్య సేవలు, ప్రాథమిక సదుపాయాలు, శాస్త్ర పరిశోధనలు, పర్యావరణ ప్రణాళికలు, సాంస్కృతిక పునరుజ్జీవనం...ఇవన్నీ బలపడ్డం అంటే అంతకు ముందు దశాబ్దాల్లో ఉత్పత్తి పెంపుదలకు జరిగిన కృషి, విస్తారమైన సామాజిక లక్ష్యాలతో సాగిందనే విషయాన్ని తెలియజేస్తుంది.

చైనా సాంకేతికంగా అభివృద్ధి చెందకుండా నిలువరించడం కోసం అమెరికా దాని మిత్రపక్షాలు చైనాపై ఎగుమతి నియంత్రణలు, ఆంక్షలు, సెమీ కండక్టర్ టెక్నాలజీ మీద నిషేధాలు విధించాయి. మరోవైపు తూర్పు ఆసియా ప్రాంతంలో సైనిక విస్తరణకు పూనుకున్నాయి. అయినప్పటికీ చైనా సాంకేతిక స్వావలంభన సాధించడానికి చేసిన కృషి అద్భుతం. జాతీయ స్వావలంబన నుండి శాస్త్ర, సాంకేతిక స్వావలంబనను విడదీయలేము అన్న పార్టీ నిశ్చయాన్ని ఈ చర్యలు ప్రతిబింబిస్తున్నాయి. ఆధునిక వస్తూత్పత్తి, కృత్రిమ మేథ (ఎఐ), పునరుత్పాదక ఇంధనాలు, అంతరిక్ష పరిజ్ఞానం, బయోటెక్నాలజీ, క్వాంటమ్ టెక్నాలజీ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టడం అనేదాన్ని మనం కేవలం ఒక విధానపరమైన చర్య అని అర్థం చేసుకోకూడదు. హైపర్ సామ్రాజ్యవాద ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్న పరిస్థితుల్లో సోషలిస్టు అభివృద్ధికి ఇది అత్యవసరం అని గుర్తించాలి.

చైనా కమ్యూనిస్టు పార్టీ ఈ చారిత్రక పరిణామాలన్నిటా చైనా విప్లవాన్ని పటిష్టంగా నిలిపి ఉంచే సంస్థగా పనిచేసింది. ప్రధానంగా ఎన్నికల్లో పోటీ చేయడమే ధ్యేయంగా లేక ఉన్న సంస్థలను పరిపాలించడమే ధ్యేయంగా పనిచేసే రాజకీయ పార్టీల మాదిరిగా కాకుండా చైనా కమ్యూనిస్టు పార్టీ అనేక తరాలను ప్రభావితం చేసే చారిత్రక క్రమాన్ని నడిపించే ఆర్గనైజర్‌గా పనిచేసింది. దాని ఆమోదయోగ్యత అనేది దాని సైద్ధాంతిక ప్రకటనల మీద ఆధారపడి లేదు. మార్పుచెందుతున్న చారిత్రక వైరుధ్యాలను గుర్తించే దాని సామర్థ్యం, మెజారిటీ జనాభా జీవితాలు బాగుపడే విధంగా ఆ వైరుధ్యాలను పరిష్కరించే వ్యూహాలను రూపొందించడం వల్లనే చైన ప్రజలు దాన్ని ఆమోదించారు.

> ❝ చైనా సాంకేతికంగా అభివృద్ధి చెందకుండా నిలువరించడం కోసం అమెరికా దాని మిత్రపక్షాలు చైనాపై ఎగుమతి నియంత్రణలు, ఆంక్షలు, సెమీ కండక్టర్ టెక్నాలజీ మీద నిషేధాలు విధించాయి. మరోవైపు తూర్పు ఆసియా ప్రాంతంలో సైనిక విస్తరణకు పూనుకున్నాయి. అయినప్పటికీ చైనా సాంకేతిక స్వావలంభన సాధించడానికి చేసిన కృషి అద్భుతం. జాతీయ స్వావలంబన నుండి శాస్త్ర, సాంకేతిక స్వావలంబనను విడదీయలేము అన్న పార్టీ నిశ్చయాన్ని ఈ చర్యలు ప్రతిబింబిస్తున్నాయి. ❞

సామ్రాజ్యవాద–వ్యతిరేకులకు చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవాలు అనేక పాఠాలు నేర్పుతాయి. అభివృద్ధి అంటే మార్కెట్ శక్తులు వాటంతటవి ఉద్భవించడమో లేక ప్రపంచ పెట్టుబడితో విలీనం కావడం వల్ల వచ్చే ఫలమో కాదని చైనా అనుభవాలు తెలుపుతాయి. దీనికి రాజకీయ నాయకత్వం, సంస్థాగతమైన కొనసాగింపు, దీర్ఘకాలిక ప్రణాళిక, సామాజిక లక్ష్యాలకు కట్టుబడి ఉండేట్లు ఆర్థికాభివృద్ధిని నడిపించే రాజ్యం కావాలి. అన్నిటికీ మించి ఏ సామాజిక పరివర్తనకైనా జాతీయ స్వావలంబన కాపాడుకోవడం అనివార్యమైన షరతు అని ఇది తెలియజేస్తుంది.

చైనా అనుభవం యొక్క అంతర్జాతీయ ప్రాధాన్యత 1949 తరువాత ఏనాటి కన్నా కూడా నేడు ఎక్కువగా ఉన్నది. ప్రపంచంలోని వర్ధమాన దేశాలన్నీ కొత్త పారిశ్రామిక పంథా, సాంకేతిక అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన అనుసరిస్తున్న తరుణంలో చైనా అనుభవాలు సోవియట్ పతనం తరువాత మరుగున పడిపోయిన అనేక ప్రశ్నలను తిరిగి లేవనెత్తుతున్నాయి. ఇప్పటికీ ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి సాధ్యమేననీ, ప్రభుత్వ రంగ పెట్టుబడులు సమాజాన్ని పరివర్తన గావిస్తాయనీ, సాంకేతిక నాయకత్వం ధనిక పశ్చిమ దేశాల అబ్బసొత్తుకాదనీ, భవిష్యత్తు ద్రవ్యపెట్టుబడి సొంతం కాదనీ ఈ అనుభవాలు తెలియజేస్తున్నాయి.

దీనర్థం చైనా పంథాను ఇతర దేశాల్లో మక్కీకి మక్కీ దించేయొచ్చని కాదు. ప్రతి సమాజానికీ తన స్వంత చరిత్ర ఉంటుంది. వర్గ సంబంధాలుంటాయి. రాజకీయ సంప్రదాయాలు, భౌతిక పరిస్థితులు ఉంటాయి. అయినప్పటికీ విస్తృతమైన చారిత్రక గుణపాఠాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. చైనా విప్లవ విజయాలు ఏదో ఒక ఛాన్స్ వల్లనో లేక వ్యక్తుల చొరవ వల్లనో వచ్చినవి మాత్రమే కావు. ప్రజల్లో వేళ్లూనుకుని, సోషలిజం నిర్మాణం అనే దీర్ఘకాలిక లక్ష్యానికి కట్టుబడిన, తనను తాను నిరంతరం ప్రక్షాళన గావించుకుంటూ పురోగమించిన ఒక విప్లవ పార్టీ యొక్క నిరంతరాయ నాయకత్వం వల్ల ఇది సాధ్యమైంది.

చైనా కమ్యూనిస్టు పార్టీ కొత్త శతాబ్దంలోకి పూర్తిగావించబడిన విప్లవ రక్షకురాలిగా ప్రవేశించలేదు. పూర్తికాని చారిత్రక క్రమానికి నాయకురాలిగా ప్రవేశించింది. కొత్త పరిస్థితులు, కొత్త సవాళ్ల మధ్య ఈ క్రమం మరిన్ని మార్పులు చెందుతుంది. అయితే అది సాధించిన కేంద్ర విజయం మాత్రం తిరుగులేకుండా మనముందు నిలిచి ఉంది. 105 ఏళ్లలో చైనా కమ్యూనిస్టు పార్టీ ఈ భూమ్మీద అత్యంత పేద, ముక్కచెక్కలై ఉన్న దేశాన్ని ఒక స్వావలంబన గల, సాంకేతికంగా అభివృద్ధి చెందిన, రానురాను మరింత సౌభాగ్యవంతమౌతున్న సోషలిస్టు సమాజంగా పరివర్తన గావించింది. ఇలా చేసే క్రమంలో అది చరిత్ర నిరంతరాయంగా పురోగమిస్తుందనీ, అభివృద్ధిని చైతన్యపూర్వకంగా నడపవచ్చుననీ, క్రమశిక్షణాయుతమైన రాజకీయ సంస్థల ద్వారా ప్రజలు తమ స్వంత భవిష్యత్తును నిర్మించుకునేవిధంగా వారిని సమీకరించవచ్చుననీ నిరూపించింది.

(అనువాదం: ఎస్.వెంకట్రావు)

# వాతావరణమార్పులు: మురికివాడలు

లారా స్పిన్నీ




**లారా స్పిన్నీ పారిస్‌కు చెందిన రచయిత్రి, జర్నలిస్టు. ఆమె ఇటీవల రచించిన 'ప్రోటో: హౌ వన్ ఏన్షియెంట్ లాంగ్వేజ్ వెంట్ గ్లోబల్' (బ్లూమ్స్‌బరీ, 2025) పుస్తకం ఇండో–యూరోపియన్ భాషల ఆవిర్భావం, ప్రపంచవ్యాప్త విస్తరణను విశ్లేషించిన అత్యధికంగా అమ్ముడైన గ్రంథం. జర్నలిస్టుగా ఆమె ది గార్డియన్, ది అట్లాంటిక్, నేచర్ సహా అనేక ప్రముఖ అంతర్జాతీయ పత్రికలకు రచనలు చేశారు.**

దాదాపు 20 ఏళ్ల క్రితం ముంబైలోని ఒక ప్రభుత్వ గృహ నిర్మాణ సముదాయంలోకి మారినప్పటి నుంచి పర్వీన్ షేక్ తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావాలకు అలవాటుపడిపోయింది. ఈ వేడి కారణంగా ఆమె కొత్త పదాలను కూడా నేర్చుకోవాల్సి వచ్చింది. వాటిలో 'లో బ్లడ్ ప్రెజర్'–ఒకటి. శరీరాన్ని చల్లగా ఉంచేందుకు రక్తనాళాలు విస్తరించడం వల్ల ఈ సమస్య వస్తుందని, దాని కారణంగా తల తిరగడం, వాంతులు, చిరాకు వంటి ఇబ్బందులు ఎదురవుతాయని ఆమెకు ఇప్పుడు తెలుసు. "చిన్న పిల్లలు కూడా గతంలో కంటే చాలా త్వరగా కోపానికి గురవుతున్నారు" అని ఆమె చెబుతోంది. అయితే చిన్నప్పుడు ముంబై ఫుట్‌పాత్‌లపై పేదరికంలో పెరిగిన రోజుల్లో లో బ్లడ్ ప్రెజర్ అనే సమస్య తనకు గుర్తు లేదని ఆమె చెబుతోంది. అప్పట్లో పేదరికం వల్ల ఎన్నో కష్టాలు ఉన్నప్పటికీ ఈ సమస్య గురించి వినలేదని అంటోంది. ప్రభుత్వ పునరావాస పథకం కింద ఈ ఇంటికి మారడం తన జీవితంలో ఒక విజయమే. కానీ భారత్‌లో రుతువులు క్రమంగా అనిశ్చితంగా మారడం, వేసవి కాలం మరింత తీవ్రమవడంతో ఆ గృహ నిర్మాణ సముదాయం నిర్మాణంలో ఉన్న లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇక్కడి ఇళ్ల మధ్య అంతగా ఖాళీ స్థలం లేదు. చాలా అపార్ట్‌మెంట్లలో సహజ కాంతి, గాలి సరిగా ప్రవేశించవు. ఒకసారి వేడి మొదలైతే దాని నుంచి తప్పించుకోవడం అసాధ్యం. ఆ వేడి వల్ల కలిగే శారీరక సమస్యలు కూడా అంతే తప్పవు.

జనవరి చివరి వారంలో, వేసవి రావడానికి ఇంకా నెలకుపైగా సమయం ఉన్నప్పటికీ, అక్కడ పరిస్థితి మారుతోంది. తీవ్ర ఉష్ణోగ్రతలు ఇప్పుడు వర్ధమాన దేశాలన్నింటికీ ప్రధాన సమస్యగా, అంతకంతకూ పెరుగుతున్న సంక్షోభంగా మారాయి. చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అంచనా ప్రకారం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు అత్యధిక స్థాయిలో కొనసాగితే, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా 2100 నాటికి ప్రతి ఏడాది అదనంగా 60 లక్షల మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది ప్రస్తుతం అంటువ్యాధుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏటా సంభవిస్తున్న మరణాల సంఖ్యతో సమానమని ఆ అధ్యయనం పేర్కొంటోంది. ఈ మరణాల్లో అత్యధికం అత్యంత పేద దేశాల్లోనే సంభవిస్తాయి. వాటిలోనూ అత్యంత ప్రమాదంలో ఉన్నవారు అసంఘటిత రంగంలో జీవించే ప్రజలే. అంటే మురికివాడల్లో లేదా వీధుల్లో నివసించేవారు, లేదా గిగ్ ఎకానమీ వంటి అస్థిర ఉపాధులపై ఆధారపడి జీవించే కార్మికులే వాతావరణ మార్పుల దెబ్బకు ఎక్కువగా బలవుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడే తీవ్ర ఉష్ణోగ్రతలతో మరణించే ప్రమాదం ప్రాంతాన్ని బట్టి మారుతుంది. ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, నైరుతి ఆసియా వంటి భూమధ్యరేఖకు సమీపంలోని ప్రాంతాల్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా.

వాతావరణ మార్పులు 'ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పేదల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మొదటిది, వారు ఇప్పటికే అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే ప్రాంతాల్లో నివసిస్తున్నారు. రెండోది, ఆ ప్రభావాల నుంచి తమను తాము రక్షించుకునే సామర్థ్యం వారికి చాలా తక్కువ' అని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), కాలేజ్ డి ఫ్రాన్స్‌కు చెందిన నోబెల్ బహుమతి గ్రహీత ఆర్థికవేత్త ఎస్థేర్ డుఫ్లో ఈ ఏడాది జనవరిలో భారత్‌లో జరిగిన జైపూర్ సాహిత్య ఉత్సవంలో నాతో (రచయితతో) అన్నారు. వాతావరణ మార్పుల అంశాన్ని కూడా చేర్చిన 'పూర్ ఎకనామిక్స్' పుస్తకానికి సహ రచయిత్రి అయిన డుఫ్లో అభిప్రాయం ప్రకారం, ప్రస్తుతం ఒక విషవలయం ఏర్పడుతోంది. వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ భూములు క్రమంగా సాగుకు పనికిరాకపోవడంతో మరింత ఎక్కువ మంది ప్రజలు తమ భూములను వదిలి వెళ్లాల్సి వస్తోంది. చివరకు వారు నగరాలకు వలస వెళ్లినా, అక్కడ మరో కొత్త రకమైన ప్రమాదాలు, రక్షణ లేని పరిస్థితులను ఎదుర్కోవాల్సివస్తుంది. 'వాతావరణ మార్పులను ఎలా ఎదుర్కోవాలనే చర్చలో పేదలను కేంద్రంగా ఉంచకుండా ఏ పరిష్కారాన్నీ ఆలోచించడం సాధ్యం కాదు' అని డుఫ్లో స్పష్టం చేశారు. ఇప్పటివరకు వాతావరణ మార్పులపై జరిగిన చర్చల్లో పేదల సమస్యలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని డుఫ్లో అంటున్నారు. దాని ఫలితంగా నగరాలకు వేగంగా పెరుగుతున్న జనాభాను తట్టుకునేందుకు అవసరమైన భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టే సన్నద్ధత నగరాలకు లేదు. ముఖ్యంగా వర్ధమాన దేశాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యంత వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రాంతం ఇదే. ఇక్కడ పట్టణ విస్తరణలో ఎక్కువ భాగం అసంఘటితంగా, ఎలాంటి ప్రణాళికా విధానం లేదా చట్టపరమైన వ్యవస్థకు అతీతంగా జరుగుతోంది. అయితే ఇప్పటికే ప్రపంచ జనాభాలో సగానికి పైగా నగరాల్లో నివసిస్తున్నందున, ఈ ఒత్తిడి త్వరలోనే పట్టణవాసులందరినీ ప్రభావితం చేయడం ఖాయం.

> **“ వాతావరణ మార్పులు ‘ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పేదల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మొదటిది, వారు ఇప్పటికే అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే ప్రాంతాల్లో నివసిస్తున్నారు. రెండోది, ఆ ప్రభావాల నుంచి తమను తాము రక్షించుకునే సామర్థ్యం వారికి చాలా తక్కువ’ అని నోబెల్ బహుమతి గ్రహీత ఆర్థికవేత్త ఎస్తేర్ డుఫ్లో ఈ ఏడాది జనవరిలో భారత్‌లో జరిగిన జైపూర్ సాహిత్య ఉత్సవంలో నాతో (రచయితతో) అన్నారు. ”**



ఆసియాలో అతి పెద్ద మురికివాడ ముంబయిలోని ధారవి

అయితే వాతావరణ సంక్షోభాన్ని మొదటగా, అత్యంత తీవ్రంగా ఎదుర్కొంటున్నది వర్ధమాన దేశాలే కావడంతో, తొలి పరిష్కారాలూ అక్కడి నుంచే పుట్టుకొస్తున్నాయి. అవి ఇంకా పూర్తిస్థాయి ప్రణాళికతో రూపుదిద్దుకోకపోయినా, తీవ్ర వేడి, వరదలు, అంటువ్యాధుల పెరుగుదల వంటి సవాళ్ళు ముఖ్యంగా పేదలను సృజనాత్మకంగా ఆలోచించి బతికే మార్గాలను వెతికేలా చేస్తున్నాయి. చల్లగా, సురక్షితంగా ఉండేందుకు వారు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. అధికార యంత్రాంగం పెద్దగా సహకరించకపోయినా, తమ సమాజాల నుంచే విపత్తులను తట్టుకునే సామర్థ్యాన్ని వారు క్రమంగా నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ పరిష్కారాలు అక్కడక్కడా, విడివిడిగా మాత్రమే కనిపిస్తున్నాయి. అయినప్పటికీ వాటి నుంచి ఇతరులు పాఠాలు నేర్చుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో వాటిని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అంతేకాదు, సామాజికంగా అట్టడుగున ఉన్నప్పటికీ, అసంఘటిత నివాస ప్రాంతాలకు ప్రణాళికాబద్ధ కాలనీల కంటే కొన్ని నిర్మాణపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని పరిశోధకులు గుర్తిస్తున్నారు. అధిక జనసాంద్రత, బలమైన సామాజిక-ఆర్థిక బంధాలు, తక్కువ కార్బన్ ఉద్గారాలతో కూడిన జీవన విధానం వంటి లక్షణాలు వాటికి ప్రత్యేక బలంగా మారుతున్నాయి. భవిష్యత్ నగరాల అభివృద్ధికి సంబంధించి ఒక కొత్త ఆలోచనా విధానం రూపుదిద్దుకుంటోంది. అసంఘటిత పట్టణ వ్యవస్థ విస్తరణ అనివార్యమే కాకుండా, భవిష్యత్ నగరాలు వాతావరణ సంక్షోభాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో విలువైన పాఠాలను కూడా అందించగలదనే అవగాహన బలపడుతోంది.

### వేడి ప్రభావం - ఆరోగ్య పరిస్థితుల మ్యాపింగ్

ఒకప్పుడు ప్రపంచ పటాల్లో మురికివాడలు “ఖాళీ ప్రదేశాలు”గా మాత్రమే కనిపించేవని 2003లో యూఎన్-హ్యాబిటాట్ పేర్కొంది. అయితే ఉపగ్రహాలు, డ్రోన్ సాంకేతికత అభివృద్ధి చెందడం, అలాగే మురికివాడల ప్రజలే తమ నివాస ప్రాంతాలను స్వయంగా మ్యాపింగ్ చేసే ప్రయత్నాలు ప్రారంభించడంతో ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ అసంఘటిత పట్టణ ప్రాంతాలు ప్రపంచ దృష్టికి వచ్చిన కొద్దీ, వాతావరణ మార్పులు అక్కడి పేద ప్రజలపై చూపుతున్న తీవ్రమైన ప్రభావాలు కూడా స్పష్టంగా బయటపడుతున్నాయి. ఇప్పుడు శాస్త్రవేత్తలు ఈ ప్రభావాలను క్రమబద్ధంగా అధ్యయనం చేస్తున్నారు. ఏ చర్యలు తీసుకుంటే ప్రజలకు అత్యధిక ప్రయోజనం చేకూరుతుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉదాహరణకు, భారతదేశంలోని పలు అట్టడుగు స్థాయి ప్రజా సంస్థలు హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో కలిసి ప్రస్తుతం నిర్వహిస్తున్న ఒక పరిశోధనలో మహిళా కౌలు రైతులు, పనికి తగ్గ కూలీ (పీస్‌రేట్) ఆధారంగా పనిచేసే మహిళలకు ఫిట్‌బిట్ పరికరాలను అందించారు. అలాగే వారు నివసించే ఇళ్లలో, పనిచేసే ప్రదేశాల్లో ఉష్ణోగ్రత, తేమ స్థాయిలను నిరంతరం కొలిచే సెన్సార్లను ఏర్పాటు చేశారు. ఈ అధ్యయనం వెల్లడించిన విషయం ఏమిటంటే... తీవ్ర వేడి నుంచి తలదాచుకునే సురక్షితమైన స్థలం ఈ ప్రజలకు వాస్తవానికి ఎక్కడా లేదు. వేసవి తీవ్రస్థాయికి చేరుకున్నప్పుడు బయట పనిచేసే కార్మికులు (వీరిలో ఎక్కువమంది అసంఘటిత రంగానికి చెందినవారే) 35 డిగ్రీల సెల్సియస్ (95 డిగ్రీల ఫారెన్‌హీట్) లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలను భరించాల్సి వస్తోంది. ‘మేం తాగే నీళ్లు కూడా అంత వేడెక్కిపోతాయి. నీళ్లు కాదు, టీ తాగుతున్నట్టే అనిపిస్తుంది’ అని గుజరాత్‌కు చెందిన అధ్యయనంలో పాల్గొన్న సుభిబెన్ చెప్పారు. ఆమె రాష్ట్రంలోని విస్తారమైన ఉప్పు మైదానాల్లో ఉప్పు తయారీ పనిలో పాల్గొంటున్నారు. అంతేకాదు, సెన్సార్లు సేకరించిన సమాచారం ప్రకారం, ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కూడా వారికి వేడి నుంచి ఉపశమనం దొరకడం లేదు.

ఈ మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో గుండెపై తీవ్రమైన ఒత్తిడి, గర్భస్రావంతో పాటు ఇతర స్త్రీల ఆరోగ్య సమస్యలు, అలాగే మానసిక ఆరోగ్య సమస్యలు ప్రధానమైనవని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన సెల్ఫ్ ఎంప్లాయిడ్ ఉమెన్స్ అసోసియేషన్ (సేవా) వైద్యుడు, ఈ అధ్యయన సమన్వయకర్తల్లో ఒకరైన డాక్టర్ సాహిల్ హెబ్బర్ తెలిపారు. ఈ పరిశోధన ఇప్పటివరకు గుర్తించని మరికొన్ని కీలక సంబంధాలను కూడా వెలుగులోకి తీసుకొస్తోంది. ముఖ్యంగా తీవ్ర వేడి, పోషకాహార లోపం మధ్య ఉన్న సంబంధం వాటిలో ఒకటి. హెబ్బర్ తెలిపిన వివరాల ప్రకారం, సేవా సభ్యుల్లో దాదాపు సగం మంది రక్తహీనత (అనీమియా)తో బాధపడుతున్నారు. ఇది సాధారణంగా శరీరంలో ఇనుము లోపం వల్ల వస్తుంది. ఇంకా ప్రచురితం కాని ఈ అధ్యయనంలోని ప్రాథమిక ఫలితాలు ఏమి చెబుతున్నాయంటే, రక్తహీనతతో బాధపడేవారిలో తీవ్రమైన వేడి కారణంగా గుండె, రక్తప్రసరణ వ్యవస్థపై పడే దుష్ప్రభావాలు మరింత తీవ్రంగా ఉంటున్నాయి.

మురికివాడల్లో వేగంగా వ్యాపిస్తున్న అంటువ్యాధులపై కూడా ఇతర పరిశోధకులు

"వాతావరణ మార్పుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై మరింత సమాచారం అందుబాటులోకి వస్తున్న కొద్దీ, అట్టడుగు స్థాయిలో ప్రజలే అభివృద్ధి చేసుకున్న పరిష్కారాల్లో ఏవి అత్యంత ప్రభావ వంతంగా పనిచేస్తున్నాయో పరిశోధకులు గుర్తించడం ప్రారంభిం చారు. భారత్-హార్వర్డ్ సంయుక్త అధ్యయనం ప్రకారం, తీవ్రమైన వేడి నుంచి కార్మికులను రక్షించేందుకు, ఇంటి పైకప్పుకు తెల్లని వేడి పరావర్తన పెయింట్ వేయడం ద్వారా వేసవిలో ఇంటి లోపలి ఉష్ణోగ్రతను సుమారు 2 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గించవచ్చు."

అధ్యయనాలు చేస్తున్నారు. అధిక జనసాంద్రత, సరైన గాలి ప్రసరణ లేకపోవడం వంటి పరిస్థితులు ఈ వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం, భారతదేశంలో క్షయవ్యాధి (టీబీ) ఇప్పటికీ తీవ్ర ప్రజారోగ్య సమస్యగానే కొనసాగుతోంది. దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఇద్దరు టీబీ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. షేక్ నివసిస్తున్న ప్రభుత్వ గృహ నిర్మాణ సముదాయంలో కూడా టీబీ ప్రధాన సమస్యగా ఉంది. దేశంలోని అనేక ఇతర పునరావాస కాలనీల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఈ పరిస్థితి ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో న్యూయార్క్, లండన్ తదితర పశ్చిమ దేశాల నగరాల్లోని వ్యాధులతో నిండిన మురికివాడలను గుర్తుకు తెస్తోంది. అయితే ఒక ముఖ్యమైన తేడా ఉంది. నేటి కాలంలో టీబీని నివారించడం, గుర్తించడం, చికిత్స చేయడం పూర్తిగా సాధ్యమే. 'టీబీతో బాధపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని సాధనాలు ఇప్పుడు మన వద్ద ఉన్నాయి' అని ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఉన్న న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయానికి చెందిన శ్వాసకోశ నిపుణుడు, అంతర్జాతీయ క్షయవ్యాధి మరియు ఊపిరితిత్తుల వ్యాధుల నిరోధక సంఘం అధ్యక్షుడు డాక్టర్ గై మార్క్స్ తెలిపారు.

వరదల తర్వాత కలరా వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు సాధారణంగా విస్తృతంగా ప్రబలుతుంటాయి. 2025 లో వెలువడిన ఒక అధ్యయనం ప్రకారం, వర్ధమాన దేశాల్లోని అసంఘటిత నివాస ప్రాంతాల్లో నివసించే ప్రతి ముగ్గురిలో ఒకరు వరద ముంపు ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. వీరు ఎప్పుడైనా తీవ్ర వరద విపత్తును ఎదుర్కొనే ప్రమాదంలో ఉన్నారు. అయితే ఇప్పుడు ఈ నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు కేవలం వరదల తర్వాతే కాదు, సాధారణ పరిస్థితుల్లోనూ సమస్యగా మారుతున్నాయి. మరోవైపు, దోమల వంటి కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులు కూడా వేగంగా పెరుగుతున్నాయి. పారిస్‌లోని ఫ్రాన్స్ జాతీయ శాస్త్రీయ పరిశోధన కేంద్రం (సీఎన్ఆర్ఎస్)కు చెందిన ఆరోగ్య భౌగోళిక శాస్త్రవేత్త ఒలివియర్ టెల్ తెలిపిన వివరాల ప్రకారం, ఏడిస్ ఈజిప్టి దోమ ద్వారా వ్యాపించే డెంగ్యూ జ్వరం అసంఘటిత నివాస ప్రాంతాల్లో మరింత విస్తరిస్తోంది. అక్కడ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో పాటు, తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు నీటిని నిల్వ చేసుకోవాల్సి వస్తోంది. ఈ నిల్వ నీరు దోమలు పెరగడానికి అత్యంత అనుకూలమైన పరిస్థితులను కల్పిస్తోంది. అంతేకాదు, ఒకప్పుడు నగర శివార్లలోని మురికివాడలకే పరిమితమైన డెంగ్యూ ఇప్పుడు నగర కేంద్ర ప్రాంతాలకూ వ్యాపిస్తోంది. ప్రజల రాకపోకలు, ఉపాధి కోసం జరిగే వలసలతో పాటు ఈ వ్యాధి కూడా విస్తరిస్తోందని టెల్ బృందం గుర్తించింది. ఉదాహరణకు ఢిల్లీలో అత్యంత సంపన్న ప్రాంతాల్లో కూడా డెంగ్యూ కేసుల సంఖ్య పేద ప్రాంతాలతో సమానంగా నమోదవుతున్నట్లు వారి పరిశోధన వెల్లడించింది. ఇందుకు కారణం నగర శివార్ల నుంచి ఉద్యోగాల కోసం వచ్చే ప్రజల్లో చాలామంది ఇప్పటికే డెంగ్యూ బారిన పడినవారే కావచ్చని వారు భావిస్తున్నారు. "సమాజం మొత్తాన్ని రక్షించాలంటే ముందుగా అత్యంత పేదలను రక్షించాలి" అని ఒలివియర్ టెల్ పేర్కొన్నారు.

వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న ఆరోగ్య సమస్యలపై మరింత సమాచారం అందుబాటులోకి వస్తున్న కొద్దీ, అట్టడుగు స్థాయిలో ప్రజలే అభివృద్ధి చేసుకున్న పరిష్కారాల్లో ఏవి అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తున్నాయో పరిశోధకులు గుర్తించడం ప్రారంభించారు. భారత్-హార్వర్డ్ సంయుక్త అధ్యయనం ప్రకారం, తీవ్రమైన వేడి నుంచి కార్మికులను రక్షించే అత్యంత సమర్థవంతమైన మార్గాల్లో ఒకటి వారి ఇళ్లను చల్లగా ఉంచడం. ఉదాహరణకు, ఇంటి పైకప్పుకు తెల్లని వేడి పరావర్తన (రిఫ్లెక్టివ్) పెయింట్ వేయడం ద్వారా వేసవిలో ఇంటి లోపలి ఉష్ణోగ్రతను సుమారు 2 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గించవచ్చు. భారత్‌కు 2070 నాటికి అవసరమయ్యే పట్టణ గృహాల్లో సగానికి పైగా ఇళ్లు ఇంకా నిర్మించాల్సి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేస్తోంది. అందువల్ల ఇలాంటి సులభమైన, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాలను భవిష్యత దేశం తన గృహ నిర్మాణ ప్రణాళికల్లో భాగం చేయాలని డాక్టర్ సాహిల్ హెబ్బర్ భావిస్తున్నారు. తద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం ఉన్న ఇళ్లు, కార్యాలయాలు నిర్మించడం సాధ్యమవుతుందని ఆయన చెబుతున్నారు. ఇదే దిశగా మరికొందరు కూడా ఆలోచిస్తున్నారు. ముంబైకి చెందిన షీలా పటేల్, అసంఘటిత నివాసితుల అంతర్జాతీయ సమాఖ్య (స్లమ్ డ్వెల్లర్స్ ఇంటర్నేషనల్) మాజీ అధ్యక్షురాలు, ప్రస్తుతం 'రూఫ్ ఓవర్ అవర్ హెడ్స్ (ఆర్ఓఓహెచ్)' అనే ప్రాజెక్టుకు నాయకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో మురికివాడల నివాసితులు ముఖ్యంగా మహిళలు, వాస్తుశిల్పులు, ఇంజినీర్లతో కలిసి వాతావరణ మార్పులను తట్టుకునే, తక్కువ ఖర్చుతో నిర్మించగల గృహాలను రూపొందిస్తున్నారు. ముంబైలో నిర్మాణంలో ఉన్న అలాంటి ఒక (ఆర్ఓఓహెచ్) ఇంటిని నేను (రచయిత) సందర్శించాను. ఆ ఇంటి నేల పలకలు అసంఘటిత చెత్త సేకరణ కార్మికులు సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగం చేసి తయారు చేశారు. అలాగే ఆ ఇంటికి అమర్చబోతున్న పైకప్పు ముందుగానే ప్రత్యేక పూత పూసిన గాల్వనైజ్డ్ ఇనుప షీట్లతో తయారవుతోంది. ఇవి సూర్యుడి వేడిని పరావర్తనం చేసి ఇంటి లోపలి ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయి.

ఇప్పటివరకు ఆర్ఓఓహెచ్ ప్రాజెక్టు ద్వారా దాదాపు 12 దేశాల్లో సుమారు 250 ఇళ్లను నిర్మించారు. ఈ నమూనా ఇళ్లను చూసి ఇతర మురికివాడల ప్రజలు కూడా వాటిలోని కొన్ని అంశాలను అయినా స్వీకరించాలని, లేదా పూర్తిగా అలాంటి ఇళ్లనే నిర్మించాలని షీలా పటేల్ ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టు లక్ష్యం ఏమిటంటే... వివిధ ప్రాంతాల్లో ఉపయోగపడే వాతావరణ అనుకూల నిర్మాణ పరిష్కారాలన్నింటినీ ఒకే వేదికపై సమీకరించడం.

భవిష్యత్తులో దీనిని వెబ్ ఆధారిత వేదికగా రూపొందించి, వర్ధమాన దేశాల ప్రజలందరూ వాటిని సులభంగా చూసి, తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకుని ఉపయోగించుకునేలా చేయాలని యోచిస్తున్నారు. ఆమె అభిప్రాయం ప్రకారం, సమస్యను ఎక్కువగా అనుభవిస్తున్న ప్రజల నుంచే పరిష్కారాలు రావడం అత్యంత కీలకం. ఎందుకంటే ఎప్పుడైనా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినప్పుడు, ప్రజలే ఇప్పటికే రూపొందించి, ఆచరణలో పరీక్షించి నిరూపించిన ఈ పరిష్కారాలు వారికి సిద్ధంగా అందుబాటులో ఉంటాయి. మరికొందరు పరిశోధకులు, నిపుణులు మొత్తం మురికివాడలనే వాతావరణ మార్పులను తట్టుకునేలా పునర్నిర్మించే ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అయితే ఇటువంటి కార్యక్రమాలు నగర లేదా రాష్ట్ర ప్రభుత్వాలే ముందుండి అమలు చేయాల్సినవి. ఉదాహరణకు, కెన్యా రాజధాని నైరోబీలోని ముకురు అనే అసంఘటిత రంగ ప్రజల నివాస ప్రాంతంలో మురుగునీటి వ్యవస్థతో అనుసంధానించే తక్కువ ఖర్చుతో కూడిన పథకాన్ని అమలు చేస్తున్నారు. "సింప్లిఫైడ్ సీవర్"గా పిలిచే ఈ వ్యవస్థలో చిన్న వ్యాసం గల పైపులు, తక్కువ లోతులో తవ్వకాలు ఉపయోగిస్తారు. ఈ ప్రాజెక్టు ఇంకా పూర్తికాక పోయినా, ఇప్పటికే ఆ ప్రాంతంలో కలరా కేసులు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

మురికివాడలను మెరుగుపరచడంలో అక్కడి ప్రజలను అదే ప్రాంతంలో ఉంచి మౌలిక వసతులు కల్పించే "ఇన్-సిటు అప్‌గ్రేడింగ్" విధానాన్నే సాధారణంగా అత్యుత్తమ పరిష్కారంగా భావిస్తారు. ఎందుకంటే దీనివల్ల ప్రజలు తమ నివాసాలను వదిలి వెళ్లాల్సిన అవసరం ఉండదు. వారి సామాజిక బంధాలు, ఉపాధి అవకాశాలు కూడా అలాగే కొనసాగుతాయి. అయితే న్యూజిలాండ్‌లోని విక్టోరియా యూనివర్సిటీ ఆఫ్ వెల్లింగ్టన్‌కు చెందిన పట్టణాభివృద్ధి నిపుణుడు జోసే నూనెజ్ కొల్లాడో అభిప్రాయం ప్రకారం, ప్రతి సందర్భంలోనూ ఇది సాధ్యం కాదు. కొన్ని అసంఘటిత నివాస ప్రాంతాల విషయంలో మొత్తం సమాజాన్నే మరో ప్రాంతానికి తరలించడం ఒక్కటే సరైన, లేదా ఏకైక పరిష్కారంగా మారుతుంది. వాతావరణ సంక్షోభం మరింత తీవ్రమవుతున్న కొద్దీ ఇలాంటి పరిస్థితులు ఇంకా ఎక్కువగా ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన చెబుతున్నారు. ప్రస్తుతం ఇలాంటి పునరావాస కార్యక్రమాలు చాలా వరకు అక్కడి ప్రజలతో తగిన సంప్రదింపులు లేకుండానే అమలవుతున్నాయి. ఉదాహరణకు, డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటో డొమింగోలో వరదలకు తరచూ గురయ్యే 'లా బార్కిటా' అనే నివాస ప్రాంత ప్రజలను 2016 లో ఒక ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద మరో ప్రాంతానికి తరలించారు. కొల్లాడో దాదాపు పదేళ్లపాటు ఆ పునరావాసం పొందిన సమాజంపై నిర్వహించిన అధ్యయనం ప్రకారం, ప్రస్తుతం 'లా నువేవా బార్కిటా'లో నివసిస్తున్న ప్రజలు తమ కొత్త ఇళ్లలో గతం కంటే ఎక్కువ భద్రతగా ఉన్నామని భావిస్తున్నారు. అయితే మరోవైపు, వారిలో చాలామంది తమ పాత ఉద్యోగాలను కోల్పోయారు. మరికొందరు ఉపాధి కోసం ఇప్పుడు గతం కంటే చాలా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

" మురికివాడలను మెరుగుపరచడంలో అక్కడి ప్రజలను అదే ప్రాంతంలో ఉంచి మౌలిక వసతులు కల్పించే "ఇన్-సిటు అప్‌గ్రేడింగ్" విధానాన్నే సాధారణంగా అత్యుత్తమ పరిష్కారంగా భావిస్తారు. ఎందుకంటే దీనివల్ల ప్రజలు తమ నివాసాలను వదిలి వెళ్లాల్సిన అవసరం ఉండదు. వారి సామాజిక బంధాలు, ఉపాధి అవకాశాలు కూడా అలాగే కొనసాగుతాయి. "

భారత్‌లోని ఆర్‌ఓఓహెచ్ వంటి ప్రాజెక్టులు అసంఘటిత నివాస ప్రాంతాల అభివృద్ధిలో మరింత సహకారపూర్వక విధానాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలే. అంటే ప్రజల నుంచే వచ్చే (బాటమ్-అప్) ఆలోచనలను, ప్రభుత్వాల నుంచి వచ్చే (టాప్-డౌన్) చర్యలను సమన్వయం చేస్తూ, అక్కడి ప్రజల అవసరాలు, అనుభవం, నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చే అభివృద్ధి నమూనాను రూపొందించడమే వీటి లక్ష్యం. ఆర్‌ఓఓహెచ్ ప్రాజెక్టు నాయకురాలు షీలా పటేల్ అభిప్రాయం ప్రకారం, ఇలాంటి విధానం ఎప్పుడో రావాల్సింది. "భవిష్యత్తులో అసంఘటిత నివాస ప్రాంతాల్లో నివసించే దాదాపు 200 కోట్ల మంది – అంటే ప్రపంచ జనాభాలో నాలుగో వంతు – తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రభావానికి గురవుతారని మేము భావిస్తున్నాం. కానీ ఈ సమస్యను ఏ ప్రభుత్వం గానీ, ఏ పరిశ్రమ గానీ ఇప్పటికీ సీరియస్‌గా పరిగణించడం లేదు" అని ఆమె అంటున్నారు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. అసంఘటిత పట్టణాలను పూర్తిగా అంతం చేయడం సాధ్యం కాదు. ఈ అంశంపై మరింత సమాచారం అందుబాటులోకి వస్తున్న కొద్దీ, చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన సంక్లిష్ట వ్యవస్థల శాస్త్రవేత్త, పట్టణాభివృద్ధి నిపుణుడు లూయిస్ బెట్టెన్‌కోర్ట్ వంటి పరిశోధకులు ఒక కీలక విషయాన్ని గుర్తిస్తున్నారు. వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో అవసరమైనంత గృహనిర్మాణం అందుబాటులో లేకపోవడంతో ప్రజలే స్వయంగా ఇళ్లు నిర్మించుకోవడం ద్వారా అసంఘటిత నివాస ప్రాంతాలు సహజంగానే ఏర్పడుతున్నాయి. అంటే ఇవి ప్రణాళికా లోపానికి ప్రజలు కనుగొన్న ప్రత్యామ్నాయ మార్గమని ఆయన చెబుతున్నారు. "ఈ అసంఘటిత నివాస ప్రాంతాలే లక్షలాది మంది ప్రజలకు అభివృద్ధి వైపు తొలి మెట్టుగా పనిచేస్తాయి" అని బెట్టెన్‌కోర్ట్ పేర్కొన్నారు. ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుంటే, ప్రభుత్వాలు పట్టణ పేదలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని బెట్టెన్‌కోర్ట్ భావిస్తున్నారు. కేవలం ఇప్పటికే ఉన్న అసంఘటిత నివాస ప్రాంతాలను మెరుగుపరచడమే కాకుండా, భవిష్యత్ నగరాల అభివృద్ధిని ముందుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన చెబుతున్నారు. ఆ నగరాలు కేవలం ధనికులకే కాకుండా, ప్రతి ఒక్కరూ నివసించడానికి అనువుగా ఉండేలా నిర్మించాల్సిందేనని ఆయన అభిప్రాయపడుతున్నారు. అసంఘటిత నివాస ప్రాంతాల ప్రజలు గత ఐదు దశాబ్దాలుగా తమ నివాసాలను తామే మ్యాపింగ్ చేసుకోవడం, సర్వేలు నిర్వహించడం వంటి ప్రయత్నాలపై ఆధారపడి సాగిన బెట్టెన్‌కోర్ట్ పరిశోధన ఒక కీలక సూత్రాన్ని వెలికి తీసింది. భవిష్యత్తులో పట్టణాభివృద్ధికి సంబంధించిన అన్ని విధానాలకు ఇదే మార్గదర్శకంగా ఉండాలని ఆయన భావిస్తున్నారు. ఆ సూత్రాన్ని ఆయన "అసంఘటితమే సహజం" అంటూ కేవలం రెండు మాటల్లో చెప్పేస్తారు.

(అనువాదం: పొగడ దొరువు)

# బాలలే లక్ష్యంగా ఇజ్రాయిల్ జనహననం



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటోరియల్ బాధ్యులు

ఎ కోటిరెడ్డి

**2023,** అక్టోబరు 7- 2026, మార్చి 31వ తేదీల మధ్యకాలంలో ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా భూ భాగాలైన గాజా, తూర్పు జెరూసలెం లోని పాలస్తీనా పౌరులు, బాలలపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండపై విచారణ జరపటం కోసం భారత దేశానికి చెందిన జస్టిస్ మురళీధర్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో స్వతంత్ర, అంతర్జాతీయ విచారణ కమిషన్‌ను ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసింది. జాంబియాకు చెందిన ఫ్లోరెన్స్ ముంబా, ఆస్ట్రేలియాకు చెందిన క్రిస్ సిడోటి కమిషన్‌లోని మిగతా ఇద్దరు సభ్యులు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ మారణకాండను సాక్ష్యాలతో వివరిస్తూ 94 పేజీల నివేదికను కమిషన్ రూపొందించింది. 2023, అక్టోబరు 7 నుండి 2026, మార్చి 31వ తేదీల మధ్యకాలంలో ఇజ్రాయెల్ రక్షణ దళాలు, యూదు సెటిలర్లు జరిపిన దాడులలో 20,179 మంది పాలస్తీనా బాలలు మరణించగా, 44,143 మంది గాయపడ్డారు. 58,000 మంది బాలలు అనాథలుగా మారారు. ఇజ్రాయెల్ దాడులలో మరణించిన పాలస్తీనా పౌరులలో బాలలు 30శాతం ఉన్నారని కమిషన్ పేర్కొంది. అంటే మొత్తం మరణాలు 72 వేలకు పైగా ఉంటాయని ఐక్యరాజ్యసమితి, అనుబంధ సంస్థల అధ్యయనాలలో కూడా వెల్లడైంది. మరికొన్ని ఇతర సంస్థలు స్వతంత్రంగా చేసిన అధ్యయనాలలో మరణాల సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నది. 2023, అక్టోబరులో పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత మొదటి 15 మాసాలలోనే 75,000 మందికి పైగా పాలస్తీనా పౌరులు, బాలలు మరణించినట్లు తన అధ్యయనంలో వెల్లడైందని ప్రఖ్యాత మెడికల్ జర్నల్ ది లాన్సెట్ పేర్కొంది. తన నివేదికలో పొందిపరిచిన ప్రతి మరణానికి, గాయపడినట్లు పేర్కొన్న ప్రతి వ్యక్తికి సంబంధించిన సాక్ష్యాలను జస్టిస్ మురళీధర్ కమిషన్ సమీకరించింది. ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధనేరాలు, మానవ హక్కుల ఉల్లంఘనలను సవివరంగా పేర్కొంది.

నిరంతరం యుద్ధ వాతావరణం, కళ్ళముందే తల్లిదండ్రులు, ఆప్తులు చనిపోతుండటం బాలలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. వేలాది మంది బాలలు శారీరకంగా, మానసికంగా తీవ్ర అనారోగ్యంతో జీవిస్తున్నారు. ఈ పరిస్థితులు వారిపై చూపించే స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ప్రభావాలను కమిషన్ నివేదికలో వివరించింది.

ఆసుపత్రులు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకోవటం, సాధారణ పౌరులపై దాడులు చేయటం, అక్రమంగా అరెస్టులు చేసి హింసించటం, మహిళలపై తీవ్ర హింసాకాండ, లైంగిక వేధింపులు పెరగటం కమిషన్ పరిశీలనలో వెల్లడైంది.

### పాలస్తీనా బాలలను నిర్మూలించటానికి టెర్రరిస్టుల ముద్ర

ఇజ్రాయెల్ ప్రభుత్వంతో పాటు ఇజ్రాయెల్ పార్లమెంటులోని ఎక్కువ మంది సభ్యులు పాలస్తీనా బాలలంతా భవిష్యత్ టెర్రరిస్టులని, కాబట్టి వారిని సమూలంగా నిర్మూలించాలని ప్రణాళిక రూపొందించారు. పాలకవర్గాలలోని ప్రముఖులు, మీడియా, ఇతర ప్రచార సాధనాల ద్వారా ప్రధానంగా ఇదే ప్రచారం సాగిస్తున్నారు. ఇజ్రాయెల్ పక్కన టెర్రరిస్టు ప్రభుత్వం ఉండటానికి అంగీకరించబోమని, గాజాలో ఉన్న ప్రతి బాలుడు టెర్రరిస్టేనని, బాలలను చంపి, మిగతా వారిని అక్కడి నుండి పంపివేస్తే వారు తిరిగి పోరాడలేరని పార్లమెంటు డిప్యూటి స్పీకర్ నిస్సిం వటూరి చెప్పాడు. రెండు ప్రాంతాలను వేరుచేస్తున్న ఫెన్సింగ్ వద్దకు ఎవరు వచ్చినా కాల్చివేయాలని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇటామన్ బెన్‌గ్విర్ చెప్పాడు. ఇజ్రాయెల్ దళాల ముట్టడిలో ఉన్న అల్ షిఫా ఆసుపత్రిలోని కాన్పుల వార్డులో పుట్టిన 300 మంది పిల్లలు టెర్రరిస్టులేనని నెసెట్ సభ్యుడు అమిత్ హవెలి అక్కసు వెళ్ళగక్కాడు. ఇజ్రాయెల్‌కు శత్రువు హమాస్ కానీ, హమాస్ సైనిక విభాగం కానీ కాదని, గాజాలోని ప్రతి బాలుడు, బాలిక అసలైన శత్రువులని నెసెట్‌లోని అతి మితవాద లికుడ్ పార్టీ సభ్యుడు మోషె ఫీగ్లిన్ చెప్పాడు. గాజాను మన వలసగా చేసుకొని, ఒక్క బాలుడు, బాలికను కూడా అక్కడ బతకనివ్వకూడదని అతడు ఉన్మాదాన్ని వెళ్ళగక్కాడు. ఈ విధంగా ఇజ్రాయెల్ అగ్రనాయకత్వం, పాలకవర్గాలు గాజాలోని పాలస్తీనా బాల, బాలికలను నిర్మూలించటానికి మానసికంగా సన్నద్ధమైవున్నారు.

### పాలస్తీనా బాలలను చంపటానికి పోటీ పడుతున్న ఇజ్రాయెల్ సైనికులు

ఒక్కొక్కరం ఎంత మంది పాలస్తీనా పౌరులు, బాలలను చంపగలం అన్న అంశంపై ఇజ్రాయెల్ సైనికులు తమలో తాము పందేలు కాసుకొంటున్న విషయాన్ని 2024, డిసెంబర్‌లో హేర్టిజ్ పత్రిక సాక్ష్యాధారాలతో సహా వెల్లడించింది. పాలస్తీనా బాలలను చంపిన సైనికులను ఇజ్రాయెల్ ఉన్నతాధికారులు అభినందిస్తున్నారు. ఆ విధంగా చంపని సైనికులను అధికారులు బెదిరిస్తున్నారని కొందరు సైనికులు తెలిపినట్లు ఆ పత్రికలో ప్రచురించిన వ్యాసంలో పేర్కొన్నారు. వారు కాల్చే మొదటి బులెట్‌ను తలకు గురిపెడుతున్నారు. అంతర్జాతీయ చట్టాల నుండి తమకు రక్షణ లభిస్తుందనే హామితో వారు స్వేచ్ఛగా హత్యలు చేస్తున్నారు.

### పిల్లలను చంపటం, వికలాంగులను చేయటమే లక్ష్యంగా..

"జెనిన్‌లో నిరపరాధులైన పిల్లలు ఎవరూ లేరని, 2006లో పుట్టిన వారు 2026లో విధ్వంసం సృష్టిస్తున్నారని, తన శత్రువుల పట్ల ఎటువంటి దయ చూయించను" అని ఇజ్రాయెల్ నెసెట్ సభ్యుడు ఇట్జాక్ క్రోయిజర్ 2026, మార్చి 25వ తేదీన నెసెట్ ప్రసంగంలో పేర్కొన్నాడు. 2023 అక్టోబరు, 2025 అక్టోబరు మధ్య ఎటువంటి సైనిక

కార్యకలాపాలు జరగని పశ్చిమతీరం, తూర్పు జెరుసలెంలలో 213 మంది బాలలను –బాలురు 206, బాలికలు 7– ఇజ్రాయెల్ దళాలు హత్య చేశాయి. ఇజ్రాయెల్ సైనికులు బాలురను భవిష్యత్ టెర్రరిస్టులుగా భావించి, వారిని లక్ష్యంగా పెట్టుకుంటున్నారని, హత్యకు గురయిన వారిలో బాలురు అత్యధికంగా ఉండటం దీనిని బలపరుస్తున్నదని కమిషన్ భావించింది. బాలికలు కూడా సురక్షితంగా లేరు. ఇళ్ళలోనే ఉంటున్నప్పటికీ వారిని గాయవరచటం, హత్యలు చేయటం కొనసాగిస్తున్నారు.

2023, అక్టోబరు 7 తర్వాత పశ్చిమతీరం, జెరూసలెంలలో పాలస్తీనా బాలలు, పౌరులపై దాడులు, హత్యలు తీవ్రమైనాయి. ఇజ్రాయెల్ సైనికుల మద్దతుతో 230 పాలస్తీనా గ్రూపులపై 1000కి పైగా దాడులు చేశారు. ఈ దాడులలో ఆస్తులు ధ్వంసం కావటంతో పాటు 11మంది మరణించగా, 700 మందికి పైగా గాయపడ్డారు.

**పాలస్తీనా బాలలను మానసికంగా హింసిస్తున్నారు**

2025, ఏప్రిల్‌లో ఇజ్రాయెల్ సెటిలర్లు ఐదు సంవత్సరాల వయసున్న ఇద్దరు బాలలను కత్తులు చూపి బెదిరించి బలవంతంగా తీసుకెళ్ళి, సమీపంలోని చెట్టుకు కట్టి హింసించారు. వారి కుటుంబ సభ్యులు ఐదు నిముషాల తర్వాత అక్కడికి చేరుకొని, పిల్లల కట్లువిప్పి ఇంటికి తీసుకెళ్ళారు. అప్పటి నుండి ఆ పిల్లలలో మానసికంగా దెబ్బతిన్న లక్షణాలు కనిపిస్తున్నాయి. రాత్రుళ్ళు తీవ్రంగా కలవరపడటంతో పాటు, ఇంట్లో నుండి బయటికి రావటానికి కూడా భయపడుతున్నారు. ఇళ్ళకు సమీపంలో ఆడుకొనేటపుడు, పాఠశాల నుండి వచ్చేటపుడు, పొలాలకు వెళ్ళేటపుడు, పశువులను మేపటానికి వెళ్ళివచ్చేటపుడు ఇజ్రాయెల్ సెటిలర్లు పాలస్తీనా బాలలపై దాడులు చేసి భయపెడుతున్నారు. కొట్టటం, నేలపై ఈడ్చుకెళ్ళటం, కాళ్ళతో తన్నటం, బూతులు తిట్టటం చేస్తున్నారు. వారిని శారీరకంగా, మానసికంగా గాయపరుస్తున్నారు. కాళ్ళుచేతులు విరగగొట్టి బాధలకు గురిచేస్తున్నారు. పాలస్తీనా ప్రజలను వారి స్వదేశం నుండి తరిమివేయటం కోసం ఈ విధమైన హింస, హత్యాకాండకు పాల్పడుతున్నారు.

**నిర్బంధించిన పిల్లల పట్ల అనుచిత ప్రవర్తన**

ఇజ్రాయెల్ సైనికులు అర్ధరాత్రులు హఠాత్తుగా పాలస్తీనా ప్రజల ఇళ్ళపై దాడులు

> **"జైళ్ళలో ఉన్న బాలలను రాత్రిపూట చేతులు వెనక్కు కట్టి, నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్ళి అక్కడ మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా మూత్రం తాగమని ఇజ్రాయెల్ సైనికులు నిర్బంధిస్తున్నారని కమిషన్ నివేదికలో తెలిపింది. బాలలు, పెద్దలు, మహిళలు అన్న విచక్షణ చూపకుండా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సైనికులు లైంగిక నేరాలకు పాల్పడుతున్నారు. నిర్బంధించిన వారిని ఆండర్‌వేర్‌తో పాటు బట్టలన్నీ విప్పిస్తున్నారు. నగ్నంగా ఉన్న బాలల చేత నాట్యం చేయిస్తూ, వీడియోలు తీస్తున్నారు."**



గాజాలో పాలస్తీనా బాలుర దయనీయ పరిస్థితి

చేసి, వారి ఆస్తులను నాశనం చేస్తున్నారు. పెద్దలతో పాటు పిల్లల కళ్ళకు గంతలు కట్టటం, కొట్టటంతో పాటు చేతులకు సంకెళ్ళు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మిలిటరి డిటెన్షన్ క్యాంపులకు తీసుకెళ్ళి దాడులు చేసినట్లుగా అంగీకరింపజేయటం, బట్టలు మొత్తం విప్పదీయించటం, కాళ్ళతో తన్నటం, మోకాళ్ళపై కూర్చోబెట్టటం, కుక్కలను ఉసిగొలిపి భయభ్రాంతులకు గురిచేయటం తదితర విధాలుగా బాలలను వేధిస్తున్నారు. అవసమైనపుడు పిల్లలను బాత్‌రూంలకు వెళ్ళనివ్వటం లేదు. సరిపోయినంత ఆహారం పెట్టరు. ఇతర డిటెన్యూలతో మాట్లాడినా, వైద్య సహాయం అడిగినా తీవ్రమైన శిక్షలు విధిస్తున్నారు. ఇజ్రాయెల్ సైనికులు 15 సంవత్సరాల బాలలతో పాటు 70 మందిని ఒక సెల్‌లో ఉంచి, కుక్కలను లోపలకు వదిలి తలుపులు మూసివేశారని కమిషన్ వెల్లడించింది. ఇజ్రాయెల్ సైనికులు ఎంత కర్కశంగా వ్యవహరిస్తున్నారనే దానికి ఇటువంటి ఘటనలు ఉదాహరణలుగా ఉన్నాయి.

**బాలికలు, మహిళలపై లైంగిక దాడులు**

జైళ్ళలో ఉన్న బాలలను రాత్రిపూట చేతులు వెనక్కు కట్టి, నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్ళి అక్కడ మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా మూత్రం తాగమని ఇజ్రాయెల్ సైనికులు నిర్బంధిస్తున్నారని కమిషన్ నివేదికలో తెలిపింది. బాలలు, పెద్దలు, మహిళలు అన్న విచక్షణ చూపకుండా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సైనికులు లైంగిక నేరాలకు పాల్పడుతున్నారు. నిర్బంధించిన వారిని ఆండర్‌వేర్‌తో పాటు మొత్తం బట్టలన్నీ విప్పిస్తున్నారు. నగ్నంగా ఉన్న బాలల చేత నాట్యం చేయిస్తూ, వీడియోలు తీస్తున్నారు. పాలస్తీనా ప్రజలను అవమానించటం, పగతీర్చుకోవటం, బెదిరించటానికి ఈ విధంగా బాలలను హింసిస్తున్నారు. 2023, నవంబరులో సలాహ్ అల్–దిన్ స్ట్రీట్‌లోని ప్రజలను ఖాళీ చేయించేటపుడు ట్యాంకులతో సైనికులు పెద్దసంఖ్యలో వచ్చారనీ, స్త్రీ, పురుషులు, బాలికలు, బాలురు అందరినీ వరుసగా నిలబెట్టి, తుపాకులు గురిపెట్టి పూర్తి నగ్నంగా నిలబడాలని ఆదేశించారనీ, అందరూ నగ్నంగా అయిన తర్వాత బట్టలను ఉండగా చుట్టి సైనికుల వైపుకు విసరమని చెప్పారనీ, బాలికలు కూడా నగ్నంగా తమ కుటుంబసభ్యులతో కలిసి ఉండాలని ఆదేశించారనీ, తమ గుర్తింపు కార్డులను పైకి ఎత్తి పట్టుకొని, నగ్నంగా నడవాలని, లేకపోతే కాల్చిచంపుతామని బెదిరించారనీ అపుడు వారిలో ఉన్న ఒకవ్యక్తి కమిషన్‌కు చెప్పాడు.

14 సంవత్సరాల బాలిక పాఠశాలకు వెళుతుంటే పోలీసుస్టేషన్‌కు తీసుకు వెళ్ళి, స్కూల్ బ్యాగ్‌లోని పుస్తకాలు బయటికి తీయించారు. మగ సైనికులు ఆమె రొమ్ములు, మెడ, నడుముపై చేతులు వేశారు. మహిళా సైనికులను పిలిపించమని బాలిక కోరగా ఆమెను బూతులు

" 2023, అక్టోబరు 7, 2025, అక్టోబరు 11 తేదీల మధ్య 564 పాఠశాల భవనాలలో 459 భవనాలను ఇజ్రాయెల్ సైనికులు పేల్చివేశారు. 2023, అక్టోబరు 7వ తేదీకి ముందు ఈ పాఠశాలలు రోజుకు రెండు, మూడు షిఫ్టులలో పనిచేస్తుండేవి. దెబ్బతిన్న 459 పాఠశాలలలో 4,87,712 మంది విద్యార్థులున్నారు. 18,740 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. "

తిట్టికొట్టారు. "మీరంతా హంతకులు" అని ఆమెను తిట్టారు. తనను అరెస్టు చేసినపుడు పాదంపై తుపాకితో కాల్చారని మరో బాలిక కమిషన్‌కు చెప్పింది. ఆమెను రూములోకి తీసుకెళ్ళిన తర్వాత మగ పోలీసుల ముందే మహిళా పోలీసు కట్ డ్రాయర్, బన్ని, బ్రా మినహా మిగతా బట్టలు కత్తిరించింది. ఆమె బన్నీని పైకెత్తి బ్రా కనిపించేలా ఫోటోలు తీసింది. బాలిక అభ్యంతరం వ్యక్తం చేస్తుంటే ఒక సైనికుడు తుపాకితో ఆమె తలపై కొట్టాడు. తర్వాత వచ్చిన అంబులెన్స్‌లో ఆపరేషన్ కోసం ఆమెను ఆసుప్రతికి తీసుకెళ్ళారు. బట్టలు లేకుండా, ఆసుపత్రి షీటు మాత్రమే కప్పి ఆసుపత్రికి, అక్కడి నుండి జైలుకు తీసుకువచ్చారు.

### బాలురను అవమానించటం

పాలస్తీనీయులను అవమానించటం, తమ ఆధిపత్యాన్ని చాటుకోవటంలో భాగంగా బాలురను నిర్బంధించి తీసుకెళుతున్నపుడు వారిని నగ్నంగా చేసి ఫోటోలు తీయటంతో పాటు, వారి తల్లులను, అక్కచెల్లెళ్ళను అవమానిస్తూ పచ్చి బూతులు తిడుతున్నారు. బాలుర బట్టలు విప్పించి, డైపర్లు వేయించి, మర్మాంగాలపై కొడుతున్నారు. ఇతర ఖైదీల ముందే లైగింక వేధింపులకు గురిచేస్తున్నారు. ఇజ్రాయెల్ జైళ్ళలో పాలస్తీనీయులను అవమానించటం, హింసించటం చెదురు మదురు సంఘటనలు కాదనీ, ఇవి వ్యవస్థీకృతంగా చేస్తున్న నేరాలని కమిషన్‌తో పాటు ఇతర సంస్థలు చేసిన అధ్యయనంలో కూడా వెల్లడైంది. కొందరు బాలురను సైనికులు రేప్ చేసిన సంఘటనలను కమిషన్ పేర్కొంది. ఇజ్రాయెల్ సెటిలర్లు కూడా ఇదే విధమైన నేరాలకు పాల్పడుతున్నారు. ఇజ్రాయెల్ సెటిలర్లు పశువులను కాసుకొంటున్న 15 సంవత్సరాల వయసున్న ఇద్దరు పాలస్తీనా బాలురను నిర్బంధించి, వివస్త్రులను చేసి, వారిలో ఒకరిపై మూత్రం పోశారు. ఈ విధంగా హింసకు, అవమానాలకు గురైన బాలురు శారీరక గాయాలతో పాటు మానసికంగా కూడా గాయపడి, రాత్రిపగళ్ళు తీవ్రమైన భయంతో కాలం గడుపుతున్నారు.

### వైద్యశాలలపై దాడులతో పెరుగుతున్న శిశు మరణాలు

2023, అక్టోబరు 7వ తేదీకి ముందు గాజాలో పిల్లలకు వైద్యం చేసే ఆసుపత్రులు మూడు ఉన్నాయి. 12 సంవత్సరాల వయసు వరకు ఉన్న పిల్లలకు అవి వైద్యం చేసేవి. దాడులు ప్రారంభమైన రెండు నెలలలోనే ఈ మూడు ఆసుపత్రులను మూసి వేయించారు. తర్వాత తెరిచినప్పటికీ పాక్షికంగానే పని చేస్తున్నాయి. 2023 నవంబరులో ఒక ఆసుపత్రిపై దాడిచేసి, విద్యుత్ సరఫరా లేకుండా చేయటంతో ఆక్సిజన్ లేక ఒక శిశువు మృతి చెందింది. మరో ఎనిమిది మంది ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొన్నారు. రెండు ఆసుపత్రులను 30 నిముషాల వ్యవధిలో ఖాళీ చేయాలని ఆదేశించారనీ, ఈ క్రమంలో నలుగురు శిశువులు చనిపోయారనీ డాక్టర్లు చెప్పారు. ఇన్‌క్యూబేటర్ సదుపాయాలు లేకపోవటంతో అనేకమంది బాలలు చనిపోవటం, లేదా మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురికావడం జరుగుతున్నదని డాక్టర్లు వెల్లడించారు. 2023, అక్టోబరులో 126 ఇన్‌క్యూబేటర్లు ఉండగా, 2025, సెప్టెంబరుకు వాటి సంఖ్య 36కు తగ్గిపోయింది. నవజాత శిశువులకు వైద్యం అందించే సదుపాయాలు తగ్గిపోవటంతో నివారించదగిన బాలల మరణాల సంఖ్య పెరిగింది.

పాలస్తీనా ప్రజల పునరుత్పత్తి శక్తిని దెబ్బతీయటం కోసం ఐవిఎఫ్ సదుపాయం, లైంగిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆసుపత్రులను ధ్వంసం చేస్తున్నారు. గాజాలోని అతి పెద్ద గర్భధారణ కేంద్రమైన అల్-బస్మా ఆసుపత్రిలోని ఐవిఎఫ్ కేంద్రాన్ని ఇజ్రాయెల్ సేనలు 2023, డిసెంబరులో నాశనం చేశాయి. 2023, అక్టోబరు కన్నా 2024, అక్టోబరు నాటికి ప్రసవ సమయంలో తల్లుల మరణాలు మూడురెట్లు పెరిగాయి. నిర్దేశిత సమయం కన్నా ముందు పుడుతున్న బాలలు 9.5 శాతంగా ఉండగా, 2026, మార్చి నాటికి వీరితో పాటు తక్కువ బరువుతో పుట్టే బాలలు 70 శాతానికి పెరిగారు. పుట్టిన పిల్లలు ఇంతగా ఇబ్బందులను ఎదుర్కోవటం గాజాలో మినహా తానెక్కడా చూడలేదని 72 సంవత్సరాల వయసున్న పిల్లల డాక్టర్ చెప్పాడు. 2024 అక్టోబరు-2025 ఫిబ్రవరి మధ్య చలి వాతావరణం, తీవ్రమైన పోషకాహారలోపం, సరైన వసతి లేకపోవటం, విద్యుత్, ఇంధనం, ఆరోగ్యరక్షణ వసతులు పరిమితంగా ఉండటం లాంటి నివారించదగిన కారణాలతో 15 మంది పిల్లలు చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ చెప్పింది.

### పాఠశాలల విధ్వంసం

2023, అక్టోబరు 7, 2025, అక్టోబరు 11 తేదీల మధ్య 564 పాఠశాల భవనాలలో 459 భవనాలను ఇజ్రాయెల్ సైనికులు పేల్చివేశారు. వీటిలో 208 గాజా, 125 ఖాన్ యూనిస్, 95 ఉత్తర గాజా, 70 డైర్ అల్ బలాహ్, 66 రఫాలో ఉన్నాయి. 2023, అక్టోబరు 7వ తేదీకి ముందు ఈ పాఠశాలలు రోజుకు రెండు, మూడు షిఫ్టులలో పనిచేస్తుండేవి. దెబ్బతిన్న 459 పాఠశాలలలో 4,87,712 మంది విద్యార్థులున్నారు. 18,740 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

2023, అక్టోబరు 7వ తేది-2024, జులై మధ్య పాఠశాలలు, యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ శిబిరాలలో శరణార్థులుగా ఉన్న 10 లక్షల మందికి పైగా ప్రజలు ఇజ్రాయెల్ దాడులతో ఈతిబాధలకు గురయ్యారు. ఈ శిబిరాలలో ఉన్నవారిలో 851 మరణించారనీ, 2,567 మంది గాయపడ్డారనీ యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ 2025 నవంబరులో వెల్లడించింది. ముందుగా హెచ్చరికలు చేయకుండా, ఖాళీ చేయటానికి తగిన సమయం ఇవ్వకుండా పాఠశాలలపై దాడులు చేస్తుండటంతో ఎక్కువ నష్టం జరుగుతున్నది. తమ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలను గురించి ఘర్షణ పడుతున్న సైనిక విభాగాలకు ముందుగానే తెలియజేశామని, దాడులకు గురైన పాఠశాలలకు ఉన్న యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ గుర్తులు ఆకాశం నుండి చూసినా, రోడ్లపై నుండి చూసినా కనిపిస్తున్నాయని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల భవనాలపై జరిగిన దాడుల వలన 88

వేలమంది విద్యార్థులు నష్టపోయారు. పాఠశాల భవనాలను కూల్చివేయటం ఆటలాగా ఉన్నదని కొందరు ఇజ్రాయెల్ సైనికులు చెప్పారు. గాజాలో ఉన్న పాలస్తీనా సుప్రీంకోర్టు, ఇస్లామిక్ యూనివర్సిటీలను ధ్వంసం చేశారు. పాఠశాలకు వెళ్ళే వయసున్న బాలలు 6,68,000 మంది మూడు సంవత్సరాల విద్యను కోల్పోయారు. విద్యాభ్యాసం లేకపోతే బాలలు భవిష్యత్‌ను కోల్పోయినట్లేనని ఒక ఉపాధ్యాయుడు చెప్పిన విషయాన్ని కమిషన్ ఉటంకించింది.

గాజాలో విద్యావ్యవస్థను నాశనం చేయటం పాలస్తీనీయన్లను కొన్ని తరాల పాటు వెంటాడుతుంది. ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం వెనుకపట్టు పడుతుంది. మౌలిక సదుపాయాలను నాశనం చేయటం, మానవ వనరులు అభివృద్ధి కాకపోవటం వలన గాజా మానవ వనరుల అభివృద్ధి సూచి 69 సంవత్సరాలు వెనక్కుపోతుంది. మానవ మేధస్సు వృధా అయే పరిస్థితులను సృష్టిస్తుంది.

### అనాధలను ఆదుకుంటున్న సంస్థలపై దాడులు

2023, అక్టోబరు నుండి గాజాలో వేల సంఖ్యలో పిల్లలను కుటుంబాల నుండి దూరం చేయటం, వారు అనాధలుగా మారటం జరిగింది. పాలస్తీనా గణాంక శాఖ లెక్కల ప్రకారం 2020 నాటికి 17 సంవత్సరాల లోపు వయసున్న 26,349 మంది పిల్లలు తల్లిదండ్రులు ఇద్దరు, లేదా ఒకరిని పోగొట్టుకొని అనాధలుగా మారారు. 2023–25 అక్టోబరు నెలల మధ్య 58,554 మంది పిల్లలు తల్లిదండ్రులలో ఒకరు లేదా ఇద్దరిని పోగొట్టుకున్నారు. ఆలనా పాలనా చూడక వదిలేసిన పిల్లలు 18,000 వరకు ఉంటారు. సామాజిక సంరక్షణ వ్యవస్థ విచ్ఛిన్నం కావటంతో ఏ ఆధారం లేని పిల్లలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ సంరక్షణ ఏర్పాట్లు చేయలేదు. ఇళ్ళు ఖాళీ చేసినవారికి నివాసాలుగా అనాధలకు రక్షణ కల్పిస్తున్న వాటిలో నాలుగు భవనాలను కేటాయించారు. 2025లో గాజాలో 40 శాతం కుటుంబాలు ఇతరుల పిల్లలను సంరక్షిస్తున్నాయి.

2025, అక్టోబరు 13 నాటికి గాజా నుండి 19 లక్షల మందిని–90 శాతం– బల వంతంగా బయటి ప్రాంతాలకు పంపించారు. గాజాను ఆక్రమించుకున్న ఇజ్రాయెల్ అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలకు భిన్నంగా, అక్కడ నివసిస్తున్న ప్రజలను ఒక్క ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలిస్తూ, యుద్ధనేరాలకు పాల్పడింది. పౌరులు, పిల్లలను బలవంతంగా తరలించి, ఏ మాత్రం సురక్షితం కాని, అమానవీయ, ప్రమాదకరమైన ప్రాంతాలలో నివసించేలా చేస్తున్నారని కమిషన్ గుర్తించింది. నిరంతరం ఒకచోటు నుండి మరో చోటుకు తరలించటంతో నివాసం, మంచినీరు, ఆహారం, వైద్యం తదితరాల కోసం వెతుక్కోవలసి వస్తున్నది. తన పిల్లలకు కొంతైనా రక్షణ కల్పించటం కోసం పైన పట్టాకప్పి, కుక్కబోనులో నివసిస్తున్నట్లు ఒక మహిళ కమిషన్‌కు చెప్పింది. ఒకే బాత్‌రూంను వందల మంది వినియోగిస్తున్నారు. దానితో చర్మవ్యాధులు, డయేరియా తదితరాలతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

“ 2025, అక్టోబరు 13 నాటికి గాజా నుండి 19 లక్షల మందిని-90 శాతం- బల వంతంగా బయటి ప్రాంతాలకు పంపించారు. గాజాను ఆక్రమించుకున్న ఇజ్రాయెల్ అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలకు భిన్నంగా, అక్కడ నివసిస్తున్న ప్రజలను ఒకప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలిస్తూ, యుద్ధనేరాలకు పాల్పడింది. పౌరులు, పిల్లలను బలవంతంగా తరలించి, ఏ మాత్రం సురక్షితం కాని, అమానవీయ, ప్రమాదకరమైన ప్రాంతాలలో నివసించేలా చేస్తున్నారని కమిషన్ గుర్తించింది. ”

2007 నుండి పాక్షికంగా గాజాలోసాధారణ పౌరులకు ఆహారం అందకుండా చేసి, పస్తులతో చంపటాన్ని యుద్ధంలో ఒక భాగంగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్నది. పిల్లలు, బాలలలో ఇది తీవ్రమైన దుష్పరిణామాలకు కారణమౌతున్నది. మౌలిక సదుపాయాలతో పాటు వైద్య, ఆరోగ్య వ్యవస్థ మొత్తం ధ్వంసం కావటంతో చిన్నవి, సాధారణ వైద్యంతో తగ్గిపోయే జబ్బులు కూడా ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. పోషకాహారం లభించక పోవటంతో పిల్లల చర్మం, వెంట్రుకలు, పళ్ళ తీవ్రమైన మార్పులకు గురౌతున్నాయి. పళ్ళతో పాటు ఎముకలు కూడా బలహీనపడి విరిగిపోవటం, అవయవాలు పనిచేయకుండా పోవటానికి దారితీస్తుందని డాక్టర్లు చెప్పారు.

### ప్రమాదంలో బాలల మానసిక ఆరోగ్యం

యుద్ధం వలన ఐదు సంవత్సరాలలోపు వయసున్న పిల్లల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నదని 2024, నవంబరులో జరిగిన సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత 6–10 సంవత్సరాల వయసు పిల్లలు మానసికంగా ప్రభావితం అవుతున్నారు. గాజాలో ఉన్న 12 లక్షల మంది పిల్లలకు మానసిక ఆరోగ్యం, డిప్రెషన్, ఆందోళన, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనల నుండి బయటపడటానికి అవసరమైన మానసిక వైద్యం అవసరం ఉన్నదని 2024లో యూనిసెఫ్ వెల్లడించింది. తమకు ఇజ్రాయెల్ సైనికుల చేతిలో చావు తప్పదని గాజాలోని 96 శాతం మంది పిల్లలు భావిస్తున్నట్లు 2026, మార్చిలో యుఎన్ఎఫ్‌పిఎ చెప్పింది. భయంతో బిగుసుకుపోవటం, ఏమీ మాట్లాడలేక పోవటం, కలవరపడటం, ప్రతిచిన్న విషయానికి భయపడటం, మూత్ర విసర్జన తెలియకపోవటం తదితర సమస్యలను గాజాలోని బాలలు ఎదుర్కొంటున్నారు. గాజాలోని పిల్లలు అసాధారణ ప్రవర్తన, ఒంటరిగా ఉండటానికి ప్రాధాన్యత ఇవ్వటం, భవిష్యత్‌పై ఆశను కోల్పోవటం, పరిస్థితులను ఎదుర్కోవటానికి సన్నద్ధత లేకపోవటం, తదితర సమస్యలతో ఉన్నారని, వీటి వలన దీర్ఘకాలంలో వారి ప్రవర్తనలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటాయని 2025, ఏప్రిల్‌లో డబ్ల్యుహెచ్ఒ చెప్పింది. గాజాలోని మానసిక ఆరోగ్యవ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. 2023, అక్టోబరుకు ముందు వైద్యసేవలు అందిస్తున్న ఆరు మానసిక ఆరోగ్య కేంద్రాలను బలవంతంగా మూయించారు.

### బాల్యాన్ని పరిహసిస్తున్న ఇజ్రాయెల్ సైనికులు

బాలలను ఎగతాళి చేస్తూ, ఆయుధాలను ప్రదర్శిస్తూ, బాల్య చిహ్నాలను ఇజ్రాయెల్ సైనికులు అవమానపరుస్తున్నారు. కనీసం 35 ప్రైవేటు స్థలాలలో– పిల్లల బెడ్‌రూంలు, స్కూల్స్, యూనివర్సిటీలు, ఫ్యాన్సిస్టోర్లు, తదితర బహిరంగ ప్రదేశాలలో, తాము ధ్వంసం చేసిన ప్రదేశాలలో, సైనిక కేంద్రాలలో– సైనికులు తమ దుశ్చర్యలను గొప్పలుగా ప్రదర్శించుకుంటూ వీడియోలు తీసుకున్నారు. ఇజ్రాయెల్ సైన్యం పాలస్తీనా ప్రజలు, ముఖ్యంగా బాలలను అవమానపర్చటం, మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్న తీరును ఇవి కళ్ళకు కడుతున్నాయి. 2023, అక్టోబరు 7–2025, అక్టోబరు మధ్య గాజాలో ఇజ్రాయెల్ దాడులలో మరణించిన వారిలో 27 శాతం చిన్న పిల్లలు ఉన్నారు. *

# ఫైడల్ కాస్ట్రో

(2వ పేజీ తరువాయి)

తర్వాత 1952లో కాస్ట్రో ప్రతినిధుల సభకు పోటీ చేయడం ద్వారా జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. కానీ కార్లోస్ ప్రియో సోకారాస్ ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు చేసి అధికారం చేపట్టిన ఫుల్జెన్సియో బాటిస్టా దేశంలో ఎన్నికలను నిషేధించాడు. ఇలాంటి పరిస్థితిలో క్యూబాలో రాజకీయ పోరాటంలో పాల్గొనడానికి ఎన్నికలు, చట్టపరమైన ఫిర్యాదులు సరైన మార్గం కాదని అర్థం చేసుకున్నాడు కాస్ట్రో.

**విప్లవ పోరాటానికి ఆరంభం**

క్యూబాలో ఉన్న పరిస్థితుల్లో పలువురు యువ విప్లవకారులు సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నారు. 1953 జూలై 26న, వారు వేలాది ఆయుధాలు నిల్వ ఉన్న రెండు సైనిక స్థావరాలపై దాడి చేశారు. అందులో ఒకటి, శాంటియాగో డి క్యూబాలోని "మోంకాడా" సైనిక బారక్. మరొకటి, బయామోలోని "కార్లోస్ మాన్యుయెల్ డి సెస్పెడెస్" సైనిక స్థావరం. ఈ స్థావరాలు బాటిస్టా నియంతృత్వాన్ని ప్రజలు ఎక్కువగా వ్యతిరేకించే ప్రాంతాలలో ఉన్నాయి. ఈ దాడి, నియంతృత్వాన్ని వ్యతిరేకించే ప్రజల్లో సాయుధ విప్లవ కారుల పట్ల సానుభూతిని రేకెత్తిస్తుందని వారు ఆశించారు. కానీ వారి ప్రణాళికలు విఫలమయ్యాయి. బాటిస్టా సేనలు 80 మందికి పైగా యువ విప్లవకారులను ఊచకోత కోసి చంపేశాయి.

ప్రతి సైనిక వైఫల్యం తప్పనిసరిగా రాజకీయ వైఫల్యం కాదని కాస్ట్రో త్వరగా గ్రహించాడు. ఆయనపై విచారణ జరిగింది. కాస్ట్రో కోర్టులో తానే స్వయంగా వాదిస్తూ తిరుగుబాటును సమర్థించాడు. అర్ధ శతాబ్దం క్రితం మరణించిన క్యూబన్ స్వాతంత్ర్య వీరుడు జోస్ మార్టీ తమ తిరుగుబాటుకు స్ఫూర్తి అని ప్రకటించాడు. స్పెయిన్ నుండి క్యూబాకు స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ సామ్రాజ్యవాద ఆధిపత్యం ఇంకా కొనసాగుతున్నందున స్వాతంత్ర్య పోరాటం ముగిసిపోలేదని చెప్పాడు. తాము ఓడిపోయినప్పటికీ తాము చేసిన పని సరైందేనని ప్రకటించాడు. సాహసంగా అనిపించినా ఇది సరైందని కాలమే నిర్ణయిస్తుంది, "చరిత్ర నన్ను నిర్దోషిగా ప్రకటిస్తుంది," అని కాస్ట్రో న్యాయమూర్తి ముందు ప్రకటించాడు.

విచారణ తరువాత ఆయన రెండేళ్లు ఖైదులో ఉన్నాడు. ఆ తర్వాత మే 15, 1955న నిర్దోషిగా విడుదలైనప్పటికీ కాస్ట్రోను వదిలించుకోవాలనుకున్న నియంత బాటిస్టా, కాస్ట్రోను క్యూబా నుండి బహిష్కరించాడు. దాంతో కాస్ట్రో అమెరికా, మెక్సికోల్లో ప్రయాణించాడు. మెక్సికోలో, ఆయన స్పానిష్ అంతర్యుద్ధంలో పాల్గొన్న మాజీ యోధుడు అల్బెర్టో బాయో వద్ద సైనిక శిక్షణ తీసుకుని ఒక సాయుధ తిరుగుబాటు బృందాన్ని ఏర్పాటు చేశాడు. అందులో ఎర్నెస్టో చె గువేరా కూడా ఒక సభ్యునిగా చేరాడు. ఈ కొత్త రాజకీయ–సైనిక బృందానికి (1953 మాంకాడా దాడి జ్ఞాపకార్థం) "జూలై 26 ఉద్యమం" అని పేరు పెట్టారు. బాటిస్టా నియంతృత్వాన్ని ఓడించి, మరింత సమానత్వంతో కూడిన దేశాన్ని సృష్టించడం ఈ ఉద్యమ లక్ష్యం.

**క్యూబా విప్లవం**

చె గువేరా, కాస్ట్రోలతో సహా 82 మంది యువకులు క్యూబాలో విప్లవం సాధించడానికి "గ్రాన్మా" అనే నౌకలో బయలు దేరారు. నౌక 1956 నవంబర్ 25న వెరాక్రూజ్ తీరం నుండి క్యూబాకు బయలుదేరింది. వారు డిసెంబర్ 2న కొన్ని రోజుల ఆలస్యంగా క్యూబాకు చేరుకున్నారు. ఈలోగా గ్రాన్మా నౌక రాకకు మద్దతుగా శాంటియాగో డి క్యూబాలో ఫ్రాంక్ పైస్ నాయకత్వంలో పట్టణ తిరుగుబాటు జరిగింది. వీరి ప్రణాళికను పసికట్టిన బాటిస్టా సైన్యం ముందు పైస్ నాయకత్వంలోని పట్టణ తిరుగుబాటును అణచివేసింది. తరువాత కాస్ట్రో నాకయకత్వంలోని విప్లవ దళాలపై తమ పూర్తి శక్తితో దాడి చేసింది. కాస్ట్రో బృందం అనేక చోట్ల గెరిల్లా పద్ధతిలో బాటిస్టా సైన్యాన్ని ఎదుర్కొన్నప్పటికీ నిలవలేకపోయింది. తిరుగుబాటుదారులు యుద్ధంలో చెల్లా చెదురయ్యారు. అనేక మంది చనిపోయారు. 82 మంది సభ్యులలో 17 మంది మాత్రమే ప్రాణాలతో మిగిలారు. వారిలో కాస్ట్రో, ఆయన సోదరుడు రావుల్ కాస్ట్రో, చే గువేరా ఉన్నారు. వీరంతా సీర్రా మాస్ట్రా అడవులలో ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని, ఆయుధాలను సంపాదించడానికి చిన్న సైనిక స్థావరాలపై దాడులు చేయడం ప్రారంభించారు. 1957 జనవరిలో వారు లా ప్లాటా వద్ద సముద్ర తీరానికి సమీపంలో ఉన్న సైనిక స్థావరాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు బాటిస్టా నియంతృత్వ పాలనపట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్న రైతుల మద్దతు సంపాదించడం ప్రారంభించారు. అనేక మంది స్థానికులు, పట్టణాలనుండి వచ్చిన మధ్యతరగతి యువకులు తిరుగుబాటు దళాల్లో చేరారు.

1957 జూలైలో కాస్ట్రో దళాలు ఐదు విభాగాలుగా విడిపోయాయి. వాటికి కాస్ట్రో, అతని సోదరుడు రావుల్ కాస్ట్రో, కామిలో సియెన్‌ఫ్యూగోస్, చే గెవారా, జువాన్ అల్మెయిడా నాయకత్వం వహించారు. అయితే, బాటిస్టా సైన్యంలో 70,000 మందికి పైగా సైనికులు ఉండటంతో, జూలై 26 ఉద్యమం దేశంలోని వివిధ ప్రాంతాలలో గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించింది. బాటిస్టా "ఆపరేషన్ సమ్మర్" పేరుతో సైనిక దాడిని ప్రారంభించాడు. తిరుగుబాటు సైన్యాన్ని నాశనం చేయడానికి 17 పటాలాలను పంపాడు, కానీ ప్రజల మద్దతు ఉన్న విప్లవ శక్తులు గెరిల్లా యుద్ధ తంత్రంతో వరుస విజయాలు సాధిస్తూ ప్రభుత్వ సేనలను తిప్పి కొట్టాయి. ఈ విజయాలతో కాస్ట్రో ప్రజా దరణ మరింత పెరిగింది. నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తున్న వివిధ వర్గాలను ఏకం చేయగల ఏకైక నాయకుడిగా ఆయన గుర్తింపు పొందాడు.



సీర్రా మీస్ట్రా అడవుల్లో గెరిల్లా దళంతో కాస్ట్రో

అంతేకాకుండా, కాస్ట్రో చాలా చాకచక్యమైన సైనిక వ్యూహకర్త అని కూడా నిరూపించుకున్నాడు. క్లిష్ట సమయాల్లో తన సైన్యాన్ని వెనక్కి రప్పిస్తూ, భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి చిన్న అవకాశం దొరికినా నిర్భయంగా ఎదురు దాడి చేసేవారు. ఈ విధంగా, 1958 చివరి నాటికి దేశంలోని తూర్పు, మధ్య ప్రాంతా లలో అధిక భాగాన్ని కాస్ట్రో సేన జయించ గలిగింది. చె గువేరా, అతని సైన్యాలు బాటిస్టా చివరి వ్యూహాత్మక రక్షణ కేంద్రమైన శాంటా క్లారా నగరాన్ని స్వాధీనం చేసుకున్నాయి.

సరిగ్గా ఈ సమయంలో బాటిస్టాను విదేశాలకు పంపి హవానాలో మరో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని పెట్టడానికి అమెరికా ప్రయత్నించింది. దీన్ని పసిగట్టిన కాస్ట్రో దళాలు ముందుగానే తుది దాడికి దిగడం ద్వారా కీలుబొమ్మ ప్రభుత్వ ఏర్పాటును నివారించి, నిజమైన విప్లవ దాడికి పూనుకున్నాయి. "విప్లవం కావాలి, సైనిక తిరుగుబాటు వద్దు" అని కాస్ట్రో రేడియోలో చెప్పిన మాటలు క్యూబా అంతటా మారుమోగాయి. అయితే, అమెరికా రాయబారి ఎర్ల్ టి. స్మిత్ మద్దతుతో బాటిస్టా క్యూబా నుండి పారిపోగలిగాడు. చివరికి 1959 జనవరి 1న హవానా విప్లవ కారుల వశమైంది. క్యూబా విప్లవం విజయం సాధించింది. ఆ విధంగా క్యూబాలోనే కాదు లాటిన్ అమెరికా ఖండంలో ఒక కొత్త శకం ప్రారంభమైంది.

1959 ఫిబ్రవరి 16న, కాస్ట్రో క్యూబా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాస్ట్రో ప్రభుత్వం క్యూబన్ల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి సామాజిక ప్రాజెక్టులపై దృష్టి సారించింది. విద్యపై ప్రధానంగా దృష్టి పెట్టారు. కాస్ట్రో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి 30 నెలల్లో, గత 30 సంవత్సరాలలో కంటే ఎక్కువ తరగతి గదులు ప్రారంభించబడ్డాయి. సగం సమయం తరగతి గదిలో, మిగిలిన సగం ఉత్పాదక కార్యకలాపంలో గడిపే పద్ధతిలో 'వర్క్-స్టడీ కార్యక్రమాన్ని' ప్రారంభించి దేశంలో అక్షరాశ్యతను అనతి కాలంలోనే పెంచారు. ఆరోగ్య సంరక్షణను జాతీయం చేసి, విస్తరించారు. ఉచిత వైద్య సహాయం అందించడానికి క్యూబా అంతటా గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, పట్టణ పాలిక్లినిక్‌లు ప్రారంభించారు. బాలల వ్యాధుల నివారణకు సార్వత్రిక టీకా కార్యక్రమం అమలు చేశారు. దీంతో శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ఈ సామాజిక కార్య క్రమంలో మరో భాగం మౌలిక సదుపాయాల మెరుగుదల. కాస్ట్రో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే, క్యూబా అంతటా 1,000 కిలోమీటర్ల రహదారులు నిర్మించారు. అదే



ఉద్యమ సహచరుడు చే గువేరాతో కాస్ట్రో

సమయంలో నీరు, పారిశుధ్య ప్రాజెక్టులపై పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. పరిపాలన తొలి సంవత్సరాలలో నిరాశ్రయతను తగ్గించే ప్రయత్నంలో భాగంగా ప్రతి నెలా 800కు పైగా ఇళ్లను నిర్మించారు, అదే సమయంలో పిల్లల కోసం నర్సరీలు, డే-కేర్ సెంటర్లు, వికలాంగులు, వృద్ధుల కోసం ఇతర కేంద్రాలను ప్రారంభించారు.

### అమెరికా కుట్రలు

లాటిన్ అమెరికా మొత్తాన్ని తన పెరటి దొడ్డిగా భావించిన అమెరికాకు, విప్లవ క్యూబా సోషలిస్టు బాట పట్టడం కంటగింపయింది. క్యూబాపై ఆర్థిక దిగ్బంధనం విధించింది. క్యూబాలో సోషలిస్టు సంస్కరణలను వ్యతిరేకించే వారికి ఫ్లోరిడాలో ఆశ్రయం కల్పించి అక్కడి నుండి క్యూబాపై కుట్రలు ప్రారంభించింది. ఒక దేశాధి నేత అయిన కాస్ట్రోను హత్య చేయడానికి అమెరికా గూఢచారి సంస్థ 'సిఐఎ' అనేక ప్రయత్నాలు చేసింది. వీటిలో కొన్నింటి గురించి అమెరికా సెనెట్ కమిటీలో అంగీకరించింది కూడా. కాస్ట్రోకు ఇష్టమైన చుట్టలో పేలుడు పదార్థం పెట్టి చుట్ట ముట్టించగానే పేలిపోయేట్లు పథకం వేశారు. ఒక సారి ఆయనకు ఇచ్చిన చాక్లెట్ మిల్క్ షేక్‌లో విషం కలిపారు. మొత్తం మీద కాస్ట్రో అధికారంలో ఉన్న 40 ఏళ్లలో ఆయనపై 600కు పైగా హత్యాయత్నాలకు సిఐఎ పాల్పడిందని క్యూబా గుఢాచారి సంస్థ మాజీ అధిపతి ఫాబియన్ ఎస్కలాంటె చెప్పారు. అమెరికా అధ్యక్షునిగా ఐసెన్‌హోవర్ ఉన్నప్పుడు 38సార్లు, కెన్నడీ హయాంలో 42 సార్లు, జాన్సన్ హయాంలో 72 సార్లు, నిక్సన్ పదవీ కాలంలో 184 సార్లు, జిమ్మీ కార్టర్ హయాంలో 64 సార్లు, రొనాల్డ్ రీగన్ ప్రభుత్వ కాలంలో 197 సార్లు, జార్జి బుష్ సీనియర్ కాలంలో 16 సార్లు, బిల్ క్లింటన్ హయాంలో 21 సార్లు కాస్ట్రో మీద హత్యా యత్నాలు చేశారు. విశేషమేమంటే ప్రపంచ ఉగ్ర దేశపు హత్యా యత్నాలన్నిటినీ అదిగమించి కాస్ట్రో నిండు 90 ఏళ్లు జీవించారు.


అమెరికా నుండి అష్ట దిగ్బంధనాలను ఎదుర్కొంటూనే క్యూబా మానవాభివృద్ధిలో అమెరికాకు సమానంగా ఇంకా చెప్పాలంటే అనేక అంశాల్లో అమెరికాను మించిపోయింది. అమెరికా తలసరి జిడిపి సుమారు 44 వేల డాలర్లు కాగా క్యూబా తలసరి జిడిపి 9 వేల డాలర్లు మాత్రమే. అయినా క్యూబా ప్రజల ఆయుప్రమాణం నేడు అమెరికాతో సమానంగా 80 ఏళ్ల వద్ద ఉంది. అమెరికా ప్రజల్లో అక్షరాశ్యత 79 శాతం కాగా క్యూబా ప్రజల్లో అది 99.8 శాతం అంటే సంపూర్ణ అక్షరాశ్యత సాధించింది. అమెరికాలో ప్రతి వెయ్యిమంది ప్రజలకు 2.68 ఆసుపత్రి పడకలు ఉండగా క్యూబాలో 4.33 ఉన్నాయి. అమెరికాలో ప్రతి వెయ్యిమందికి 3.68 మంది వైద్యులు ఉండగా క్యూబాలో 9.54 మంది ఉన్నారు. క్యూబా తన ప్రజలకు విద్య, వైద్యం అందించడమే కాదు, ప్రపంచంలో ఎక్కడ ఏ దేశంలో ఏ ప్రజలకు ఆపద వచ్చినా, భూ కంపాలు, అంటువ్యాధులు వంటి విపత్తులు సంభవించినా అక్కడికి తన వైద్య బృందాలను పంపిస్తుంది.

అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అలీనోద్యమాన్ని నిలపడంలో ఫైడల్ కాస్ట్రో ముఖ్య భూమిక పోషించారు. అంతేకాదు, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా దేశాల్లో అనేక జాతీయ విముక్తి ఉద్యమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం అందించారు.

అయితే 1991లో సోవియట్ విచ్ఛిన్నం తరువాత క్యూబా తీవ్రమైన ఇబ్బందుల్లో పడింది. ఇంధన కొరత ఏర్పడింది. ఆహారం, మందులు ఇతర దేశాల నుండి రాకుండా అమెరికా ఆంక్షలు, దిగ్బంధనం మరింత పెంచింది. అయినప్పటికీ 'సోషలిజమో, చావో' అని కాస్ట్రో ఇచ్చిన పిలుపుతో క్యూబా ప్రజలు సోషలిజాన్నే ఎంచుకుని అమెరికా కుట్రలకు ఎదురునిలిచారు. వెనిజులాలో హ్యూగో చావెజ్ అధికారంలోకి వచ్చిన తరువాత లాటిన్ అమెరికాను అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలపడంలో కాస్ట్రో ప్రముఖ పాత్ర నిర్వహించారు. అందువల్ల అమెరికా కాస్ట్రోపైనా, క్యూబాపైనా మరింత కక్ష కట్టింది. ఇప్పటికీ ఆ చిన్న ద్వీప దేశాన్ని అమెరికా వేధిస్తూనే ఉంది. చివరికి వెనుజులాలో మాదిరిగా క్యూబాపైన కూడా త్వరలో దాడి చేస్తామనీ, వెనుజులా అధ్యక్షుడు మదురోను అరెస్టు చేసినట్లు క్యూబా విప్లవ వీరుడు, మాజీ అధ్యక్షుడు, ఫైడల్ కాస్ట్రో సోదరుడైన రావుల్ కాస్ట్రోను అరెస్టు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘీంకరిస్తున్నాడు. కాస్ట్రో స్ఫూర్తితో క్యూబా ఈ కష్ట కాలాన్ని అధిగమించాలని కోరుకుందాం. *

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 22, issue: 3 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# బలవంతులవద్ద పోగుపడ్డ ఆయుధాలు పేదలను చంపుతాయి కానీ పేదరికాన్ని చంపవు



- ఫైడల్ కాస్ట్రో

"మహా ధనికులు, మహా బలశాలుల వద్ద నిరంతరాయంగా పేరుకుపోతున్న ఆధునిక ఆయుధాలు నిరక్షరాశ్యులను, రోగులను, పేదలను, అన్నార్తులను చంపవచ్చు కానీ అవి అజ్ఞానాన్ని, రోగాలను, పేదరికాన్ని, ఆకలిని మాత్రం చంపలేవు"

"విప్లవం పూల పాన్పు కాదు. విప్లవం అనేది భవిష్యత్తుకూ, గతానికీ మధ్య పోరాటం"

"మానవాళి ఎప్పుడూ తమ బానిస సంకెళ్లు తెంచుకున్న వారి నుండి నేర్చుకుంటుంది. మానవాళిని శతాబ్దాల పాటు బానిస శృంఖలాల్లో బంధించిన వాళ్లు మానవాళికి ఏమీ నేర్పలేరు."

"క్యూబా విప్లవాన్ని ఎగుమతి చేయాలనుకుంటున్నది అని మమ్మల్ని విమర్శిస్తున్న వాళ్లకు మా సమాధానం ఒక్కటే: విప్లవాలు ఎన్నడూ ఎగుమతి చేయబడవు, అవి ప్రజల చేత నిర్మించబడతాయి."

"మానవ హక్కుల గురించి తరచూ మాట్లాడుతుంటారు, దాంతోపాటు మానవాళి హక్కుల గురించి కూడా మాట్లాడ్డం అవసరం. కొంతమంది విలాసవంతమైన కార్లలో తిరగడం కోసం మరికొంతమంది కాళ్లకు చెప్పులు కూడా లేకుండా ఎందుకు నడవాలి? కొందరు 70 ఏళ్లు నివసించడం కోసం మరికొందరు 35 ఏళ్లు మాత్రమే ఎందుకు జీవించాలి? కొంతరు అత్యధిక ధనికులుగా ఉండడం కోసం మరికొందరు కటిక పేదలుగా ఎందుకుండాలి? ఈ లోకంలో ఒక్క పిడికెడన్నం లేని పిల్లల కోసం నేను మాట్లాడతాను. మందులు దొరకని రోగుల కోసం, జీవన హక్కులు, మానవ గౌరవం నిరాకరించబడిన వారికోసం మాట్లాడతాను".

"అజ్ఞానం అనేది అనేక చెడులకు మూలం. ఎన్ని ఇబ్బందులున్నప్పటికీ దేశాలు తమ ఆశలు నెరవేర్చుకోవాలన్నా, నిజమైన విముక్తి పొందాలన్నా, మంచి ప్రపంచాన్ని నిర్మించుకోవాలన్నా విజ్ఞానం అనేది వాటికి ప్రాథమిక మిత్రునిగా ఉండాలి".

"(క్యూబా ప్రపంచంలోనే అత్యధిక అక్షరాశ్యత ఎలా సాధించగలిగింది?) మన వద్ద అతి తక్కువ విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు, మనం యుద్ధాలమీద కన్నా అయిదు రెట్లు ఎక్కువ పాఠశాలలమీద ఖర్చు చేస్తాం. కానీ అమెరికా పరిస్థితి దానికి రివర్స్‌లో ఉంటుంది".

"పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ సమస్యలనూ పరిష్కరించలేదు. అది ప్రపంచాన్ని దోచుకుంది. మనకి ఇంత పెద్ద ఎత్తున పేదరికాన్ని ఇచ్చింది. అది వాస్తవ పరిస్థితులతో పొసగని వినియోగదారీ నమూనా జీవన విధానాన్ని మనకిచ్చింది. అది నీళ్లను కలుషితం చేసింది. సముద్రాలను, నదులను, సరస్సులను, వాతావరణాన్ని, భూమిని కలుషితం చేసింది. వనరులను దారుణంగా వ్యర్థం చేస్తున్నది."

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ. 15**, సంవత్సర చందా:**రూ. 150**, పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................

వీధి..........................

గ్రామం..........................

మండలం లేదా పట్టణం..........................

జిల్లా..........................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.